
# ఆంధ్ర సచిత్ర వారపత్రిక

జనవరి, '85

2/-





శోభన్ బాబు, సుహాసిని, "జాకీ"

# నోటి దుర్వాసన పోగొట్టుకోండి. దంతక్షయాన్ని ఎదుర్కోండి.




# మీ కుటుంబంలోని వారికి కోల్గేట్ రక్షణ చక్రాన్ని ఇవ్వండి!

క్రమం తప్పకుండా కోల్గేట్ ని వాడటంతో మీ కుటుంబంలోని
వారి నోటి శ్వాస శుభ్రంగా, తాజాగా ఉంటుంది, వారి పళ్ళు యిక దృఢంగా,
ఆరోగ్యంగా ఉంటాయి. కోల్గేట్ రక్షణ చక్రం చేసేది అదే,
వారికది యివ్వడం అందుకే.

**మీరు పళ్ళు తోముకున్న ప్రతిసారీ, కోల్గేట్ యొక్క నమ్మకమైన ఫార్ములా చేసేదిది-చూడండెలాగో.**



మీ పళ్ళలో యిరుక్కుపోయిన ఆహారపు తునకల్లో దుర్వాసన, దంతక్షయం కలిగించే సూక్ష్మజీవులు పెరుగుతాయి.



కోల్గేట్ లోని అద్వితీయమైన శక్తిగల నురగ లోపలికి చొచ్చుకుపోయి, అక్కడ గల దుర్వాసన కలిగించే ఆహారపు తునకల్ని, దంతక్షయాన్ని కలిగించే సూక్ష్మజీవుల్ని తొలగిస్తుంది.



క్రమం తప్పకుండా కోల్గేట్ తో పళ్ళు తోముకుంటే, దాంతో యిక మీకు శుభ్రమైన, తాజా శ్వాస, దాంతోటే దృఢమైన, ఆరోగ్యమైన పళ్ళూను.

**భోజనం చేసిన తర్వాత ప్రతిసారి మీ కుటుంబంలో వారంతా కోల్గేట్ తో పళ్ళు తోముకుంటున్నారని ధృవపరుచుకోండి. నోటి దుర్వాసన పోగొట్టుకోండి. దంతక్షయాన్ని ఎదుర్కోండి. వారికి కోల్గేట్. రక్షణ చక్రాన్ని యివ్వండి.**




## దీని తాజా పిప్పరమెంట్ రుచి మీకెంతో నచ్చుతుంది!

## ఆడావాళ్ళూ ! మీకు జోహార్లు !

7-12-84న కమల్‌హాసన్ ముఖ చిత్రంతో వెలువడిన ఆంధ్ర సచిత్ర వారపత్రిక చాలా బాగుంది కాకాని కమలగారి "ఆడవాళ్ళూ! మీకు జోహార్లు" కథ, కార్టూన్లు చాలా బాగున్నాయి

—డి రాజయ్య, దోర్నకల్

## బాగుంది.

ఆంధ్ర పత్రికలో ఫోటో సెట్టింగ్ పెట్టిన తర్వాత ప్రింటింగ్ చాలా బాగుంటోంది

ఎమ్ వెంకటేశ్వరరావు, నరసరావుపేట

## కేదార్‌నాథ్


క్యాప్టెన్ షేక్ మౌలాలీగారి సచిత్ర వ్యాసం దివ్యమైన కేదార్‌నాథ్‌లో అందించిన సమాచార విశేషాలు బాగున్నాయి వారు హిందూ దేవాలయం గూర్చి వ్రాయడం మన సెక్యులర్ వ్యవస్థకు చక్కని నిదర్శనం. రచయితకు అభినందనలు

సమ్మెట గోవర్ధన్, గంభీరావుపేట

## అద్దం పట్టాలి

అన్నీ రద్దు! నిజమే! అది అత్యధికులకు ముద్దు
కొందరి కోసం కాదు దేశం
అందరికి కావాలి సమానత్వం
అందులో కొంత హెచ్చు తగ్గులు సహజం
లేదు- కనపడదు స్వార్థం
అత్యధికుల ప్రయోజనాలే ముఖ్యం
ఇది ప్రజాస్వామ్య
గణతంత్ర సిద్ధాంతం

యీ ఎన్నికల వేడిలో కాస్త ఉద్వేగం, సంకుచిత ధోరణి ఉత్తరాలశీర్షికలో చోటు చేసుకుంటుంది




ఏ పరిస్థితిలోనైన పత్రికలు అద్దం పట్టాలి హారతి పట్టకూడదు.

ఏ. ఆర్. మూర్తి, కడప




ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938-1972)
శుక్రవారం, 4-10 జనవరి, '85
శ్రీ రక్తాక్షినామ సం. పుష్య శు త్రయోదశి
సంపుటము 77 : సంచిక 18
సంపాదకుడు
శివలెంక రాధాకృష్ణ

| | |
|---|---|
| విడిప్రతి వెల | రు. 2-00 |
| ఆరు మాసాల చందా | రు. 55-90 |
| పోస్టులో ఏడాది చందా | రు. 111-80 |

ఆంధ్రపత్రిక కార్యాలయము,
గాంధీనగరం, విజయవాడ-520 003


## విషయానుక్రమణిక

ముఖచిత్రం :

"చట్టంతో పోరాటం"లో మాధవి, చిరంజీవి

## న్యూఢిల్లీ లేఖ



డా. జయదుబాషి

# 1977లో జరిగిందేమిటి ?

ఎప్పుడైతే మీరు అబద్ధాలతో కడుపు నింపుకుంటారో, అప్పుడే దొంగ లెక్కలు తయారు చేస్తారు అబద్ధాలకోరులందరి విషయంలోనూ, ముఖ్యంగా డా జోసెఫ్ గోబెల్స్‌ను మార్గదర్శకునిగా భావించేవారిలో, ఈ తతంగం ఉండనే ఉంటుంది అధికారపార్టీవారు కేవలం తమ పత్రికా ప్రకటనల మీదే 7కోట్లు కర్చు పెడుతున్నారని నేను విన్నాను ఇది స్త్రీలు, పురుషులు, పిల్లలు ఎవరైనా సరే దేశంలో ఒక వ్యక్తికి 10 పైసల చొప్పున కర్చు అన్న మాట కాంగ్రెసు (ఐ)కి ప్రజలలో ఆకర్షణ బాగా పెరిగేలా చేసేందుకు వారు తమ పత్రికా ప్రకటనలో సగటు ఓటరు కోసం సాధ్యమైనన్ని ఎక్కువ అబద్ధాలు పోగు చేస్తున్నారే తప్ప అంతకు మించి ఏమీ లేదు

"తన కుటుంబాన్నీ, ఆస్థినీ రక్షించుకోడానికి ఎప్పుడు, ఎందుకు ఒక వ్యక్తికి ఆయుధం అవసరం అవుతుంది?" అని ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఇంకా ఆ ప్రకటన ఇలా సాగింది. "పరిరక్షకులే అజాగరూకులైతే విష సర్పాలు బొరియల లోంచి బయటకొస్తాయి. విధ్వంసక శక్తులు వీధుల్లో మాటేస్తాయి. మామూలు పౌరులుగా కనిపించే కొందరు వాళ్ల ముసుగులు తొలగించుకొని నీడల్లో తారటలాడతారు అదనుకోసం, ఇనుప పూచలూ, కత్తులూ కరార్లూ వాడే సమయం కోసం "

దీనికంతటికీ "1977 గుర్తుందా?" అని పేరు పెట్టారు

విష సర్పాలు బొరియలలోంచి రావటం, తుపాకులు కాల్చడానికి, విధ్వంసక శక్తులు వీధుల్లో మాటేయడం అనే వర్ణనంతా శ్రీమతి గాంధీ హత్యానంతరం జరిగిందని నేననుకుంటాను ఇది ఖచ్చితంగా ఢిల్లీ తదితర ప్రాంతాలలో జరిగినదే. వాస్తవానికి శ్రీమతి గాంధీ పాలనలోని చివరి సంవత్సరం తుపాకీ సంవత్సరం, ఆ సంవత్సరంలో ప్రతి గంటా తుపాకీ కోసమే, తుపాకీతోనే పని అని నేనంటాను, ఆ సంవత్సర ప్రథమార్థంలో అధికార పార్టీకి ఆప్త మిత్రులైన జర్నైయిల్‌సింగ్ భింద్రన్‌వాలె, ద్వితీయార్థంలో బీయాంత్ సింగ్, సత్వంత సింగ్‌ల చేతుల్లో జరిగింది. కాంగ్రెసు (ఐ) ప్రకటనలలో చెప్పే ఆ తుపాకీ దురదృష్టపు ఘడియలలో శ్రీమతి గాంధీ ప్రాణాలు కోల్పోయారు ఇప్పుడు ఢిల్లీ వెళ్లినట్లయితే తుపాకుల రణగొణ ధ్వనులు ఇంకా మీరు వినగలరు ముఖ్యంగా ఈ ధ్వనులు 1, సఫ్దర్‌గంజ్ రోడ్ చుట్టు ప్రక్కల ఎక్కువగా వింటాము ఇది కేవలం తుపాకుల సమయం మాత్రమే కాదు. తుపాకుల సంస్కృతి కూడా. ఈ సంస్కృతిని అంటే విద్రోహ చర్యల సంస్కృతిని ఒకనాడు మహాత్మాగాంధీ దేశం అనుకున్న మన దేశానికి పాలకపార్టీ బహుమతిగా ఇచ్చింది. ఇప్పుడు అందుకు పూర్తిగా భిన్నంగా ఉన్న గాంధీ మీకు పాలకుడుగా ఉన్నారు సంస్కృతి కూడా భిన్నమైనదే

1977 గుర్తుకు తెచ్చుకోండి? అని అడగటానికి అసలు సిగ్గు పడాలి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత బహుశః మంచి సంవత్సరం అయిన 1977లో ఏమి జరిగింది పంజాబు, అస్సాంలలో స్త్రీలు, పురుషులు, పిల్లలు బస్సులలోంచి బయటికి లాగబడ్డారా? మారణహోమం జరిగిందా? స్త్రీలు, పురుషులు, పిల్లలు ఇండ్లలో నుంచి బయటికి ఈడ్చబడి ఢిల్లీ వీధులలో సజీవ దహనం చేయబడ్డారా? రాజధానికి వెళ్లే రైళ్ల నుండి బయటికి ఈడ్వబడి హింసింపబడ్డారా? ఆ విధమైన చర్య ఏదీ 1977లో జరుగలేదు అది నిజంగా ప్రశాంతంగా గడిచిన సంవత్సరం ఆ సంవత్సరంలోనే 30కోట్ల ఓటర్లు ఎన్నికల్లో పాల్గొని ఓట్లు వేసి కాంగ్రెసు (ఐ)కి బుద్ధి చెప్పారు గోధుమలు, చక్కెర, బియ్యం ఏ షాపులలో చూసినా రాసులుగా సశ్యశ్యామలంగా, ప్రశాంతంగా ఉన్న సంవత్సరం అది దశాబ్దకాలంలో అతి తక్కువ ధరలు పెరిగి రికార్డులకెక్కిన సంవత్సరం కూడా అదే ప్రణబ్ ముఖర్జీవంటి వారు ఆలోచించని విధంగా ఒక శాతంలో మూడవ వంతుకు మించి ధరలు పెరగలేదు

వృద్ధ నాయకులు పోట్లాడుకొని ఉండవచ్చు కానీ వారి అభిప్రాయ భేదాల పరిష్కారానికి వారు తుపాకులను ఆశ్రయించలేదు సైన్యాన్ని అప్రమత్తం చేయలేదు. దేశానికి ముళ్ల కంచతో చుట్టూ దడి కట్టలేదు. ఢిల్లీ వీధుల్లో ఎక్కడా హింసాకాండలు జరుగలేదు వివాదాలు ఏవైనా ఉన్నప్పటికీ అవి దేశ పరిపాలనా విధానాన్ని దెబ్బ తీయలేదు. అత్యధిక రేటు, 8.8 శాతం, జాతీయ ఆదాయం పెరిగిన సంవత్సరం 1977. అప్పటినుండి దానికి సమానంగా మరి పెరగలేదు శ్రీమతి గాంధీ కాలంలో ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యకరంగా ఉన్నట్లు ఆ ప్రకటన చెపుతోంది. శ్రీమతి గాంధీ చివరి సంవత్సరం అయిన 1984తో 1977ని పోల్చి చూడండి అన్నిట్లోనూ 1977వ సంవత్సరందే పై చేయిగా ఉంది కానీ అది ప్రధాన అంశం కాదు ఇక్కడ ముఖ్యాంశం ఏమిటంటే జనతాపార్టీ సాధించినవిజయం ఏమైనా ఉంటే అది తుపాకీ అవసరం లేకుండానే సాధించింది. చాలాకాలం తరువాత కామన్వెల్త్, అలీన దేశాల సభలు, ఆసియా క్రీడలతో కూడా తుపాకులు, ఇనుప కడ్డీలు, డేగర్స్ బయటికి వచ్చాయి దేశాధినేతగా లేదా ప్రభుత్వాధినేతగా అలీనోద్యమ సభకు హాజరయిన ప్రతి ముగ్గురు నాయకులలో ఒకరు దెబ్బ తీయబడటం ఆశ్చర్యకరం కాదు దురదృష్టవశాత్తు మన ప్రభుత్వాధినేత కూడా అందులో ఉన్నారు విప్లవాలకు మాదిరిగాన్నే తుపాకులు తమ స్వంత పిల్లల్ని తామే స్వాహా చేస్తాయి హిట్లర్ అదేదో కొత్త నాగరికత అన్నట్లు మొదలు పెట్టిన హింసాకాండకి ఆఖరికి తనే బలైపోయాడు.

వాస్తవంగా కనిపించే సమస్యలు అంటూ లేని ఇవి అయోమయపు ఎన్నికలని గతవారం ఈ కాలమ్‌లో నేనుచెప్పాను కానీ అది తప్పు ఎవరూ దానిని గురించి మాట్లాడకపోయినా ఒక సమస్య ఉంది శ్రీమతి గాంధీ మనకు పటిష్టమైన ప్రభుత్వం ఇచ్చారు దాని పర్యవసానం ఏమిటి? ఈ దేశాన్ని ఐక్యంగా ఉంచడానికి వేర్పాటు వాద వైఖరులతో పోరాడటానికి పటిష్టమైన ప్రభుత్వం అవసరం అని ఆమె వాదిస్తూ ఉంటారు నాకిప్పటికి పటిష్టమైన ప్రభుత్వం అంటే ఏమిటో అర్థం కాదు. 1980 నుంచి 1984 వరకు పటిష్టం అయ్యీ, అయ్యీ ఆఖరికి శ్రీమతి గాంధీ మరణించిన అక్టోబరు 31కి ప్రభుత్వం చిన్నాభిన్నం అయింది మనకా విధమైన పటిష్టమైన ప్రభుత్వం కావాలా? మనకలాంటి ప్రభుత్వం అవసరం లేదు

అమెరికా సంయుక్త రాష్ట్రాలను తీసుకోండి అక్కడ రాష్ట్రాలన్నీ కూడా వాషింగ్‌టన్ అంత పటిష్టంగా ఉన్నాయి కానీ అ సం రా లలో కేవలం వాషింగ్‌టన్‌ను పటిష్టం చేయడానికి అ సం.రా పటిష్టమైన ప్రభుత్వం కలిగి ఉండాలని ఎవరూ అనరు మనకు కావలసిన ప్రభుత్వం మంచి ప్రభుత్వం, ప్రతిపక్షాలను జాతీయ శత్రువులుగా భావించని మంచి ప్రభుత్వం, చిన్న కాకస్ ముఠా పరిధులలో లేని కేంద్రం ఆధిపత్యం కలిగిన ప్రభుత్వం మనకు కావాలి పటిష్టమైన ప్రభుత్వం హింసతో బతికి, హింసతో పాలిస్తుంది. ప్రజాస్వామ్యంలో తుపాకులకు తావు లేదు □

## వ్యక్తిగతం



జాక్‌లలన్నే వయసు 70 సంవత్సరాలు మనస్సుని, శరీరాన్ని అదుపులో ఉంచుకుంటే సాధించ లేనిదంటూ ఏమీ లేదంటారీయన ఇటీవల ఆయన 70వ జన్మ దినోత్సవం సందర్భంగా 70 పడవలని ఒకదానితో ఒకటి కట్టి, వాటిలో ఒక్కొక్కదాంట్లో ఒక్కొక్క వ్యక్తిని ఎక్కించు కుని ఏక ధాటిగా ఒక మైలు దూరాన్ని రెండు న్నర గంటలలో ఈదుకుంటూ లాగారు ఆశ్చర్య కరమైన ఈ అద్భుత ప్రదర్శన అశేష ప్రజానీకం చూస్తుండగా కాలిఫోర్నియాలోని లాంగ్ బీచ్‌లో జరిగింది



శ్రీ వారెన్ ఎం ఆండర్సన్ అమెరికా సంయుక్త రాష్ట్రాలకి చెందిన బహుళ జాతి సంస్థ యూనియన్ కార్బయిడ్ అధ్యక్షుడు ఈయన తమ సంస్థలో సేల్స్ మన్‌గా చేరి స్వయం కృషితో చైర్మన్ స్థాయికి ఎదిగిన వ్యక్తి మధ్య ప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉన్న ఈ సంస్థకి చెందిన కర్మాగారంలోని మిథయిల్ అయిసో సైనైట్,అది నిలవ ఉంచిన పాత్రలలోని లోపాల కారణంగా, వాయురూపంలో బయటికి వ్యాపించి వాతావరణాన్ని విషపూరితం చేయడం వల్ల దాదాపు 2,500 మంది ప్రాణాలు కోల్పోయారు భోపాల్ నగర జనాభాలో సుమారు నాలుగో వంతు ప్రజలు దాని ప్రభావానికి లోనై అంధులు కావడమో, తీవ్ర అనారోగ్యానికి గురి కావడమో జరిగింది ప్రపంచం లోనే అత్యంత దారుణమైన దుర్ఘటనగా అభి వర్ణింపబడిన ఈ విషవాయు విషాదాంతం వల్ల జరిగిన కష్టనష్టాలని అంచనా వెయ్యడం ఇప్పు డప్పుడే సాధ్యం కాని పని ఈ దుర్ఘటనకి సంబంధించిన విషయాలని స్వయంగా పరిశీలించ డానికి శ్రీ ఆండర్‌సన్ తమ బృందంతో భోపాల్ వచ్చారు జరిగినదానికి ఆయనా బాధ్యులే కాబట్టి మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఆయనని అరెస్టు చేసి తర్వాత జామీనుపై విడుదల చేసింది .

# వారఫలం

☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆☆

## 4-1-1985 శుక్రవారం మొదలు 10-1-1985 గురువారం వరకు

★ **మేషం** : నీతి, న్యాయం, ఉపకారం అంటూ వెనుకకు ముందుకు పోతుంటారు. ఎందుకంత తట పటాయింపు చేయదలచినది కచ్చితంగా చేసివేయండి వ్యాపార రీత్యా బాగా శ్రద్ధ వహించండి. లాభార్జన చేయగలరు. స్త్రీలకు · ఆదాయం, వృత్తియందు పెంపు, శుభ వార్తా శ్రవణం

★ **వృషభం** : మామూలుగా యితరులకు కష్టం కలుగవచ్చు. నమ్మిన వారు కూడ మిమ్ములను మోసం చేయవచ్చు ఇతరుల చేతి నుండి రావలసిన ధనం సమయానికి అందక పోవచ్చు చికాకు కలుగవచ్చు ఏమయినాసరే నిబ్బరంగా జీవయాత్ర జరుపాలిగదా! స్త్రీలకు రాజకీయ రంగాన మేలున్నదని గ్రహించాలి.

★ **మిధునం** : మిక్కిలి శ్రమ జేస్తేగాని, కొంచెంగా ఆదాయం సంభవించదు ఇతరుల చేతి నుండి రావల్సిన డబ్బు నిదానంగా అందటం కూడా గమనిస్తారు. అందుకనే మీ సంపాదన భద్ర పరచుకోటం భావికాలానికి మేలని గుర్తించాలి. స్త్రీలకు - వ్యాపార వ్యవహారాలందు అనుకూలత కనిపిస్తుంది

★ **కర్కాటకం** : ప్రభుత్వ మూలాన, ధనాఢ్యుల మూలాన, పెద్దలవలన మీకు మేలు చేకూరుతుంది మీ ఆశయాలు సఫలం కాగలవు మీ మాట నలుగురిలో మన్నన నందుకో గలదు. మీ అభీష్టం సిద్ధించగలదు మీ ప్రయత్నం లేకుండగనే ఉద్యోగం లభించవచ్చు స్త్రీలకు . సుఖ శాంతులు, వృత్తియందు పెంపు.

★ **సింహం** : విద్యా విషయకంగా మీకు ప్రగతి గలదు. దూర ప్రాంతాలనుండి ఒక వేళ విదేశాల నుండి అనుకూల వార్తలు అందుకోనున్నారు 'పోయినదేదో పోయింది, ఇక ప్రయోజనంలేదు' అనుకొన్న విషయం ఆనందదాయకంగా మీ కనుకూలంగా నెరవేరుతుంది స్త్రీలకు . వస్త్రానుకూల్యత చేకూర గలదు.

★ **కన్య** : ఎంతో కాలంగా నెరవేరని ప్రయత్నం ఈ వారం సానుకూలం కానున్నది. చాల కాలంగా రాని బంధు మిత్రులు దావునకు రానున్నారు నూతనాంశాలు గ్రహింప నున్నారు. కొందరు నూతన వృత్తిని చేపట్ట నున్నారు స్త్రీలకు ఆరోగ్య రీత్యా యిది ఉత్తమ వారం, ధనాధాయం, మిత్రవర్గం వలన మేలు చెప్పదగిన ముఖ్యాంశాలు

★ **తుల** : గ్రహచారం యింకా అనుకూల మార్గాన్ని పట్టలేదు వ్యవహార రీత్యా పెద్దగా మేలు చెప్పుటకు వీలులేదు మీరు చేసే ప్రతి పనీ యితరులచే వ్యాఖ్యానించ బడుతుంది సాయం చేయుటకు బదులు కొందరు అపకారం చేయనున్నారు స్త్రీలకు ధనాదాయం, వృత్తి పెంపు

★ **వృశ్చికం** : ముఖ్య బంధువులను కలిసికొ గలుగుతారు రాజకీయంగా మేలు చేకూరుట నిశ్చయం అధిక విద్యార్జన నిమిత్తం కొందరు విదేశాలకు పయనించగలరు చలన చిత్ర నిర్మాతలకు యోగ్య కాలం స్త్రీలకు · వృత్తి యందు వృద్ధి, రాజకీయంగా మేలు గలవారం


★ **ధనుస్సు** : మీకు గల సహజ ప్రజ్ఞ వికసిస్తుంది గ్రామంలో పేరు ప్రతిష్టలబ్బుతాయి రాకపోకలందు జాగ్రత్త వహించ దగిన సమయం 'రోడ్డు' ప్రమాదమో, తగవులాటలో సంభవం స్త్రీలకు · అధికారుల మూలాన ఆదాయం, నూతనాంశాలు గ్రహింపునకు రాగల అవకాశాలుంటాయి

★ **మకరం** : అధికారులకు, చిన్న ఉద్యోగస్తులకు, కృషి, వాణిజ్య వృత్తులందు చేయి తిరిగిన వారికి అనుకూల సమయం అప్రయత్నాదాయం కొందరకు చెప్పవచ్చు విదేశ ప్రయాణం కొందరపట్ల సంభవం స్త్రీలకు ఎంతో కాలంగా రాని బంధువులు రాగల సమయం

★ **కుంభం** : విశ్రాంతి సంభవం కాని వారం. అయినా మేలున్నదని సంతోషిస్తారు వ్యవహార రీత్యా అనుకూల సమయం, భూమిగాని, యిల్లుగాని కొనే అవకాశం కొందరకు చెప్ప వీలున్నది స్త్రీలకు ఉద్యోగ రీత్యా మేలు, ఆర్థిక లాభం, ఆరోగ్యాభివృద్ధి గల వారంగా గ్రహించాలి

★ **మీనం** : ఆశించినంత ఆర్థికలాభం, సంభవం అధికారుల మన్ననకు అవకాశం ఆరోగ్యమందు క్రమాభివృద్ధి, వృత్తియందు వృద్ధి ఉద్యోగ రీత్యా సర్వానుకూలత, చలన చిత్ర రంగాన అంతో యింతో అనుభవమున్న వారికి అనుకూలం, నూత్న చిత్ర నిర్మాణావకాశం లభ్యం కాగలదు స్త్రీలకు : ప్రతిభ రాణించ గల సన్నివేశాలు, ఉద్యోగ మందభివృద్ధి చేకూరుట గమనించగలరు.

—విద్వాన్ కోట సత్యరంగయ్యశాస్త్రి



ఎనిమిదవ లోక్‌సభకు జరిగిన సార్వత్రిక ఎన్నికలలో నాలుగింట మూడువంతులపైగా
మెజారిటీతో అపూర్వమైన అత్యద్భుత విజయాన్ని సాధించి ప్రధానమంత్రిగా

సీరియల్

# మౌన విపంచి

ఆర్. పద్మజా చౌదరి

(గత సంచిక తరువాయి)

గోపిని చూస్తూనే వాడ్ని గుండెలకు హత్తుకున్నారు వెంకాయమ్మగారు.

రాజ్యం కళ్లతోనే ప్రశ్నించింది; గ్రహించింది.

"తల్లివుంటే యిలా పొలాల వెంట తిరిగేవాడా? అన్నల్లా దర్జాగా బ్రతికేవాడు" అనుకుని బాధపడ్డారు.

అల్లుడ్ని అతని గదిలోకి వెళ్లి పలుకరించారు. అతనిలో చలనంలేదు. ఎప్పటిలా భావ రహితంగా వున్నాడు. రాజ్యాన్ని చూడగానే అతని కళ్లల్లోకి జీవం వచ్చింది. అదీ ఒక్క క్షణం మాత్రమే. తరువాత తన సహజ ధోరణిలో పడిపోయాడు.

రాజ్యం వచ్చి తండ్రి ప్రక్కన కూర్చుని "బావున్నావా నాన్నా?" అంది. ఆమె కఠంలోని జీరను కానీ, వేదననుగానీ అతడు పట్టించుకోలేదు. ముభావంగా "ఊఁ!" అన్నాడు.

రాజ్యం యెక్కువసేపు అక్కడ నిలబడలేకపోయింది.వెంకాయమ్మ అల్లుడ్ని చూచి నిట్టూర్చింది. ఒక మనిషికి యీ భూమ్మీద నూకలు చెల్లి-నందుకు ఎందరి జీవితాల్లో యెన్నెన్ని మార్పులు! సాయంత్రం కాగానే వెంకాయమ్మగారు మనుమరాలి చేయి పుచ్చుకుని బయలుదేరారు. రాజ్యం పిన్ని వుండమని యెంత వేడుకున్నా వుండలేదు."నేనుండలేనమ్మా. ఉండి మనసు నిలువుకోలేను. వాడి భారం నీదే మంచి అయినా చెడు అయినా నీవే దిక్కు." గోపిని ఆమెకు అప్పగించారు

జరిగిన కథ - 2 : రామస్వామి, ప్రభావతమ్మ దంపతుల పెద్ద కొడుకు కృష్ణ చైతన్య. ప్రభావతమ్మ అక్క కూతురు రాజ్యలక్ష్మికి సీరియస్‌గా ఉందని టెలిగ్రాం వస్తే చూసి రాను బయలుదేరుతుంది ప్రభావతమ్మ. బస్సులో కూర్చున్న ప్రభావతమ్మకు గతం గుర్తుకు రాసాగింది. ప్రభావతి అక్క కామేశ్వరికి నాలుగో బిడ్డ రాజ్యలక్ష్మి. రాజ్యలక్ష్మి అమ్మమ్మగారి దగ్గరే పెరుగుతున్నందువల్ల ప్రభావతి దగ్గర చనువెక్కువ. ప్రభావతికి రామస్వామితో పెండ్లి జరిగింది. రాజ్యలక్ష్మి ఎడబాటు ప్రభావతిని బాధిస్తూండేది. రామస్వామి, ప్రభావతికి కృష్ణ చైతన్య పుట్టాడు. తనకంటూ పిల్లలు పుట్టాక ప్రభావతికి రాజ్యం యెడబాటు ఎక్కువగా బాధించలేదు. రాజ్యం పదవ-తరగతి చదువుతుండగా కామేశ్వరి కేన్సర్ వ్యాధితో మరణించింది. రాజ్యంను తనతో తీసుకెళతానని అడిగిన ప్రభావతితో ఆ పిల్లను మేనమామలు పంపలేదు ప్రభావతి పుట్టింట్లో పరిస్థితులు తారుమారయ్యాయని ఆమెకు తెలీలేదు.

వీళ్లు వచ్చారని తెలుసి గోపి బాబాయి సాయంత్రం పెందలాడే యింటికి వచ్చాడు. అప్పటికే వీరిద్దరూ బయలుదేరి వున్నారు.

అతడ్ని చూస్తూనే రెండు చేతులూ యెత్తి నమస్కరించారామె

"మీరు పెద్దవారు "

"పిల్లవాడికి నీవే ఆధారం నాయనా" అన్నారు దుఃఖాన్ని దిగమింగు-కుంటూ

"నేను చేసేది యేముంది? అన్న ఆస్తి వుంది ఆ వ్యవహారాలన్నీ కొడుకులు చూచుకుంటారు. వారు యోగ్యులు నేను కేవలం కావలికాస్తు-న్నాను "

రాజ్యాన్ని పలుకరించాడు

రాజ్యం వీలైతే యిక్కడే కొంతకాలం వుండాలని అనుకుంది. కానీ పిన్నిగానీ బాబాయిగానీ ఆమెను వుండమని అనలేదు నిరాశగా అమ్మమ్మ వెంట బయలుదేరింది

వెంకాయమ్మగారు యింటికి వెళ్లి పెద్ద కొడుకుచేత మనవళ్లకు వుత్తరాలు వ్రాయించారు ముగ్గురిలో యెవరైనా గోపీని తీసుకువెళ్లి చదివిస్తే బాగుంటుందని సూచిస్తూ గోపి ప్రస్తుత విషయం వ్రాయించారు ఉత్తరంపోస్ట్ చేసిన వారం రోజులనుండి ఆమె జవాబుకోసం నిరీక్షించారు రోజులు, వారాలు, నెలలు గడచిపోయాయి. రెండు నెలల అనంతరం, ఒకరి తరువాత ఒకరి వద్దనుండి బదులు వచ్చింది. వారి ముగ్గురిలోనూ ఐక్యత, పోలిక యెంతో వున్నాయని ఆ వుత్తరాలు చదివిన వారెవ్వరైనా వూహిస్తారు చదువు మీద శ్రద్ధలేని వారిని బలవంతంగా చదివించలేమనీ, ఆ పద్ధతి శ్రేష్ఠమైనది కాదనే వ్రాస్తూ వ్యవసాయం అన్ని వృత్తుల్లోకి రాజా వృత్తి అని, తమలా జీతం రాళ్లకోసం ప్రాకులాడాల్సిన ఖర్మ పట్టకుండా గోపీ దర్జాగా బ్రతకగలడనీ ముగ్గురూ వక్కాణించారు. ఆ వుత్తరాలు చదివించు-కుని వెంకాయమ్మగారు విరక్తిగా నవ్వుకున్నారు.

"వాళ్లలో యింటా వంటా లేని స్వార్థం బలిసిపోయిందమ్మా ఆ మాత్రం ప్రేమలు కలిగిన వాళ్లైతే తండ్రిని ఆ స్థితిలో వదిలేస్తారా?" అన్నారు ఆమె కొడుకులు.

"అంతేకదా," అనుకుంది రాజ్యం

కష్టాలూ, కన్నీళ్లూ మనస్సులకు పదునుపెడ్తాయి క్రమంగా ఆ కష్టాలను జీర్ణించుకో గలిగిన స్థాయికి మనిషి చేరతాడు కొందరికి భారంగా, మరి కొందరికి ఆనందంగా రోజులు దొర్లిపోతున్నాయి ఒకనాటి ఉదయం వాకిటి ముందు బండి దిగుతున్న పెద్దన్న రామారావుని చూస్తూనే సంభ్రమంగా కేకవేస్తూ బయటకు వచ్చింది రాజ్యం. రామారావు చెల్లి ఆనందానికి చిన్నగా నవ్వుకుంటూ లోపలకు అడుగుపెట్టాడు అతడు ఆఫీసు పనిమీద విజయవాడ వచ్చాడు. ఎలాగూ వచ్చాను కదా అని మేనమామల వూరు వచ్చాడు. ఆ సాయంత్రమే తిరుగు ప్రయాణమని తెలుసుకుని "మీ వూరెళ్లి మీ నాన్ననూ తమ్ముళ్లనూ చూడవూ?" అన్నారంతా.

"ఎక్కడ టైమేదీ? రేపు మద్రాసులో జాయిన్ కాకపోతే వుద్యోగానికే ముప్పు" అంటున్న అతన్ని తిరస్కారంగా చూశారు.

మధ్యాహ్నం టిఫిన్‌లోపాటు కాఫీ యిస్తూ" నేనూ వస్తాను నీతో" అంది నెమ్మదిగా రాజ్యం

రామారావు నిర్ఘాంతపోయాడు. ఈ విషయం యిలా తలెత్తుతుందని అతను వూహించలేదు. చెల్లెలి ముఖంలోకి దీక్షగా చూశాడు. అతనికి దయ కలిగింది.

"అలాగే రామ్మా. బట్టలు సర్దుకో" అన్నాడు.

రాజ్యం వుషారుగా తన పనులన్నీ ముగించుకుంది. సూట్‌కేస్‌లో అన్ని

బట్టలూ సర్దుతున్న ఆమెను చూచి ఆమె అత్త అడిగింది "అదేమిటే రాజ్యం మళ్ళీ రావూ! అన్ని సామాన్లూ సర్దుతున్నావు?"

రాజ్యం బదులివ్వలేదు. సర్దుతున్న పని ఆపేసి ఆలోచించసాగింది. ఆమెకు జవాబు తెలియలేదు. మౌనం వహించింది.

కోడలు ప్రశ్న విన్న వెంకాయమ్మగారు గబగబా వచ్చి "యెప్పటికీ అయితే యెలా? నేను బ్రతికుండగానే దాన్ని అత్తారింటికి పంపితే నేను నిశ్చింతగా కన్ను మూస్తాను" అన్నారు.

రామారావుతో వెళ్తున్న రాజాన్ని చూచి వెక్కి వెక్కి యేడ్చారామె. అమ్మమ్మనూ వదిలి వెళ్ళటం రాజ్యానికి కష్టంగానే వుంది ఆ కష్టాన్ని మరిపించే కొత్త కోరిక ఒకటి ఆవేలో మొలకెత్తింది. అందుకే ఆశతో అన్న వెంట ప్రయాణమయ్యింది

భర్తతో దిగిన రాజ్యాన్ని చూచిన జానకి ముఖంలో కత్తివాటుకు నెత్తురు చుక్కలేదు. ఆమెను చూస్తూ దోషిలా తలదించుకుని "అది ...- వస్తానంటేనూ "నీళ్ళు నమిలాడు.

"రామ్మా.. .రా" ఆమె కంఠంలోని వెటకారాన్ని గమనించక పోవడానికి రాజ్యం తెలివి తక్కువదేమీ కాదు.

కాళ్ళు తడబడుతుంటే, గుండె దడదడలాడుతుంటే సూట్‌కేస్ చేతబట్టుకుని లోనికి అడుగుపెట్టింది రాజ్యం ఆమె కొత్త కోరిక, ప్రశాంతమైన, ఆప్యాయతలతో కూడిన జీవితం పట్ల ఆమె కన్నకల మొగ్గగానే త్రుంచివేయబడ్డాయి

భర్త వెనుకే అతని గదిలోకి వెళ్తూ "అసలు మీరక్కడకు ఎందుకు వెళ్ళారు?" అన్న జానకి ప్రశ్న విని మొదటిసారిగా తనమీద తాను జాలిపడింది

మొదట కొన్ని రోజులు జానకి ముభావంగా వుంది. పిల్లల్ని రాజ్యం చేరువకు వెళ్ళనీయలేదు అంటరాని వార్ని చూచినట్లు చూచింది అలా యెక్కువ రోజులు సాగలేదు పనిమనిషి పనిలోకి రావడం మానేశాకగానీ ఆమెకు యెదుటి వ్యక్తి విలువ తెలియలేదు. రాజ్యం సంతోషంగా ఒదినకు సహాయపడేది. నాలుగు రోజుల్లో యింటి పని క్షుణ్ణంగా అర్థం చేసుకుంది. చకచకా పనులన్నీ చేసేది. పిల్లలకు నీళ్ళు పోసేది, అన్నాలు తినిపించేది బట్టలు వుతికేది, యిస్త్రీ చేసేది. ఒదినకు బియ్యం కడిగిచ్చి, కూరగాయాలు కోసేది. భోజనాల బల్లమీద అన్నీ అమర్చేది భోజనాలు అయ్యాక గిన్నెలు కడిగేది

జానకి సుఖం మరిగింది. మొదట్లో నెమ్మదిగా చెప్పి చేయించుకునేది రానురానూ శాసించసాగింది "అది బాగా లేదు. ఇది యిలా చేశావేమి?" అని చివాట్లు వేసేది." దరిద్రం అంతా నాకు చుట్టుకుంది. నేనెలా చావను?" అని నుదురు కొట్టుకునేది. క్రమంగా రాజ్యానికి వంటపని కూడా అప్పగించింది. ఆ పిల్ల పనికి భయపడలేదు కాని ఒదినగారి ఛీత్కారింపులను భరించలేక-పోయింది."అత్తలు ఎంతో మేలు" అనుకుంది.

రామారావు జానకి మాటలు విన్నా అభ్యంతర పెట్టేవాడు కాదు. మేనమామలు వుత్తమం. భార్యలు యేమైనా అన్నట్లు వినబడితే వార్ని చివాట్లు వేసే వాళ్ళు.

"పల్లెజీవులు, వారి పద్ధతులూ, సంస్కారమే వుత్తమం" అనుకుంది ఆమెకు యీ ఖైదులోనుంచీ యెలా బయట పడాలో తోచలేదు. ఇలాంటి సమయంలో అన్న పంపడు ఒదిన పంపనివ్వదన్న విషయం ఆమె బాగానే అర్థం చేసికుంది. సాక్షాత్తూ దేవతలా జానకి చెల్లెలు రమ దర్శన మిచ్చింది. ఆమె బి. ఎ. చదువుతోంది. సెలవుల్లో చూచి పోవడానికి అక్క వద్దకు వచ్చింది. చెల్లెల్ని చూచి జానకి చేసిన హడావుడి యింతా అంతా కాదు. పిల్లల్ని రాజ్యానికి అప్పగించి, భర్తను తీసికుని స్టేషన్‌కు వెళ్ళింది చెల్లెల్ని రిసీవ్ చేసికోవడానికి. చెల్లెలికి యిష్టమైన వంటకాలు చెప్పి చేయించింది.

"ఎవరీ పిల్ల?" అంది రమ రాజాన్ని నొసలు చిట్లించి చూస్తూ.

చదువుకున్న చెల్లికీ, చదువురాని అక్కకూ సంస్కారంలో భేదం అట్టే లేదని గ్రహించింది రాజ్యం

కాఫీ యిచ్చి వెళ్తున్న ఆమెను చూస్తూ "క్రొత్త పనిపిల్లా?" అంది తిరిగి


ఈ ప్రశ్న అప్పుడే అక్కడకు వస్తున్న రామారావు విన్నాడు అతని ముఖం మాడిపోయింది సిగ్గుతో తల దించుకున్నాడు. భర్తను వెటకారంగా చూస్తూ" అనిపించిందీ ఎందుకనిపించదూ! మా మహారాజశ్రీ ఆడబిడ్డ-గారు" అంది జానకి

బావగారు అక్కడ వుండటంచేత తనగొంతు కలిపి అపహాస్యం చేయలేక పోయింది రమ

రమ వున్నన్ని రోజులూ పిక్నిక్కులకు అంతేలేదు. కంచి, మరొకరోజు మహాబలిపురం వెళ్ళారు ఈ రెండు ప్రదేశాలకూ వెళ్ళేరోజు రామారావు సెలవు పెట్టాడు. తనను కూడా ఆహ్వానిస్తారని ఆశించిన రాజ్యానికి నిరాశే యెదురయ్యింది. పిల్లలు స్కూలు పోతుందని వాళ్ళను తీసికు వెళ్ళలేదు. వాళ్ళు స్కూలునుండీ వచ్చేసరికి టిఫిన్, పాలు సిద్ధంచేసి వుంచమని హుకుం జారీ చేసిన జానకితో "అలాగే" నన్నట్లు తలవూపింది

రమ తిరగు ప్రయాణం దగ్గరకు వచ్చింది రాజ్యం యింతవరకూ తన మనసులోని మాట బయటపెట్టలేదు ఒక రోజు సాయంత్రం జానకీ, రమ బజారు వెళ్ళారు పిల్లలు బయట ఆడుకుంటున్నారు రామారావు బాల్కనీలో పేపర్ చదువుకుంటూ కూర్చున్నాడు






# మౌనవిపంచి

రాజ్యం బిడియంగా వెళ్ళి అన్న ముందు నిల్చుంది ఈ యింటికి వచ్చాక ఆమె అతనితో మాట్లాడ ప్రయత్నించడం అదే మొదటి సారి

ఏమిటన్నట్లు చూశాడు

"అమ్మమ్మను చూడాలని వుంది " తల వంచుకుని చెప్పింది

రామారావు సాలోచనగా చూశాడు

రాజ్యమే మళ్ళీ మాట్లాడింది

"రమ ఒదినతో వెళ్తానన్నయ్యా"

"ఎక్కడకూ?" తెల్లబోయాడు

"నన్ను బెజవాడలో బస్సు యెక్కిస్తే అమ్మమ్మ దగ్గరకు వెళ్ళగలను "

"మీ ఒదిన యేమంటుందో "

"నువ్వు చెప్పన్నయ్యా" వేడుకుంది

రామారావుకు ముందే రాజ్యాన్ని తీసికు రావడం యిష్టంలేదు. ఆ పిల్ల నోరు తెరచి అడిగాక కాదనలేకపోయాడు. అతనికి తెలుసు చెల్లెలి బ్రతుకు యిక్కడ మరీ అధ్వాన్నం ఐపోతుందని అందుకే ఆమె మేనమామల యిళ్ళల్లో వుంటున్నా, గోపీ చదువు మానేసినా, తండ్రి జీవశ్చవంలా బ్రతుకుతున్నా అతడు బాధను లోలోన దిగమ్రింగుకున్నాడు అతనికి తనవద్దేకాదు యే అన్న దగ్గరకు వెళ్ళినా రాజ్యం యెదుర్కొబోయే పరిస్థితి కొంచెం అటూ యిటూగా ఒకటేనని

"అలాగే పంపిస్తాను నువ్వు అక్కడే వుండు ఎక్కడకూ వెళ్ళకు" అన్నాడు

ఇంతకాలానికి అన్న మనసు విప్పి మాట్లాడుతుంటే సంబరపడిపోయింది రాజ్యం రోజుకు ఒక్కమాట యిలా ఆప్యాయంగా చెప్తే యెంత హాయిగా వుంటుంది

"పిన్ని దగ్గరకు వెళ్తాను"

ఆమె మాటల్లోని విశ్వాసాన్నీ, పిన్నిఛాయలో సుఖంగా బ్రతకగలనన్న ధీమానూ అతడు అర్థం చేసికున్నాడు

"అలాగే వెళ్ళు మామయ్యలను అడిగి, వాళ్ళ అంగీకారం పొంది వెళ్ళు "

రమ తరువాత రోజు వెళ్తుందనగా రామారావు భార్యతో రాజ్యాన్ని కూడా పంపదల్చుకున్న విషయం తెలియజేశాడు ఆ మాట వింటూనే మండిపడింది జానకి వంటింట్లో వున్న రాజ్యం దగ్గరకు వెళ్ళి "ఏమే మీ అత్తలు అంతబాగా చూసుకుంటున్నారా?" అంది

"అక్కడ అమ్మమ్మ వుంది "

"ఓహో! అమ్మమ్మగారు తోడు అన్నమాట ఒకరినొకరు ఓదార్చుకోండి."

జానకి ఎత్తి పొడిచినా ఆమె చెప్పింది నిజం అమ్మమ్మ ఓదార్పే లేకుంటే ఆ ప్రత్యక్ష నరకంలో ఒక్క క్షణమైనా మనగలిగేదికాదు ఒకరి నొకరు ఓదార్చుకుంటూ గుండె బరువును తగ్గించుకుంటున్నారు

జానక్కి ఆడబిడ్డను పంపడానికి యే మాత్రం యిష్టంగాలేదు ఆ పిల్ల వెళ్ళిపోతే యింటెడు చాకిరీ యెవరు చేస్తారు? పనిమనిషి యెప్పటికి దొరికేనో, దొరికినా యింత పని యెందుకు చేస్తుంది?

రామారావు చాలా తెలివిగా భార్యకు నచ్చజెప్పాడు "ఆడపిల్ల మనకెందుకు? రేపేదైనా ఐతే మనల్ని అంటారు అమ్మమ్మ యెలాగూ వుంది దాని బాధ్యత వాళ్ళే చూసుకుంటారు " అన్నాడు

రమకు కంచిలో కొన్న పట్టు చీరె పెడుతుంటే రాజ్యం చూస్తూ నిలబడింది. ఆ పిల్ల చేతిలో జాకెట్ బట్టయినా పెట్టలేదు పెట్టకుండా వూరుకున్నా పోయేది "అన్ని అద్దినాలూ మాకేగా, రేపు పెళ్ళి వూరికే ఔతుందా?" అని సాగతీసింది. ఆమె తెచ్చిన దాన్లోనుంచిగానీ, తన సంపాదనలోనుంచిగానీ పైసా యివ్వాల్సిన అవుసరం లేదనీ, తండ్రికి కావల్సినంత ఆస్తి వుందనీ రామారావు భార్యకు జవాబు చెప్పలేదు

రామారావు, జానకి యిద్దరూ వచ్చారు స్టేషన్‌కు. రామారావు టికెట్లు రమ చేతిలో వుంచి రాజ్యానికి పది రూపాయల నోటు అందిస్తూ "వుంచు బస్సు టిక్కెట్‌కు కావాలి" అన్నాడు.

బండి కదలబోయే ముందు అక్కా చెల్లెండ్లు ఒకరి నొకరు చూచుకుని కన్నీరు కార్చారు. రాజ్యం మాత్రం అసలు తాను ఒక ఆత్మీయుణ్ణి, అన్నను వదలి వెళ్తున్న భావనే కలుగలేదు. నిర్లిప్తంగా "వెళ్తాను" అంది అన్నా ఒదినలతో.

హఠాత్తుగా వచ్చిన మనుమరాల్ని కళ్ళింత చేసికుని చూచారు వెంకాయమ్మగారు

ఆమె వొళ్ళంతా ఆప్యాయంగా నిమురుతుంటే యెనలేని హాయిని అనుభవిస్తూ" యీ ప్రేమ బంధాన్ని కాదనుకుని యెంత అవివేకంగా ఎండమావి వెంటబడ్డాను" అనుకుంది

మేనమామలు సంతసించారు అత్తలు సాదరంగా ఆహ్వానించారు వారి పిల్లలు సరేసరి

ఈ సంబరం యెంతోకాలం నిలవదనీ, తాత్కాలిక భోగ్యమనీ అతి త్వరలోనే తెలుసుకుంది రాజ్యం

మద్రాసునుండీ వచ్చాక ఆమె యింట్లో అతి ముఖ్యమైన మార్పును గమనించింది సాయంత్రం బడినుండి రాగానే బజారున పడి ఆటల్లో దొర్లి యెప్పటికో వచ్చె పిల్లలంతా, ఆటలు త్వరగా ముగించుకుని వస్తున్నారు. అట్లాగే దుమ్ము కాళ్ళలో యిల్లంతా తిరిగి పక్కలు నాశనం చేయకుండా శుభ్రంగా కాళ్ళూ, ముఖం కడుక్కుని పుస్తకాలు చేతపుచ్చుకుని ముందు గదిలోకి వెళ్తున్నారు ఇంటికి వచ్చి రోజూ చదువుచెప్తున్న ఆ మాష్టారుని చూడటానికి రాజ్యానికి నాలుగు రోజులు పట్టింది


ప్రవేశపెడుతున్నాం
జై కిసాన్
సామ్రాట్
18:46:0
JAI KISAAN
SAMRAT
18 : 46 : 0
GRS 40.4KG NET 40KG
ZUARI AGRO CHEMICALS LTD
GOA
JAI KISAAN
మీ పంటలను ఉవ్వెత్తున పెరిగేటట్లు చేసేందుకు అత్యధిక ఫాస్ఫేట్ గలది.
* 18% నత్రజని, 46% ఫాస్ఫేట్ (డీఏపీ) జోరుగా, తొందరగా పెంచగల బలవర్ధకమైన సంకీర్ణ రసాయనిక ఎరువు.
* వరి, చెరకు, ప్రత్తి, నూనె గింజలు, పప్పు ధాన్యాల్లాంటి పంటలు బాగా ఏపుగా పెరగటంకోసం, అధికంగావున్న ఫాస్ఫేట్ తోడ్పడుతుంది.
* నీటిలో పూర్తిగా కరుగుతుంది—దాని పూర్తి లాభం మీ పంటలకు అందుతుంది.
* అత్యధిక పోషక పదార్థాలు....అతి తక్కువ ఖర్చులో!
* నత్రజని పూర్తిగా అమ్మోనియా రూపంలో ఉండటంవల్ల, నష్టపోవడం అంటూ ఏమీ ఉండదు.
జై కిసాన్ ఎరువులు
అత్యధిక దిగుబడుల కోసం అత్యధిక పోషణ.
జువారి అగ్రో కెమికల్స్ లిమిటెడ్, గోవా.
ప్రాంతీయ విక్రయ కార్యాలయాలు : సికింద్రాబాద్, విజయవాడ, బెంగుళూరు, హుబ్లి, నాగ్‌పూర్, పుణె, ఇండోర్, ఆగ్రా, జువారినగర్.
LINTAS ZUA 112 2315 TL (R)

# మౌనవిపంచి

ఒక సాయంకాలం బయట వూడుస్తుంటే వెంకటేశ్వర్లు అప్పుడే వచ్చి ఆమెకు అడ్డు రాకుండా తప్పుకుని నిల్చున్నాడు. అడుగుల సవ్వడికి గ్రహించి తలెత్తి చూచింది

"ఎవరు కావాలండీ?" వూడవటం ఆపింది

"పిల్లలకు ట్యూషన్ చెప్దామని ."

"లోపలకు రండి" తొలగి దారి యిచ్చింది

వెంకటేశ్వర్లు తల వంచుకుని వెళ్ళాడు

రాజ్యానికి వెంకటేశ్వర్లు క్రొత్తే అయినా, అతను ఆమెను పరోక్షంగా బాగానే యెరుగును పిల్లల్లో యెవరో ఒకరు "మా రాజ్యం " అంటూ సాగదీయ ప్రయత్నిస్తూనే వుంటారు

అది మొదలు రాజ్యం అప్పుడప్పుడు ప్రైవేట్ మాష్టార్ని చూస్తూనే వుంది పిల్లలకు అతడు పాఠాలు చెప్తుంటే ప్రక్క గదిలో వుండి వినేది. అతను అన్ని సబ్జెక్టులూ వివరంగా, అందరికీ అర్థం అయ్యేలా చెప్తుంటే కళ్ళింత చేసుకుని వినేది "ఎంత బాగా చెప్తున్నారు! ఆయన కంఠం ఎంత బాగుంది " అనుకునేది

ఆ విధంగా వదిలేసిన చదువుమీద రాజ్యానికి శ్రద్ధ అధికం అయ్యింది ఒకనాడు పెద్ద మామయ్యకు తన కోరికను వెల్లడించింది.

"నేను కూడా ప్రైవేట్‌గా చదువుకుంటాను మామయ్యా "

"ఎందుకు?" అన్నాడాయన తెల్లబోయి

"ప్రైవేట్‌గా స్కూల్ ఫైనల్ పరీక్షలు వ్రాస్తాను

"నీకు చదువెందుకే మీ పిన్నికిచ్చినంత యిచ్చి రాజాలాంటి సంబంధం తెస్తాం "

"అయితేనేమి చదువుకుంటాను."

ఆ సంభాషణ కేవలం వారిద్దరి మధ్య సాగలేదు మధ్యలో చినమామయ్య అత్తలు జోక్యం చేసికున్నారు

"నవ్విపోతారు " – ఒకరు

"మానేశావుగా మళ్ళీ యెందుకు గుబులు మొదలయ్యింది?"

"ఆ మగపిల్లవాడిచేత పాఠాలు చెప్పించుకుంటావా? "

"పైగా మాలవాడు "

"మాష్టర్లందరూ మగవాళ్ళేను మాలైతేనేమి వీళ్ళంతా చదువుకోవడం లేదా?"

---

బాలల దినోత్సవ సందర్భంలో, విజయవాడ జవహర్ బాలభవన్ కార్యదర్శి, డాక్టర్ శ్రీ జంధ్యాల శంకర్, శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రిగారిని సత్కరిస్తున్న దృశ్యం ముఖ్య అతిథి శ్రీమతి ఊర్మిళా రావు (విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్)గారిని కూడా చిత్రంలో చూడవచ్చు



ఆమె మాటలను యెవ్వరూ లక్ష్యపెట్టలేదు చేయరాని నేరమేదో చేసినట్లు వింతగా చూశారామెను

రాజ్యం పట్టువీడలేదు అమ్మమ్మ దగ్గర మొరపెట్టుకుంది ఏడ్చింది ఆమె గోల భరించలేక "సరే నేను పెద్ద మామయ్యకు చెప్తాను " అంది

ఆమెకు్కూడా రాజ్యం ప్రైవేట్ చదవటం యిష్టలేదు "పదహారేళ్ళు వచ్చాక యిప్పుడు చదువేమిటి?" అనుకుంది లోపల. కానీ ఆమె మెత్తబడటానికి వేరే కారణం వుంది

రాజ్యం మద్రాసునుండీ వచ్చిన పదిహేను రోజుల తరువాత "పిన్ని దగ్గరకు వెళ్తాను" అని మొదలు పెట్టింది

"మీ బాబాయి బదిలీలై వూరూరు తిరుగుతున్నారు. వాళ్ళకే స్థిమితంగా లేదు' లేకుంటే ప్రభావతి యీ మధ్యలో వచ్చేదికాదూ. వాళ్ళు వూరూరు తిరగలేక యాతన పడుతుంటే యిప్పుడు నువ్వెందుకు?" అన్నారు

అప్పటికి ఆ విషయం వాయిదా వేసినా ఆమె మనసులోనుండి ఆ వుద్దేశం తొలగలేదని వెంకాయమ్మగారికి గట్టిగా తెలుసు ఇక్కడ కన్నా ఆమె అక్కడ సుఖంగా వుంటుందని కూడా తెలుసు

అయినా ఆమె వుద్దేశాలు వేరుగా వున్నాయి, తల్లిలేని పిల్ల యెప్పటి-కైనా మరొకరికి బరువేను ఇక్కడే వుంటే సంబంధాలు చూడటం తేలికనీ, తనకు ఓపిక వుండగానే ఆ మూడు ముళ్ళు వేయిస్తే ఆడపిల్ల స్థిరపడి-పోతుందని ఆమె అభిప్రాయం తండ్రి పరిస్థితి యేమంత బాగాలేదు ఆస్తి వ్యవహారాలు మనవళ్ళు చూచుకున్నా, కామేశ్వరికి యిచ్చిన పొలం రాజ్యానికిచ్చి పెళ్ళి చేయాలని ఆమె వూహ అదీగాక కామేశ్వరి పోయాక ఆమె మనోబలం బాగా క్షీణించింది. రాజ్యంలో కూతుర్ని చూచుకుని తృప్తి చెందుతున్నారామె. అందుకే నాలుగు రోజులు పోయాక పెద్ద కొడుకుతో విషయం ప్రస్తావించారావిడ.

"రాజ్యం చదువుకుంటానని మారా చేస్తోంది నాయనా "

"మారాం చేయడానికి అదేమైనా చిన్నపిల్లా?"

"అదేం కాదురా అబ్బాయ్ తల్లిలేని పిల్ల తల్లి పోయిన బాధనుండీ యింకాకోలుకోలేదు ఏదో చదువు వంకన మనసు మళ్ళుతుందని."

"సరె కానీయ్. చెప్తే వినేవాళ్ళెవరు?"

అతడు కండువా భుజాన వేసికుని వెళ్ళాడు

పిల్లలు వుత్సాహంగా చప్పట్లు కొడుతూ" భలే. .భలే. రాజ్యం చదువు కుంటుందిట " అని కేకలు వేశారు

ఆ రోజే మాష్టారితో విషయమంతా పోటీలు పడి చెప్పారు విన్న మాష్టారు తెల్లబోయాడు. ఆ అందాల బొమ్మ రోజూ తనవద్దకు చదువు-కుంటానికి వస్తుంటే అతను నమ్మలేకుండా వున్నాడు. పిల్లలు ఒట్టిగా చెప్తున్నారని సరిపెట్టుకున్నాడు అతని సందేహాలను తారుమారు చేస్తూ రాజ్యం పెద్ద మామయ్య వచ్చి రాజ్యం కూడా రేపటినుండీ చదువుకోడానికి వస్తుందని ప్రకటించి-

"దానికెంత ఇవ్వమంటావ్?" అన్నాడు

"మీ యిష్టం."

"సర్లే. నీ పని కానిచ్చుకో," వెళ్ళిపోయాడు.

ఆ మరుసటి రోజు రానే వచ్చింది. రాజ్యం త్వరగా ఆ యిళ్ళలో తనకున్న అన్ని పనులూ చకచకా ముగించుకుంది. పాత పుస్తకాల దుమ్ము దులిపి క్రొత్త అట్టలు వేసింది. అన్నింటి మీదా తనపేరు ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ వ్రాసుకుంది.

కడిగిన ముత్యంలా వచ్చిన రాజ్యాన్ని మూగగా అభినందించాడు వెంకటేశ్వర్లు.

ఆమె ఇంకా గుమ్మం వద్దనే నిల్చుని వుండటంచేత "లోపలకు రండి వచ్చి కూర్చోండి" అన్నాడు.

మాష్టారు "అండీ" అని సంభోదిస్తుంటే విచిత్రంగా చూచింది. ఆమెకు యీ పద్ధతి క్రొత్త.

"మాష్టారు బాగా చదువుకున్నవారు. ఆయనకు యెన్నో విషయాలు తెలుసు" అనుకుంది మొదటి రోజు చరిత్ర పాఠం చెప్పించుకుని.

ఆ రోజు ఆయన ఆర్యుల నాగరికతను గూర్చి చెప్పాడు. వర్ణాలు ఎలా పుట్టిందీ. వాటి పుట్టు పూర్వోత్తరాలు. వర్ణ విభజన జరగడానికి యేర్పడిన పరిస్థితులూ ఆ వసరాలూ వివరించి చెప్పాడు. ఆర్యుల కాలంలో కులాలు మనిషి పుట్టుక మీద కాకుండా, వారి వృత్తిరీత్యా నిర్ణయింపబడ్డాయని తెలుసుకుని రాజ్యం ఆశ్చర్యపోయింది

ఆ తరువాత రామాయణ, మహా భారత కాలంలో యీ వర్ణ వ్యవస్థ యెలా మనిషి యొక్క పుట్టుక మీద ఆధారపడిందీ, కొన్ని కులాలు యెందుకు స్వార్థపూరితమైన కట్టుబాట్లను అంటే బ్రాహ్మణులు మాత్రమే వేదాలు పఠించాలి మున్నగు ఆంక్షలను విధించి మిగిలిన వారిని అణగద్రొక్కిన వైఖరి వెంకటేశ్వర్లు విపులీకరిస్తుంటే మైమరచి విన్నది అయితే అగ్ర, నీచ అనే భావన మానవ కల్పితమనీ, యింట్లో పెద్దలు చెప్పినట్లు పాపం చేసిన వాళ్ళను దేముడు నీచ కులస్తులుగా పుట్టిస్తాడన్నది ఒట్టి అబద్ధమని తెలుసుకున్నప్పుడు రాజ్యం గాలిలో తేలిపోయింది

"ఇన్ని విషయాలు తనకు కాబట్టి తెలిశాయి మాష్టారు కాబట్టి చెప్పగలిగారు" అనుకుంది అప్పట్నుంచీ తానేదో అద్భుతమైన నూతన విషయాన్ని కనుగొన్నంతగా గర్వించ సాగింది అతి త్వరలో మాష్టారుకు తెలిసినదంతా నేర్చుకోవాలని దీక్షబూనింది

ఒక రోజు శ్యాము ప్రైవేట్‌లో చదువుకోనని మారం పెట్టాడు

'ఎందుకనిరా?' తల్లి ప్రశ్నించింది

"మాల మాష్టారివద్ద నేర్చుకుంటున్నానని బళ్ళో పిల్లలంతా యేడ్పిస్తున్నారు"

ఈ మాట వింటూనే రాజ్యం తాను చేస్తున్న పని ఆపేసి తానునేర్చుకున్న విజ్ఞానాన్నంతా వాడికి యేకరువు పెట్టింది వాడికైతే యేమి బోధపడిందో-గానీ వెంకాయమ్మగారు మాత్రం చివాట్లు పెట్టారు

"ఏం చదువులు చదువుతున్నారే ముదనష్టపు చదువులు ఆ మాల పంతులు అలాగని చెప్పాడా?" అంది క్రోధంగా

రాజ్యం చిన్న బుచ్చుకుని అక్కడినుండీ తప్పుకుంది

ఈ మాల కుర్రవాడు ప్రైవేట్ పంతులుకావడానికో కథ వుంది వెంకటేశ్వర్లు తండ్రి ఎల్లాయి వెంకయ్యనాయుడివద్ద జీతగాడు జీతం చేస్తూనే రెండెకరాల మెట్టను స్వంతంగా సేద్యం చేసికుంటున్నాడు అతని తొలి సంతానమే వెంకటేశ్వర్లు ఫీజు లేకుండా బళ్ళో చదువు చెప్తారని తెలిసి తన పిల్లల్ని చేర్పించాడు తక్కిన పిల్లలు చదువు మీదకన్నా గొఱ్ఱెల్ని కాయడంలోనే అత్యంత శ్రద్ధ చూపారు వెంకటేశ్వర్లు మాత్రం శ్రద్ధగా చదువుకున్నాడు ఆ పిల్లవానికి చదువు మీద గల ప్రీతిని గుర్తించి మాష్టారు అతన్ని చదివించమని ప్రోత్సాహించారు కొడుకు బాగా చదువు-తున్నాడు, స్కాలర్ షిప్ వస్తోంది, తాను నాలుగేళ్ళు కష్టపడితే కొడుకు ఆచార్యులవారికన్నా గొప్పోడౌతాడని ఎల్లాయి ఆశించాడు నానా యాతనా పడి కొడుకును బి ఎ అనిపించాడు. అయితే తండ్రి కొడుకులు కలగన్నట్లు యెవ్వరూ అతన్ని మెచ్చి, పిలిచి కొలువు యివ్వలేదు రెండేళ్ళుగా వెంక-టేశ్వర్లు ఆ ప్రయత్నాల్లోనే వున్నాడు తమ్ముళ్ళు యేదో వొక పనిచేసి తమ పొట్ట తాము పోషించుకో గలుగుతున్నారు ఎటూ కాకుండా అయ్యింది వెంకటేశ్వర్లే, ఆ పనులు అతనికి రావు వచ్చిన పన్లు దొరకటంలేదు పోనీ కూలికైనా వెళ్దాం అనుకుంటే యెవ్వరూ పని యివ్వకపోగా యెద్దేవా చేస్తున్నారు ఇలా లాభంలేదని యింటింటికీ తిరిగి ప్రైవేట్లు చెప్తాను యిప్పించమని వేడుకున్నాడు కొందరు ముఖం మీదనే ఎగతాళి చేశారు మరి

## రాతల్లి – కల్పవల్లి

ఓహో హూణ సంవత్సరమా
స్వాగతమ్ము నీకు
సుస్వాగతమ్ము.

అప్పుడే ఎంత వృద్ధాప్యం
ఎనభై అయిదు

గత ఏడాది
మా నాయకులకు
ఎన్నికల సన్నికలలో
నడుములు విరిగాయి.

ఎనభై నాలుగులో ఎంత నష్టం
ఎంతెంతో నష్టం....
జరిగింది మరి
నీవు ఏం చేస్తావో

చూడాలి నీకు
ఒక 'కేక్' నైవేద్యం
నీ బర్తుడేకి
ఒక కమలా పండు

మరో ఆపిల్ పండు
అన్నీ కొట్లోనే ఉంచాను
కొనలేక, సంకల్ప మాత్రేణ....
ఏం చేయను మరి

అన్నీ అందని మ్రాని పండ్లు
అవుతున్నాయి
కొత్త సంవత్సరం కోసం
కోర్కెల బుట్టలతో

ఎదురు చూస్తున్నారు
జనం – గులాబీలు
కొనలేక బంతిపూలు
చామంతులూ ఇస్తున్నారు

రావమ్మా ఎనభై అయిదా
రాతల్లి కల్పవల్లి –

–ఎం. ఎస్. ఎం.

# ఆశ్రయగర్వం ధర్మపథం



తౌనాశ్రయించినవారు శ్రీమంతులైతే ఆశ్రితులకు సాధారణంగా లోపం ఉండదు. ఆశ్రయం ఇచ్చినవారు ప్రభువులయితే ఆ ప్రభువును ఆశ్రయించిన బలహీనుడు కూడా బలవంతుడనే భావించాలి. ఆశ్రితులు ఇంగిత జ్ఞానం కలవారూ. సాత్వికులూ అయితే వారి జీవితం సాఫీగా సాగుతుంది. తమకు గొప్ప ఆశ్రయం ఉన్నదిగదా అని గర్వించి ఉత్తములను తిరస్కార భావంతో చూస్తే గర్వానికి తగిన ప్రతిఫలం అనుభవించక తప్పదు.

తమ దివాను సీతారామరాజుగారి మాటకు ఎదురు చెప్పి, తమ ఆస్థాన కవి సూర కవికి ఆర్థికంగా తగిన సహాయం చెయ్యకపోయినా విజయరామ గజపతిరాజుగారికి ఆ కవి పయి ఎంతో గౌరవం ఉన్నది. అతడు ఎప్పుడూ తమ దర్శనానికి వచ్చినా ఆతనిని అడ్డుకొనే వారు ఎవ్వరూ ఉండరు. సూరకవి అంటే ఉద్యోగులకూ, సేవకులకూ భక్తితో పాటు భయం కూడా ఉన్నది. ఆ కవి శాపానుగ్రహ సమర్థుడు.

రాజ భవన ద్వారపాలకులలో పతివాడ- పైడన్న 'అనే వాడొకడు. ఆ సేవకుడికి అహంకారం ఎక్కువ తాను ఖుద్దుగా మహారాజుగారి భవన ద్వారం దగ్గర ఉండడం వల్ల సేవకులందరిలోనూ తానే గొప్ప వాడననే దురభిమానం పైడన్నకు వున్నది. అతడు ఇతర సేపకులన కాకుండా ఉద్యోగస్థులు మున్నగు వారిని కూడా లక్ష్యపెట్టడు. వారికి వానిపై కోపం వచ్చినా, పైడన్న రాజుగారి దగ్గర నౌకరు అగుట వల్ల శాంతించవలసి వచ్చేది.

ఒకప్పుడు సూర కవి ప్రభు దర్శనానికి రాజ భవనానికి వెళ్లి, తాను వచ్చిన సంగతిని మహా రాజువారికి తెలియజేయాలని పైడన్నతో చెప్పాడు. ప్రభువులకు, వారి దర్శనానికి వచ్చిన వారి రాకను గురించి తెలపడం ద్వారపాలకుల విధి. కాని, ఆ ద్వారపాలకుడు అలా చెయ్యకుండా గర్వంతో "ఇప్పుడు ప్రభువులను దర్శించడం సాధ్యం కాదు. మీరు ఎంత ఆస్థాన కవులయినా, ప్రభుదర్శనానికి వేళా, పాళా ఉండనక్కర్లేదా?" అని అన్నాడు. సూర కవికి వానిపై విపరీతమైన కోపం కలిగింది. అయినా, దానిని అణచుకొని, గిర్రున వెనక తిరిగి తన బసకు వెళ్లిపోయాడు.

ఈ సమాచారం కొద్దిసేపటిలోనే ఎలాగో మహారాజులుంగారి చెవిని పడింది. తాము ఎంతో గౌరవించే సూరకవి తమ దర్శనం కోరి రాగా, ఆయన వచ్చిన సమాచారం తనకు తెలియజెయ్యకుండా, ఆ మహా కవిని వెనుకకు తరిమివేసిన ఆ ద్వారపాలకునిపై తీవ్రంగా కోపించి, వానికి దేవిడీమన్నా చెప్పారు. అంటే పని నుండి తొలగించి వేశారు.

మనకు గొప్ప వారి ఆశ్రయం ఉన్నప్పుడు వినయ విధేయతలు ఉండాలి. జాగ్రత్తగా ప్రవర్తించాలి. అహంకారంతో ఉంటే దానికి తగిన ప్రతిఫలాన్ని అనుభవించక తప్పదు.

**–బులుసు వేంకటరమణయ్య**

# మౌనవిపంచి

కొందరు మర్యాదగా లేవన్నారు కొద్ది ప్రైవేట్లు మాత్రం అతనికి దొరికాయి అవైనా అతనికి రావడానికి వేరే కారణంవుంది. వెంకటేశ్వర్లు చెప్పినంత కారు చౌకగా యెవరూ చెప్పటంలేదు కొందరి యిళ్లకు స్కూలు మాష్టర్ల యిళ్లు చాలా దూరం రాత్రిళ్లు చిన్న పిల్లలు తిరిగి రావడానికి భయపడుతున్నారు వెంకటేశ్వర్లు యింటి కొచ్చి చెప్పడానికి అంగీకంచాడు

"ఎంతో మంది మాష్టర్లకన్నా చాలా బాగా చెప్తారీ మాష్టారు, మాల అయితేనేమి?" అనుకుంది రాజ్యం

రాజ్యానికి, వెంకటేశ్వర్లుకూ మధ్య సాన్నిహిత్యం చోటు చేసికుని క్రమంగా బలపడసాగింది పెద్దక్లాసని రాజ్యానికి యెక్కువ సమయం తీసికోక తప్పటంలేదు ఆ సమయంలో వారిద్దరూ ఒకరి బాధలు మరొకరికి చెప్పుకునే వారు

"మీకు గొప్ప ఉద్యోగం దొరుకుతుంది మాష్టారూ!" అనేది "నీకు పెళ్లైపోతే సుఖపడ్తావు అప్పుడు వీళ్లెవరూ నిన్నేమీ చేయలేరు" అనేవాడు వెంకటేశ్వర్లు

రాజ్యం నోరు విప్పి యేమీ చెప్పకపోయినా అతను ఆమె పరిస్థితినంతా అర్థం చేసుకున్నాడు రాజ్యం చదువుకోవడానికి రాక ముందు యింట్లోనుండి సూటిపోటి మాటలు అతనికి వినిపించేవి అతడు అప్రయత్నంగా ఆలకిస్తుంటే "మా రాజ్యాన్ని మాష్టారూ మమ్మల్నేమీ అనరు" అనేవారు పిల్లలు.

"పాపం" అనుకునే వాడు

తరువాత గూడా "నిన్నేమయ్యిందంటే మాష్టారూ " అంటూ ఒకరు మొదలుపెట్టేవారు. రాజ్యం వద్దని వారించినా వినకుండా ఆ నిన్నయేమయ్యిందీ, రాజ్యం యెంతసేపు యేడ్చిందీ పోటీలు పడి అందరూ కలసి వివరించేవారు రాను రానూ అతను కూడా ఆ వినటంలో ఆసక్తి కనబర్చసాగాడు రాజ్యాన్ని ఓ దార్చేవాడు ఆమెకు ధైర్యం చెప్పేవాడు.

"నా కెవ్వరూ లేరు మాష్టారూ నా బాధను యెవరూ అర్థంచేసికోరు." అందామె ఒకనాడు మిగిలిన పిల్లలంతా చదువు చాలించుకుని వెళ్లిపోయాక

ఆమె మూగ బాధ, హృదయ భారం అతన్ని విచలితుడ్ని చేశాయి

"నేనున్నాను రాజ్యం నీకే కష్టం రా నివ్వను" అన్నాడు ఆవేశంగా. అతని ఆవేశానికి ఆమె విస్తుబోయినా, ఆ ఆవేశం వెనుక వున్న అనురాగాన్ని గుర్తించింది. తనకోసం బాధపడి, తన కష్టంలో భారం పంచుకునే చెలికాడున్నాడన్న వూహ, ఆమెను వుక్కిరి బిక్కిరి చేసింది ఆమెకు కొండంత బలాన్నిచ్చింది.

**(ఇంకా ఉంది)**

# ఇది ప్రశ్న! ఏది జవాబు?

## మద్దాలి నిర్మల

గది నిండా పరిచిన సామాన్ల మధ్యలో నిలబడి ఏది ఎక్కడ ఎలా సర్దాలా అని చూస్తున్నాను

"సామాను ఇంకా సర్దలేదేమిటి?"

వెనక్కి తిరిగి చూశాను గుమ్మంలో నిలబడిన ఓ లావుపాటి ఆకారం కన్పించింది

"ఆ! మరేనండీ. ఇప్పుడేగా దిగాము" సమాధానంగా అన్నాను.

"అన్నట్లు మీ పేరేమిటన్నారూ" కుతూహలంగా అడిగింది ఆవిడ.

నేనేమీ అనలేదు అందామనుకుని మర్యాదగా వుండదని "ఇందిర అండీ" అన్నాను, ఆవిడని లోపలికి రమ్మని అందామంటే నిలబడేందుకు కూడ చోటులేని ఆ గదిని కలయచూస్తూ

"ఉహూ! నన్ను జానకమ్మ అంటారు లెండి మీ పక్క వాటాయే మాది. అయితే మీ ఇద్దరే నన్నమాట ఈ ఇంట్లో వుండేది. మరి పిల్లా జెల్లా" అంటూ అర్ధోక్తిలో ఆపేసిందావిడ

"అవునండీ. మా అమ్మాయి పెళ్ళయి అత్తారింటికి వెళ్ళిపోయింది. మా అబ్బాయి గుంటూరులో మెడిసిన్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు మాకిద్దరే పిల్లలు" అన్నాను ఈ కాసేపట్లోనే నా దగ్గర సమాచారం రాబట్టిన ఆవిడ చొరవకి ఆశ్చర్యపోతూ

"పోనీలెండి. అదృష్టవంతులు. అందరికీ ఆ అదృష్టం వుండద్దూ. వూరికే కనడంగానే సరా! వాళ్ళని పెంచటంలోనే వున్నది అసలు సంగతి. అయ్యో మీ పనికి అడ్డొచ్చాను. వస్తాను" అంటూ వెళ్ళిపోయిందావిడ. ఎందుకో ఆవిడని చూస్తే అసాధ్యురాలన్పించింది. అయినా నా జాగ్రత్తలో నేనుంటే నాకేమిటి అనుకున్నాను.

అద్దె కొంపల అవస్థలతో సతమతమైన నాకు యీ యిల్లు దొరకటం ఒక వరంలా అన్పించింది. అనుకోకుండా మా వారి స్నేహితుడికి బదిలీ అయిపోవటంతో ఆయన వున్న ఇల్లు మాకిప్పించి వెళ్ళారు. లేకపోతే విజయవాడలో అన్ని నౌకర్యాలు వున్న ఇల్లు ఇంత తక్కువ అద్దెలో దొరకటం నిజంగా అదృష్టమే. ఇంటి యజమాని ఇక్కడ ఉండరు కేవలం అద్దె వసూలుకి మాత్రం వచ్చి వెళ్ళిపోతూ వుంటారు అసలు వున్నవే మూడు వాటాలు మా పక్కన జానకమ్మగారు, వాళ్ళపక్కన ఇంకో వాటా! ఎవరికీ ఒకరితో ఒకరు మాట్లాడే అవసరం లేదు ఇంటి యజమాని పుణ్యాత్ముడు కాబట్టి ఇలా ప్రత్యేక నౌకర్యాలు కలిగించారు. అద్దె పోసినా సుఖం లేకపోతే ఎలా చెప్పండి?

*   *   *

అప్పుడే స్కూలు నుండి వచ్చిన నాకు గేటులోనే ఎదురైంది జానకమ్మగారు

"ఏమండీ ఏమిటా పుస్తకం? ఇప్పుడే ఇస్తా నివ్వండి"

నా చేతిలో ఉన్న కొత్త మాస పత్రికని ఆవిడకిచ్చాను.

"ఇదిగో! ఇది విన్నారా ఇందిరమ్మా" అంటూ నేనిచ్చిన మాస పత్రిక తిరిగి ఇచ్చే నెపంతో సరాసరి వంటింట్లోకి వచ్చేసిందావిడ.

ఏమిటి అని నేనడగకుండానే మళ్ళీ ఆవిడే మొదలు పెట్టింది. "ఆ పద్మ లేదూ! అన్నట్టు మరిచిపోయాను పద్మంటే నీకు తెలియదు కదూ! ఆ చివరి వాటా లేదూ! వాళ్ళ రెండో అమ్మాయి. అది ఓ బ్యాంక్‌లో ఉద్యోగం వెలగబెడుతోందిలే. అది తండ్రిని గడప తొక్కద్దందిట. అన్యాయంగా లేదూ! ఎటువంటి వాడైనా మగవాడు మగవాడే కదా! అలా మాట్లాడొచ్చా? పెదప కాలం పెదప బుద్ధులూనూ

నువ్వసలు దాన్ని చూడనేలేదు కదూ! చూపిస్తాలే. ఎంత పొగరనుకున్నావు మనం ఎదురుగా వున్నా కూడ పలకరించను కూడా పలకరించదు అదెన్నాళ్ళో నేను చూస్తాలే అయినా ఎవరెట్లాపోతే మనకెందుకులే. ఇదిగో నీ పుస్తకం తీసుకో. మరి నే వెడుతున్నా!"

ఇంతకీ ఆ పద్మంటే ఈవిడకెందుకో అంత అక్కసు నాకర్థం కాలేదు వాళ్ళు ఏమైతే ఈవిడకెందుకో అది నాకెందుకు చెప్పాలో అంతకంటె అర్ధం కాలేదు ఆలోచిస్తున్న నేను శ్రీవారి పిలుపుతో యీ లోకంలోకి వచ్చాను.

"ఇందూ! ఏమిటి ఆలోచిస్తున్నావు"

"అబ్బే ఏం లేదు పక్కింటావిడ ఏదో ప్రాంతీయ వార్తలు చెప్పి వెళ్ళింది అదే ఆలోచిస్తున్నాను"

"సరి. సరి ప్రాంతీయ వార్తల్లో పడి నాకేమైనా కాఫీ ఇచ్చేదుందా!"

గబగబా ఆ ప్రయత్నంలో పడ్డాను

ఇంతలోనే "ఇందిరమ్మా! ఇంట్లో వున్నావా! త్వరగా రా." నేను బయటికి రాకముందే తనే లోపలి కొచ్చేసి "చూడు.... చూడు. ఆ పద్మ వస్తోంది. ఎంత పొగరో చూడు. అన్నీ నంగనాచి బుద్ధులే. ఆ పవిట కప్పుకోవడం చూడు. అదో వేషం" నేను వింటున్నదీ లేనిదీ కూడ గమనించకుండా తన ధోరణిలో తను చెప్పేస్తోందావిడ. ఎందుకో నాకు కూడ ఆ






అమ్మాయిని చూడాలన్పించింది పరీక్షగా చూశాను మమ్మల్ని గమనించనట్లే తలవంచుకొని తమ వాటాలోకి వెళ్ళిపోయిందావిడ కూడా

నా కెందుకో ఆమెను చూస్తే ఆశ్చర్యం వేసింది పైకి ఇంత నెమ్మదిగా కనిపించే ఆ అమ్మాయి తండ్రి నెదిరించ గలిగిందా అని ఏమో ఎవరు చెప్పగలరు ఎవరి మనసు ఎలాంటిదో నేను కూడ లోపలికి వెళ్ళిపోయాను

ఆ తర్వాత అప్పుడప్పుడూ కన్పించేది ఆ అమ్మాయి. వాళ్ళు ఎనిమిది మంది ఆడపిల్లలుట ఆ తండ్రి ఏదో వ్యాపారం చేస్తాడట ఎంత సంపాదించినా ఎనిమిది మంది పిల్లలంటే ఎలా సరిపోతుంది అందులోనూ ఆయన వీళ్ళని గురించి పట్టించుకోడట. ఏదో వేళకి వచ్చి భోజనం చేసి వెళ్ళిపోతాడట అసలు అందుకే ఆ పిల్లలు అలా బరితెగించి పోయారట ఒక్క దానికీ తండ్రంటే లక్ష్యం లేదట ఆ తల్లి ఓ రోగిష్టి ఎప్పుడూ

మంచంలోనే వుంటుందిట పెద్ద పిల్లకి ఇంకా పెళ్ళి కాలేదు వంట పనంతా ఆ అమ్మాయే చేస్తుందిట "రాకాసి మూకకి పెళ్ళిళ్ళిలా అవుతాయి" ఇది జానకమ్మగారి వ్యాఖ్యానంతో కూడిన కథనం నిజమే సరియ్యైన పెంపకం లేకపోతే పిల్ల లలాగే వుంటారు. నాకూ అన్పించింది

రోజు కొకసారైనా కనీసం వాళ్ళ ఇంట్లో జరిగే గొడవ అంతా నాకు చెపితే గాని జానకమ్మగారికి తృప్తి కలిగేది కాదు నేను వినకపోయినా, ఏదో పని కల్పించుకుని అవతలికి వెళ్ళినా, నా వెనకాలే తిరుగుతూ తను చెప్పదలచుకున్నది చెప్పి గాని వెళ్ళేది కాదు. ఇలా కాదని ఇంట్లో వున్నంతసేపూ తలుపు వేసేసుకుని లోపలే వుంటున్నాను అయినా ఆవిడ దాడి తప్పటం లేదు

ఆదివారం కాస్త తీరుబడిగా వుంటే ఏదో కుట్టుకుంటున్నాను

అడుగుల చప్పుడుకి తలెత్తాను ఆ అమ్మాయి పద్మ నిలబడి వున్నది. నన్ను చూసి ఏదో చెప్పబోయి ఆగింది ఆమె ముఖంలో భయం ముఖమంతా చెమట పట్టి వుంది కంగారు పడుతున్నట్టుగా ఉంది

"ఏమండీ మా అమ్మ పడిపోయింది. ఒకసారి వచ్చి చూడండి నాకేదో భయంగా వుంది"

"ఏమ్మైంది మీ నాన్నగారు లేరా?" అంటూ ఆమె వెనకాలే వెళ్ళాను

ఆవిడ స్పృహ లేకుండా పడి వుంది. పిల్లలంతా బిక్క ముఖాలతో ఆవిడ చుట్టూ నిలబడి వున్నారు.

"ఫర్వాలేదు. కంగారు పడకండి" ధైర్యం చెప్పి డాక్టరు కోసం పరుగెత్తాను. పక్క వీధిలో వున్న డాక్టరు శాంత మాకు దూరపు బంధువు. పైగా స్నేహితురాలు.

డాక్టరు పరీక్ష చేసి వెళ్ళింది. పద్మ తల్లికి

# ఇది ప్రశ్న! ఏది జవాబు?

బలహీనమని, సరియ్యైన ఆహారం లేక, విశ్రాంతి లేకపోవటమే కారణమని చెప్పింది ఆవిడకి బ్లడ్ ప్రషర్ కూడ ఉందని. ఎక్కువగా ఆవేశపడినా, ఆలోచించినా అలా పడిపోతుందని చెప్పి, విశ్రాంతి, ముఖ్యంగా మానసిక విశ్రాంతి అవసరమని మరీ మరీ చెప్పి వెళ్ళింది. ఆ తర్వాత ఎప్పుడైనా వెళ్ళి ఆవిడని చూసి వస్తున్నాను ఆ పిల్లలు కూడ ఆంటీ అంటూ నాకు దగ్గరయ్యారు

మళ్ళీ పరీక్షల హడావిడిలో వాళ్ళింటికి వెళ్ళటానికి తీరుబడి కావటంలేదు ఈమధ్య ఎందుకో జానకమ్మగారి దాడి కూడ తగ్గింది. ప్రాణం హాయిగా వున్నది

*   *   *

"ఆంటీ! మీరు కథలు రాస్తారా?" రచయిత్రి ఇందిర మీరేనన్నమాట. ఇన్నాళ్ళు నాకు తెలియలేదండీ" ఎంతో ఉత్సాహంగా నా ఫోటో వివరాలున్న దీపావళి ప్రత్యేక సంచిక తీసుకుని గబగబా లోపలికి వచ్చింది పద్మ వాళ్ళక్క సునీత.

"అవును. ఇప్పుడేమ్మైంది"

"ఏం లేదు ఇన్నాళ్ళు మాకు చెప్పలేదేమండీ. మీ రచనలు నేను ఎంతో అసక్తితో చదువుతాను." గబగబ మాట్లాడేస్తోందామ్మాయి

సాయంంతం పద్మ నా దగ్గర కొచ్చింది

"ఆంటీ! మీరు కథలు రాస్తారా? అయితే నా కథ వ్రాయండి నిజంగా ఆంటీ సీరియస్‌గా చెపుతున్నాను కనీసం నా కథ చదివితేనన్నా కొందరిలోనైనా మార్పు వస్తుందేమో!


ఆంటీ! నా గురించి మీరేమనుకుంటున్నారు ఒట్టి పొగరుబోతు అనుకుటున్నారు కదూ! మీరే కాదు ఈ వీధిలో అందరికీ అదే అభిప్రాయం. అలా అనుకోవటం వాళ్ళ తప్పు కాదు లెండి. అసలింతకీ తప్పెవరిదో మీరు చెప్పాలి నా కథ వ్రాస్తారుకదూ!

మేము ఎనిమిది మంది సంతానం మా నాన్నకి అది మీకు తెలుసుగదా! ఇక మా నాన్న. ఆయన ఏదో చిన్న వ్యాపారం చేస్తున్నారు అదివరకు కాస్త బాగానే వుండేది. ఈమధ్యలో అది కూడ నష్టంతోనే నడుస్తోంది రెండేళ్ళనుండీ దీనికితోడు, మా యింట్లో పరిస్థితి. మా అక్క పెళ్ళికెదిగి వున్నది. దాని కాళ్ళమీద అది నిలబడటానికి పెద్ద చదువు లేదు ఉద్యోగం చెయ్యలేదు. మా నాన్న సంపాదనలో ఎనిమిది మంది పిల్లలని పోషించాలి. ఎలా! కాన్పులతో బలహీనమ్మైన అమ్మలో అసలు శక్తి లేదు తన పని తాను చేసికోలేని స్థితిలో ఆవిడ ఇంటికి వచ్చేసరికి ఈసురోమని పిల్లలు. ఈ వాతావరణం చూసి మా నాన్న దురలవాట్లకి బానిసై పోయారు అదే కాకుండా మా నాన్నకి ఇంకో భార్య కూడ వున్నది. ఆశ్చర్యపోతున్నారు కదూ! మా అమ్మతో తృప్తి పడలేని నాన్న తన సుఖాన్ని ఇంకొక స్త్రీలో వెతుక్కున్నారు ఆవిడకి ఇద్దరు పిల్లలు మరి రెండు సంసారాలు గడపాలంటే కష్టం గదా! కనీసం నేను ఉద్యోగం చేస్తున్నాను కాబట్టి కొంత నయం మీకు తెలియదు. మా నాన్న సరిగా ఇంటికి వచ్చి ఆరు నెలలైంది వారాని కొకసారి వచ్చి అలా చూసి వెళ్ళిపోతుంటారు ఈమధ్య అది కూడ కరువైంది. రెండు సంసారాలు గడపటం కష్టమ్మైన తరువాత నాన్న ఆవిడని కూడ ఇక్కడికి తీసుకు వచ్చేస్తానన్నారు ఇంతమంది పిల్లలకీ ఆవిడ ఎవరని చెపుతారు. చుట్టు పక్కల వాళ్ళందరికీ అదొక కాలక్షేపం ఇప్పటికే ఇంతందంగా సుఖంగా వున్న సంసారం ఇక నడి వీధిలోనే వుంటుంది అందుకే వీలు కాదని పట్టు పట్టాను."

"ఆవిడ ఏదో చిన్న ఉద్యోగం చేస్తోంది కాబట్టి అక్కడే వుండనివ్వండి" అన్నాను అదే నేను చేసిన తప్పు.

కూతురు పెళ్ళి చెయ్యవలసిన వయసులో ఇంకొక భార్యను యింటికి తెచ్చుకునే నాన్న నేమనాలి అందుకే ఉన్నదానితోనే అక్క పెళ్ళి చేసెయ్యమన్నాను. ఆ తర్వాత మన తంటాలు మనం పడదాం. ఇకెక్కడికైనా ఇల్లు ఖాళీ చేసి వెడదామంటే ఇంత తక్కువ అద్దెలో ఇంత మంచి యిల్లు దొరకదు. కాబట్టి ఆవిడని అక్కడే వుండనివ్వండి" అన్నాను అప్పటినుండి మా నాన్న పూర్తిగా ఇంటికి రావటమే మానేశారు అదీ నేను మా నాన్న పట్ల చేసిన నేరం. ఈ వీధిలో వాళ్ళందరూ తండ్రిని గెంటేసిన కూతురు అని బిరుదిచ్చేశారు.

ఈ పిల్లలందర్నీ పైకి తీసుకు రాగలనా! ఆంటీ! అప్పుడప్పుడు భయం వేస్తుంది కనీసం జయకి కూడ ఉద్యోగం వస్తే కొంత నయం. అరే ఆంటీ! నా కథ చెప్పి మిమ్మల్ని బాధ పెట్టానా! మీరు చెప్పండి



# సంపూర్ణ పోషకాహారంలో అన్ని పోషక పదార్థాలు సరియైన పాళ్లలో వుండాలి...

ప్రొటీనులు
పెరుగుదలకి ముఖ్యం
పిండి పదార్థాలు మరియు క్రొవ్వు పదార్థాలు
శక్తికి
విటమిన్ ఎ
కళ్ళలో కాంతులకి
విటమిన్‌లు బి గ్రూప్
అన్ని ఇతర పోషక పదార్థాలని జీర్ణించుకోడానికి
విటమిన్ సి
రోగ నిరోధక శక్తి పెంపొందించడానికి
విటమిన్ డి
కాల్షియం మరియు ఫాస్ఫరస్‌లని గ్రహించేటట్లు చేయడానికి
ఐరన్
ఆరోగ్యవంతమైన రక్తానికి
కాల్షియమ్ మరియు ఫాస్ఫరస్
దృఢమైన ఎముకలు మరియు పండ్ల కోసం



# సిరిలాక్ సంపూర్ణ పోషకాహారాన్ని రుచికరమైన విధంగా అందజేస్తుంది

సిరిలాక్‌లో అయిదు రకాల పోషకాలు అన్నీ వున్నాయి—ప్రొటీన్లు, క్రొవ్వు పదార్థాలు, పిండి పదార్థాలు, ఖనిజాలు మరియు విటమిన్లు. మీ పాపకి ప్రతి పర్యాయమూ సిరిలాక్‌తో తయారు చేసిన ఆహారం మీరు యిచ్చినప్పుడు ఈ పోషకాలన్నీ సరియైన పాళ్ళలో చేరి వుంటాయి.




కలసికట్టుగా పని చేయడం వలన ఈ పోషకాలన్నీ హెచ్చు తగ్గులు లేకుండా ముఖ్యమైనవే. అందుకే అన్ని పోషకాలు 'సంపూర్ణం'గా వున్న సిరియల్ ఆహారం మీ పాప ఆరోగ్యానికి అత్యవసరం. ప్రతి సిరిలాక్ ఆహారం మీ పాపకి ఒక రోజుకి కావలసిన పోషక పదార్థాలలో నాల్గవ వంతుని అందచేస్తుంది. ఈ ఆహారం యిస్తున్నప్పుడు పోషక పదార్థాల కోసం మరొకటి మీరు యివ్వవలసిన అవసరం లేదు.

మీ పాపకి చనుపాలే తగినవి. అయితే పాపకి నాలుగు నెలలు వచ్చి ఘన పదార్థాలు తీసుకోడానికి సిద్ధంగా వున్నప్పుడు, మీ డాక్టర్‌ని సంప్రదించి సిరిలాక్ యివ్వడం ప్రారంభించండి.

## సిరిలాక్®
## పాలు వుండనే వున్నాయి



సిరిలాక్ తయారు చేయడం ఎంతో సులభం. దీనిని ముందుగా మరగ బెట్టిన, గోరు వెచ్చటి నీటికి చేర్చండి. కలపండి వడ్డించండి

**ఉచితం!** సిరిలాక్ పిల్లల పెరుగుదల ఛార్ట్
ఇందులో బరువు ఛార్టు, రోగనిరోధక మందుల రికార్డు, గట్టిగా ఉండే ఆహారం అలవాటు చేసేందుకు సూచనలు, యింకా ఎన్నో విషయాలు ఉంటాయి
మీ కాపీ కోసం ఈ చిరునామాకు వ్రాయండి
సిరిలాక్
పోస్ట్ బాక్స్ నం 3 న్యూ ఢిల్లీ-110 008.

SAA/FSL/C/3151 TEL

NESTLÉ.

సీరియల్

# కాగితప్పడవలు

యర్రగుంట్ల వరలక్ష్మీదేవి

(గత సంచిక తరువాయి)

ఇంతకీ ఆ క్రితం రోజు కంటకాపల్లిలో జరిగిందేమంటే–

"అమ్మా! జయలక్ష్మి చెల్లెలుకి పెండ్లి జరిగి పోయింది కదా, జయలక్ష్మికి కుటుంబరావుగారు పెండ్లి చేద్దామనుకుంటున్నారు."

తల్లి మౌనంగ ఊరుకుంది. రామారావు కాస్త నిరుత్సాహ పడ్డాడు.

"జయలక్ష్మి, నేను పెండ్లి చేసుకుందా మనుకుంటున్నాము. నీ ఉద్దేశ మేమిటి?"

"నా ఉద్దేశంతో నీకు పనేమిటిరా? నువ్వు పెద్ద వాడివయ్యేవు, ఒక స్నేహితురాలిని సంపాదించేవు. నీ ఇష్ట మొచ్చినప్పుడే దాన్ని పెండ్లాడు" రామారావు చాల ఆశ్చర్య పోయేడు తల్లి ధోరణికి. ఇంతలో తండ్రి అక్కడకు వచ్చేడు.

"ఏమిటీ– ఏం జరిగింది?"

"ఏమిలేదు మనవాడు జయలక్ష్మిని వివాహం చేసుకుంటానంటున్నాడు"

'మనం అనుకున్నదీ, ఆమోదించినది అదే కదూ?"

"అవు ననుకోండి, గాని ఇప్పుడు చేసుకుంటే ఎలా? సంగతి, సందర్భం చూడాలిగ."

'రామం! ఇప్పుడు తొందరేమొచ్చిందిరా?" అని జనార్ధనయ్య అడిగేడు ఏమి తోచక.

"అది కాదు నాన్నా, వాళ్ల చిన్నమ్మాయి సుమతికి వివాహం అయిపోయింది. పెద్దమ్మాయి జయలక్ష్మికి వివాహం చేసేస్తే వాళ్లకు మరే సమస్య ఉండదని."

తనకి ఆతృతగ ఉందని చెప్పడానికి బిడియం కల్గి అలా అన్నాడు– కాని ఆ మాటే బెడిసి కొట్టింది. ఆ మాటకు తల్లి విరుచుకు పడింది.

"అవునురా– ఇద్దరి ఆడపిల్లలకి పెండ్లి చేసేస్తే ఆ కుటుంబరావు సమస్యలు తీరిపోతాయి. మరీ జనార్ధనయ్యగారి సంగతేమిటి ? రెండో పిల్లకు పెండ్లి అయింది. అదిన్నీ ఓ పదివేలు తగలెట్టుకుంటే. పెద్ద పిల్లకు, చిన్నపిల్లకు పెండ్లికాలేదు. ఎదిగిన పెద్ద పిల్లను ఇంట్లో ఉంచుకున్నామని ఎంత బాధ పడుతున్నామో నీకేం తెల్సు. నీ తండ్రి సమస్యలు నీవి కావుగాని ఊర్లోవారి సమస్యలు నీవి అయేయి. వాళ్లకేం, తేరగ మంచి ఉద్యోగం చేసుకుంటున్న అల్లుడు దొరికితే రేపే పెండ్లి చేస్తారు."

రామారావు చాల ఆశ్చర్య పోయేడు.

"అదేమిటమ్మా ఇవాళ ఇలా మాట్లాడుతున్నావు? నిన్నటి వరకు జయలక్ష్మిని 'నా కోడలు, నా కోడలు' అనేదానివి, ఇప్పుడు ఇంత అసూయతో మాట్లాడుతున్నావు?"

కామేశ్వరమ్మ ఆవేశం తగ్గింది.

"అది కాదురా– నన్ను సరిగ్గా అర్థం చేసుకో. ఏ నాటికైనా జయలక్ష్మే నా కోడలవుతుంది. ఆ అమ్మాయంటే నాకెంతో ఇష్టం– కాదనను, గాని ఆ అమ్మాయిని నువ్వు ఇప్పుడు పెండ్లి చేసుకుంటానంటే కుదరదు. కుటుంబరావుగారి సమస్య ఎలాంటిదో మనింటి సమస్య అట్లాంటిదే. మనకి మరో అమ్మాయి ఉంది. వాళ్లకు జయలక్ష్మి పెండ్లి అయిపోతే మరో గొడవలేదు. అందుకే కాస్త వాళ్లను ఆగమను. మన సుభద్ర పెండ్లి అయిన మర్నాడే నీ పెండ్లికి ముహూర్తం పెట్టించమని మీ నాన్నగారు స్వయంగా వెళ్లి ఆ కుటుంబరావుగార్ని కోరతారు– సరేనా?"

రామారావుకి మరేం జవాబు చెప్పాలో తోచలేదు. తల్లి చెప్పింది రామారావుకి సబబుగానే తోచింది. కాని తను జయలక్ష్మికి ఏమని జవాబు చెప్పగలడు. ఆశతో తండ్రి వైపు చూచేడు.

"రామం! మనసు భద్రకు మీ ఆఫీసులోనో, జయలక్ష్మి ఆఫీసులోనో ఎవరైనా అబ్బాయి ఉంటే చూడు. అమ్మాయికి త్వరగ పెండ్లి చేసేద్దాం," అని జనార్ధనయ్య కొడిక్కి నచ్చచెప్పేడు.

తరువాత జయలక్ష్మిని కలసుకున్నప్పుడు ఈ విషయమే జయలక్ష్మికి చెప్పేడు.

"కాని జయా! మనం చక్కగా సింహాచలం పోయి పెండ్లి చేసుకుందాం. రెండు దండలు, రెండు పుస్తెలు ఉంటే చాలు దేముడే మనను ఆశీర్వదిస్తాడు – ఏమంటావు?"

"ఒద్దు రామారావు – మనం తొందర పడొద్దు. నాకు తెల్సు ఎప్పటికి నువ్వు నా వాడివే. అసలు మా ఇంట్లో జరిగిందేమంటే మా తమ్ముడికి ఉద్యోగం అయేవరకు నాన్నగారు నాకు పెండ్లి చేయడానికి ఇష్టపడడంలేదు. అందుకే ముందు మీ సుభద్రకు మంచి సంబంధం చూద్దాం. ఆ అమ్మాయి వివాహం జరిగిం తరువాతే మనం ఓ నిర్ణయం తీసుకుందాం. ఆ విధంగా రెండు కుటుంబాల మధ్య సఖ్యత ఉంటుంది."

"ఇన్నాళ్లు కుదరని సంబంధం ఇప్పుడు మా చెల్లెలికి ఎలా కుదురుతుందంటావు?"

"ప్రయత్నిద్దాం మీ ఆఫీసులోగాని, మా ఆఫీసులోగాని. మన అదృష్టం బాగుంటే అదే కుదురుతుంది."

"ఏమో మా ఆఫీసులో నేనింతకు ముందు ప్రయత్నించి చూచేను. ఫలితం లేకపోయింది."

"సరే మా బంధు వర్గంలో ఎవరైన ముప్ఫైయేళ్ల వయసున్న వాళ్లున్నారేమో మా నాన్నగార్ని అడిగి చూస్తాను."

## 16

కాలం ఒక తీరుగ సాగిపోదు. ముఖ్యంగ దిగువ మధ్య తరగతి కుటుంబాల బ్రతుకులే అంత. ఎన్ని సంబంధాలు చూసిన చూపుల వరకైన రావడంలేదు. ఆఖరికి నర్సీపట్నంనుండి ఓ పెండ్లివారు పిల్లను చూసు-

**జరిగిన కథ - 9 :** శకుంతలమ్మ తన కొడుక్కి సుమతిని ఇచ్చి పెళ్లి చేయమని కుటుంబరావుని అడిగితే, అతను ససేమిరా తన కూతురిని జగ్గారావుకు ఇవ్వనని మొండి పట్టు పడతాడు. కుటుంబరావు ఆరోగ్యం దెబ్బ తింటుంది. రామారావు జయలక్ష్మిని పెళ్లి చేసుకోడానికి తన అంగీకారం తెలిపాడు. సుమతి తండ్రితో అస్సలు జరిగినదంతా చెప్పి, జగ్గారావు మంచివాడని చెపుతుంది. సుమతి జగ్గారావుల పెళ్లి జరిగిపోయింది. కృష్ణకు ఉద్యోగం వచ్చిన తరువాత జయ పెళ్లి రామారావుతో జరిపిస్తానని చెప్తాడు కుటుంబరావు. ఆ విషయం రామారావుతో చెప్పాలని వెళ్లిన జయ రామారావు ఉత్సాహంగా లేకపోవటం గమనించి ఆశ్చర్యపోయింది.

కుందుకు వస్తామన్నారు. పెండ్లివారు మరో గంటకు వస్తారనగా ఇంటి ముందు ఓ టాక్సీ ఆగింది. ఆతృతగ జనార్ధనయ్య, రామారావు గుమ్మం వద్దకు వచ్చేరు పెండ్లి వారికి స్వాగతం పలకడానికి –గాని ఆ టాక్సీలోంచి ముగ్గురు మనుష్యులు పట్టుకుని ఒళ్లంత కట్లతో నున్న చిన్న కొడుకు వెంకట రమణను తెచ్చి ఇంట్లో పడేసిపోయేరు, జరిగిన విషయాన్ని ఇంట్లో వాళ్లకు చెప్పేసి.

నేటి విద్యార్థులకు కాలేజీలలో చదువుల మాటెలా ఉన్న రాజకీయాలు మాత్రం క్షుణ్ణంగ తెలుస్తాయి. రాజకీయ నాయకులకు ఏదో వృత్తి కల్పించడానికి మున్సిపల్ ఎన్నికలని, పంచాయితి ఎన్నికలని, ఎసంబ్లీ ఎన్నికలని, పార్లమెంటు ఎన్నికలని ఈ ప్రజాపాలనా వ్యవస్థలో ఎలా ఉన్నాయో అలాగే ఈ విద్యాలయాల్లో కూడ చాల రకాల ఎన్నికలున్నాయి. క్లాసు ప్రతినిధి ఎన్నికలు, సంస్కృతి కార్యక్రమాల ప్రతినిధుల ఎన్నికలు, సెక్షను ప్రతినిధులు, ఆఖరికి కాలేజి విద్యార్థుల ప్రతినిధుల ఎన్నికలు, ఇలా సంవత్సరంలో బోలెడన్ని ఎన్నికలు. వాటికి అనుగుణంగ గ్రూపులు, ముఠాలు, రౌడీ మూకలు. వీళ్లను ముందుకు తీసే గ్రామ రాజకీయ పార్టీదారులు. ఇలా యేడుస్తున్నాయి మన విద్యా సంస్థలు.

ఇంటర్‌మీడియేటు చదువుతున్న వెంకటరమణ స్కూలులో చేరిన నాటినుండి ఈ రాజకీయ విద్యను అలవర్చుకున్నాడు. ఈ క్లాసు ఎన్నికల వెనుక కాంగ్రెసు, కమ్యూనిస్టు, జనతా, మార్క్సిస్టు ఇత్యాది ప్రముఖ రాజకీయ పార్టీల దన్ను ఉంటుంది. ఈ ఎన్నికల ఖర్చు వారి వారి అభ్యర్థులకోసం ఖర్చుచేస్తారు. అందుకే వెంకట రమణ చేతిలో ఖర్చులకోసం డబ్బు ఎప్పుడూ ఉండేది. ఇట్లాంటి విద్యార్థి నాయకుడు కాస్త కండబలం, గుండెబలం కలవాడై ఉండాలి. చదువుమీద శ్రద్ధ ఏమాత్రం ఉండనవసరం-లేదు. ఈ లక్షణాలన్ని వెంకటరమణకున్నాయి. అందుకే సునాయాసంగ విద్యార్థి నాయకుడయేడు.

ఆ ఏడు ఎన్నికలలో మరో రాజకీయ ముఠా మరో రౌడీ కుర్రాడ్ని వెంకట రమణకు ప్రత్యర్థిగ నిలబెట్టింది. ఇంకేం తగాదాలు రగులుకున్నాయి! విద్యార్థులు రెండు పార్టీలుగా చీలిపోయి వెంకట రమణను, వెంకయ్య నాయుడిని బలపర్చారు. ఎన్నికల రోజున ప్రచారం ఎక్కువై ఓటర్లను కాస్త ఇరుపక్షాలు బలవంతం చేయడంలో రగడ రగుల్కొని ఆఖరికి కాలేజీ ఆవరణలోనే చిన్న భారత యుద్ధం మొదలైంది. ఆ కాలేజి ప్రిన్సిపాల్ ఎప్పుడో తన రూములోని తలుపులన్ని వేసుకుని భగవంతుని ప్రార్థించడం మొద-లెట్టేడు – ఆ వృత్తిలో ప్రవేశించినందుకు తనను తాను తిట్టుకుంటు.

ఆ కొట్లాటలో ముందు చేతులు, తరువాత కర్రలు, రాళ్ళు, తరువాత చాకులు బాకులు రంగంలోకి వచ్చేయి. అంతే! వెంకట రమణకు తలపైన చేతులుపైన బలమైన గాయాలు తగిలేయి. ఆసుపత్రిలో చికిత్స, బాండేజీల అనంతరం అతడి పార్టీ కుర్రాళ్ళు అతడిని టాక్సీలో ఇంటికి తెచ్చి పడేసేరు.-ప్రిన్సిపాలు, పోలీసులు రంగ ప్రవేశం చేసిం తరువాత ధైర్యంగ తలుపులు తీసుకుని కాలేజి ఆవరణలోకి వచ్చి ఎన్నికలను వాయిదావేసేడు, మనస్సులో ఈ గొడవ వచ్చేనెల తప్పదని రాజకీయాలను మనసార తిట్టుకుంటు.

బాధతో మూలుగుతున్న కొడుకును చూసి తల్లిదండ్రులు మొర్రో-మన్నారు. రామారావు మాత్రం జాలిగ చూసేడు తమ్ముడి వైపు. ఇంట్లో ఏడుపులు కేకలు జరుగుతుండగ ఆ పెండ్లివారు వచ్చేరు.

మనస్సు దిగులుతో నిండి ఉండగ ఏదో పెండ్లి చూపులు అయిందని-పించేరు. పెండ్లివారు ఇంట్లో కాలుపెడుతూనే ఏడుపు విన్నారు. అది అశుభంగ పరిగణించి నర్సీపట్నం చేరగానే ఉత్తరం వ్రాసి పడేసేరు పిల్ల నచ్చలేదని.

డాక్టరు వెంకట రమణ పరిస్థితిని చూసి బలమైన దెబ్బలు తగిలేయి-గాని కత్తిపోట్లు ఏమిలేవని, ఎముకలేమి విరగలేదని, తల చిట్లి రక్తం బాగా కారిందని ఓ పదిహేను రోజులు మందులు తీసుకుని విశ్రాంతి తీసుకుంటే కోలుకుంటాడని చెప్పి మందులు వ్రాసిచ్చేడు.

వెంకట రమణ కొత్తవలస చేరిన రెండు రోజులకు వాళ్ల కాలేజి జూనియర్ లెక్చరర్ సుబ్బారావు రమణని చూడడానికి వచ్చేడు.

"ఏం రమణా! ఎంతటి దుర్ఘటన జరిగిపోయింది. ఎలా ఉంది ఒంట్లో?"

"చాల బాధగానే ఉందండి. దేముడి దయవల్ల ఎముకలేమీ విరగలేదు."

"నిన్ను కొట్టిన వెధవ లెవరో తెలుసునా?"

"మరెవరండి వెంకయ్యనాయుడు, వాడి ముఠా వాళ్ళు."

"మరి రిపోర్టు ఇచ్చేవా?"

ప్రిన్సిపాల్‌గారి కంప్లెయింటు మీద పోలీసు లొచ్చారనుకోండి. నలుగుర్ని పోలీసు స్టేషనుకు తీసుకుని వెళ్లి కేకలువేసి పంపించేరు. అందరు కలసి తన్నుకున్నారు. – ఎవర్నని ఎరస్టు చేయగలం? – పొండి అన్నారు. ఆ వెధవ వెంకయ్యనాయుడు మేనమామ మాజీ ఎమ్. ఎల్. ఏ. కదండి. వాడికి బోలెడంత దన్నుంది."

"వెంకట రమణ! నా మాట వింటావా? కోపం తెచ్చుకోవు కద?"

"ఎంతమాటండి మేష్టరుగారు! మీ రంటే నా కెప్పుడు గౌరవమే!"

"నాకు తెలుసు ఆ అభిమానంచేతే నేను ఆందోళన చెంది ఇలా వచ్చేను. చూడు.రమణ నువ్వు ఈ రాజకీయాలను వదిలేసి బుద్ధిగా చదువుకోవాలి."

"మేష్టరుగారు! వాడికి అలా బుద్ధి చెప్పండి. వాడికి ప్రమాద ముండదు. మాకు ఈ చింత ఉండదు," అని వెంకట రమణ తండ్రి జనార్ధనయ్య అన్నాడు.



# కాగితపు పడవలు

"అవును వెంకట రమణ – ఈ రాజకీయాలు డబ్బు ఎక్కువయిపోయిన వాళ్లకు చెల్లుతుందిగాని మనలాంటి బీదవాళ్లకు కాదోయి మనమేదో చదువుకుని ఈ డిగ్రీ సంపాయించి పొట్టకూటికి ఏదో ఉద్యోగం చేసుకోవాలి. అంతే కాని ఈ రాజకీయాలు ఈ దొమ్ములాటలు మనకు కూడుపెట్టవు, ఉద్యోగం ఇవ్వవు."

వెంకట రమణ మౌనంగ ఊరుకున్నాడు. జనార్ధనయ్యకు చికాకు కల్గింది.

"ఏమిరా జవాబు చెప్పవేం మేష్టరుగారు అడుగుతుంటేను?"

"సరే లెండి అలాగే చేస్తాను ఆ వెంకయ్యనాయుడు బుర్రబద్దలు-కొట్టేసి."

"ఆ కావేషమే కూడదన్నాను. ఎలక్షను ఉద్రిక్తతలో మాటమాట అనుకున్నారు. నేను శలవుపెట్టి కాకినాడ వెళ్లకపోయినట్లయితే నేను పరిస్థితిని ఇంతవరకు రానీయక పోయుందును. కనీసం నీకు నచ్చచెప్ప కల్గి ఉందును! నామాట విని గతాన్ని మర్చిపో. ఎలాగూ మరో ఆరు నెలల్లో ఈ చదువు అయిపోతుంది. డిగ్రీ చదువులకోసం పై ఊర్లకు విజయ నగరంకో, విశాఖ పట్నంలో ఎవరి త్రోవనే వాళ్ళు పోతారు. ఈలోగా శతృత్వాలు మరెందుకు చెప్పు? జీవితంలో మీరు, మీరు మరి తటస్థపడ నవుసరమే ఉండదు. నా మాట విని మరి వైరాన్ని పెంచుకోకు."

"సరిలెండి."

ఇష్టంలేకపోయినా మేష్టరుగారిపైన గౌరవం కొద్దీ అలా అనక తప్పలేదు. తండ్రి జనార్ధనయ్య మనస్సులో సుబ్బారావు మేష్టరుగార్కి నమస్కారాలు చెప్పుకున్నాడు. ఈనాటికైన కుర్రాడు బుద్ధిమంతుడై చదువు-మీద దృష్టి కేంద్రీకరించి ప్రయోజకుడైతే తను అదృష్టవంతుడనుకున్నాడు జనార్ధనయ్య.

కామేశ్వరమ్మ ఆప్యాయంగ కాఫీ తెచ్చిచ్చింది.

"వెళ్లొస్తాను రమణ – త్వరగ నువ్వుకోలుకోవాలని ఆ దేముణ్ని ప్రార్ధిస్తా."

సుబ్బారావు మేష్టరుగార్కి తనమీదున్న అభిమానంకు వెంకట రమణ కండ్లు చమర్చేయి. తనకు దెబ్బలు తగిలేయని తెల్సినా ఒక్క మేస్టరు కూడ వచ్చి తనను పలకరించిపోలేదు. వెధవకి మంచిపని జరిగిందని సంతో-షించుంటారు. అట్లాంటిది ఈ సుబ్బారావుగారు తనమీద ఇంత శ్రద్ధ చూపుతున్నారంటే ఎంత మంచివారు. అదేమిటో గాని సుబ్బారావు మేస్టరు-గార్ని చూసిన నాటినుండి తనకు అతనంటే ఎంతో అభిమానం, గౌరవం కల్గేయి. ఆనాడు జరిగిందేమంటే....

సుబ్బారావు మేష్టరు ఎమ్. ఏ. ఎకానమిక్సులో ఫస్టుక్లాసులో పాసయి ఆ ఊరి జూనియర్ కాలేజిలో లెక్చరరుగ నియమితులయ్యేడు: అతడికి చిన్నప్పుడు పోలియో వచ్చి ఎడమకాలు మోకాలుకు దగ్గరనుంచి పాదంవరకు చాల సన్నగా అయిపోయింది. అందవల్ల అతడు ఎడమ చెయ్యి ఆనుకుని కాస్త కుంటుతు నడుస్తుంటాడు. అది చూసి కొందరు కొంటె కుర్రాళ్ళు కాలేజి ఆవరణలో మేష్టరు వింటుండేటట్లు కుంటిమేష్టరు అని, సొట్ట మేస్టరని పేర్లు పెట్టి పిలచేరు. సుబ్బారావుకి కష్టం కల్గి వాళ్లను కేకలేసేడు. వాళ్ళు దాంతో రెచ్చిపోయి సుబ్బారావు వెను తిరగగానే మళ్ళీ కూసేరు. అప్పుడే కాలేజి ఆవరణలోకి వచ్చిన రమణ ఆ అవమానకరమైన దృశ్యాన్ని చూసి గబగబా నడచి ఈ కుర్రాళ్ల దగ్గర కెళ్లి 'నోరు మూస్తారా, పళ్ళురాల గొట్టాలా?' అని బెదరగొట్టేడు. వాళ్ళు బెదరిపోయేరు. ఆనాటినుండి సుబ్బారావు మేష్టరికి ఆ గొడవ తప్పింది. ఆనాడు సుబ్బారావు వెంకటరమణ దగ్గరకు వచ్చేడు.

"మేస్టరుగారు! క్షమించండి కుర్రాళ్ళు ఏదో తెలియక అనేసేరు."

"దానికేం బాబు! వెయ్యిమందిలో ఒక్కడు మంచివాడున్నా చాలు. నీ పేరేమిటి? ఏ సెక్షనులో చదువుతున్నావు?"

"నా పేరు వెంకటరమణండి– నేను బి సెక్షనులో చదువుతున్నానండి."

ఆ నాటి నుండి సుబ్బారావు మేస్టరికి వెంకటకు అనుబంధ మేర్పడింది. వెంకటరమణకి ఎకనామిక్సు చెప్పేవాడు. మళ్లీ జరిగిన సంఘటనలన్నీ తలచుకున్నాడు వెంకటరమణ.

సుబ్బారావు మేష్టరు వెళ్లడానికి లేచాడు.

"సార్! మీరు ప్రతి ఆదివారం వచ్చి నన్ను పలకరించి పోతే నేను త్వరగా లేవగలనుసార్," అన్నాడు రమణ.

తన మీద రమకున్న ఆదరానికి, నమ్మకానికి సంతోషించేడు సుబ్బా-రావు మేష్టారు.

"దానికేంలే. వీలున్నప్పుడల్లా తప్పక వస్తాను."

"మేస్టరుగారు! మీరు అబ్బాయి కోరినట్లు తప్పకరండి. మీ వల్ల నైననూ వాడు బుద్ధిమంతుడైతే మే మెంతో సంతోషిస్తాము," అని కామేశ్వరమ్మ అంది.

"అలాగేనమ్మా– తప్పక వస్తాను."

సుబ్బారావు వెళ్లి పోయిం తరువాత తల్లిదండ్రు లనుకున్నారు–

"ఎంతటి మంచివాడు– గాని భగవంతుడు అన్యాయం చేసేడు. హాయిగా తిరగవల్సిన వాడికి ఆ కుంటి తనమేమిటో! శారీరకంగ లోపమున్నప్పటికి మానసికంగా చాల దృఢమైనవాడు."

పెద్దకూతురు సుభద్ర అనుకుంది.– "పాపం! మనిషికి భగవంతుడు ఏదో లోపం కల్గిస్తున్నాడు."

ఆ మరుసటి ఆదివారం ప్రొద్దుటి బస్సులో సుబ్బారావు మాస్టారు తొమ్మిదీ గంటలకు కంటకాపల్లి వచ్చేడు. ఆసరికి జనార్ధనయ్య, కామేశ్వ-రమ్మ ఆ ఊరిగుడిలో ఏదో ప్రత్యేక పూజ జరుగుతుంటే చూడడానికి వెళ్లేరు. ఇంట్లో చెల్లెలు సహాయం చేస్తుంటే పెద్దపిల్ల సుభద్ర వంట చేస్తుంది. తలుపు సుబ్బారావు తట్టగానే వెళ్లి తలుపు తీసింది సుభద్ర, సుబ్బారావు ఒక్కసారే నమస్కారమండి అన్నారు. ఒకర్ని ఒకరు సాదరంగ చూసుకున్నారు.

"ఎంత చల్లని చూపు," అనుకుంది సుభద్ర.

"ఎంత నిర్మలంగ ఉంది ఆమె చూపు," అనుకున్నాడు సుబ్బారావు.

"రండి లోపలికి," అని మెల్లగ పిలిచింది సుభద్ర.

---

ఇటీవల రచన సాహిత్యవేదిక కడపవారు ఏర్పాటు చేసిన మహాకవి శ్రీ గడియారం వేంకటశేషశాస్త్రి అవార్డు ప్రధానోత్సవ సభలో ప్రసంగిస్తున్న సభాధ్యక్షులు శ్రీ అవధానం చంద్రశేఖరశర్మ, సరస్వతీ పుత్ర డా. పుట్టపర్తి శ్రీ ఎ. సి. దస్తగిరి బహుమతిగ్రహీత శ్రీ బండ్ల వెంకటరమణయ్య, శ్రీ వై. సి వి. రెడ్డిగార్లని చిత్రంలో చూడవచ్చు.



"వెంకటరమణ బాగున్నాడండి?"

"ఆ- రండి" అని సుభద్ర గదిలోకి దారితీసింది.

"రమణా సుబ్బారావు మేస్టరుగారు వచ్చేరు." అని చెప్పి తను మరోసారి సుబ్బారావు ముఖంలోకి చూచి వంట గదిలోకి పోయింది.

సుబ్బారావు కాస్త కుంటుకుంటు వెళ్ళి రమణ మంచం ప్రక్కన స్టూలు లాక్కుని కూర్చున్నాడు.

"అక్కా! ఆ గదిలోని కుర్చీ తెచ్చివ్వవే." అని రమణ కేక వేసేడు.

సుభద్ర వెంటనే మరో గదిలో ఉన్న కుర్చీని తెచ్చి మంచం ప్రక్కన వేసింది.

"ఫరవా లేదండి- దీనిమీద నాకేమి ఇబ్బంది లేదండి"

"కుర్చీలో కూర్చోండి బాగుంటుంది." అని సుభద్ర చెప్పి వెళ్ళిపోయింది.

"ఆ స్వరం ఎంత హాయిగ ఉంది." అని సుబ్బారావు మనస్సులో అనుకున్నాడు.

"ఆమె మీ పెద్దక్కయ్యా?" అని సుబ్బారావు మరి కుతూహలాన్ని అణచుకోలేక వెంకటరమణని అడిగేసేడు.

"అవునండి- మా పెద్దక్కయ్య సుభద్ర. మొదట అందరికన్న పెద్దవాడు మా అన్నయ్య రామారావు, తరువాత మా అక్కయ్య సుభద్ర."

"ఆ మధ్యన మీ అక్కకి పెండ్లి జరిగిందన్నావు ఈమెకేనా?"

"కాదండి మా చిన్నక్కయ్య పార్వతికి అయింది. పాపం! మా పెద్దక్కయ్యకు ఇంకా ఏమి సంబంధాలు కుదరలేదండి." అని జాలిగ అన్నాడు.

సుబ్బారావు మనస్సు ఒక వైపు జాలితోనూ మరొక వైపు ఆనందంతోనూ కదిలింది.

"దానికేమిలే కొంతమందికి వివాహాలు ఆలస్యంగ కుదురుతాయి. అంత మాత్రంచేత నిరుత్సాహ పడిపోకూడదు."

"మా పెద్దక్కండి స్కూలు ఫైనల్ పాసయింది. చక్కగా ఇంటి పనులన్ని చేస్తుంది చురుకుగ. మా పార్వతి అక్క అప్పుడప్పుడు నాతో తగాదా పెట్టుకుంటుంది గాని మా పెద్దక్క నాతో ఎప్పుడు పోట్లాడదు. చాల మంచిగా ఉంటుంది"

వెంకటరమణ ఉత్సాహానికి సుబ్బారావు సంతోషించాడు.

"అవును ఆమె చాల సౌమ్యురాలుగ కనిపిస్తుంది."

ఆ ఇల్లు చిన్నది గనుక వారి మాటలు సుభద్ర చెవిని కాస్త పడ్డాయి. ఆమెకు ఏదో అనిర్వచనీయమైన హాయి కల్గింది. ఆనాడు వంట మరీ బాగా చేసింది ఉల్లాసంతో.

ఈ లోగా జనార్ధనయ్య, కామేశ్వరమ్మ గుడినుండి వచ్చేసేరు. సుబ్బారావు మేస్టారు కొడుకు దగ్గర కూర్చుని మాట్లాడుతుండడం చూసి సంతోషించేరు.

ఆ తల్లి, తండ్రి గదిలోకి రాగానే సుబ్బారావు వినయంగ నించుని "నమస్కారమండి" అన్నాడు. అతని నమ్రతను మెచ్చుకున్నారు మనస్సులో.

పదకొండు గంటలకు సుబ్బారావు మేస్టరు లేచి వెంకట రమణకు వెళ్తానని చెప్పి ముందు వసారాలోకి రాగానే జనార్ధనయ్య అడిగేడు.

"అదేమిటి మాస్టరుగారు వెళ్ళిపోతున్నారు.?"

"వెళ్ళి పోవాలండి పదకొండయిందిగా. మళ్ళి బస్సు మరో రెండు గంటలకుగాని దొరకదు ఇది తప్పిపోతే."

"భోజనంచేసి వెళ్ళురుగాని ఉండండి." అని సాదరంగ అన్నాడు జనార్ధనయ్య.

"హోటలో నెలసరి టిక్కెట్టు కొన్నానండి- ఫరవాలేదు మరోసారి భోజనం చేస్తాలెండి."

కామేశ్వరమ్మ ఈ మాటల్ని వింది. వెంటనే అక్కడకు వచ్చింది.

"అలా వీలు పడదు. మేస్టరుగారు మీరివాళ భోజనం చేయాలి. అప్పుడే మాకు తృప్తి. భోజనం చేసి కాస్త విశ్రాంతి తీసుకుని మధ్యాహ్నం బస్సుకు వెళ్ళురుగాని."

సుబ్బారావు తలెత్తి వంటింటి ద్వారం వద్ద నించుని తన వైపే చూస్తున్న సుభద్రను చూసేడు. అతడి హృదయం ఆనందంతో చిన్న మొగ్గ వేసింది. అందరు తన కుంటి కాలుని ఈసడింపుగా చూసిన వాళ్ళేగాని. ఆప్యాయతతో తన ముఖంలోకి చూసిన వాళ్ళులేరు. సుభద్రయందు సాభిప్రాయం కల్గింది సుబ్బారావు మేస్టారికి.

"సరే మీ మాటే కానీయండి." అని ఉండి పోయేడు.

(ఇంకా ఉంది)

# మన నాయకులు!


ఎన్నికల ముందు


'వాగ్దాన కర్ణులు'!

ఎన్నికల తర్వాత

'కుంభ కర్ణులు'!

—చలమ్



# కంప్యూటర్ నేరస్తుల(?) తెలివి తేటలు!

1950 ప్రాంతంలో మాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ఆకతాయి విద్యార్థులు కొందరు కేంబ్రిడ్జి సబ్‌వే స్టేషన్‌కి దొంగచాటుగా వెళ్ళి రైలు పట్టాలకు గ్రీసు బాగా పట్టించారు. దీంతో ఉదయాన్నే వచ్చిన రైలుబండి బ్రేకులు వేసినా నిలువక అతి కష్టం మీద సొరంగ మార్గం మధ్యలో నిలిచి ప్రయాణీకులను దడదడలాడించింది. ఆ తరువాత పోలీసులు, దర్యాప్తులు, రకరకాల విషయాలు.... ఎన్నో వెలుగులోకి వచ్చాయి.

ఇది మాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి పిల్లల అల్లరి గురించి ఉత్తర అమెరికన్‌లు మామూలుగా చెప్పుకొనే కథ. అయితే ఆ అల్లరి పిల్లలే నేడు ఎలక్ట్రానిక్ మెదళ్లతో పోటీలు పడుతున్నారు. కంప్యూటర్ శకంలో క్రొత్త చరిత్ర సృష్టిస్తున్నారు! కంప్యూటర్ హాకర్‌లుగా వీరిని ఇప్పటికే పిలుస్తూ ఉండడం తమాషాగా ఉంటుంధి. దొంగ చాటుగా సమాచారాన్ని సేకరిచడంలో వీరు సిద్ధహస్తులు!

ఇటీవల విడుదలై బాగా విజయాన్ని సాధించిన "వార్ గేమ్స్" చిత్రంలో ఈ హాకర్‌ల ప్రస్తావన ఉంది. ఒక్కోసారి వీరి తెలివి, నైపుణ్యం హద్దుమీరుతున్నట్లు చిత్రాన్ని చూచిన వారెవరైనా అనుకోవచ్చు. కంప్యూటర్ తయారీలో చురుకుగా పాల్గొనే ఇండస్ట్రియల్ సైకాలజిస్ట్ బిల్ బర్‌న్స్- ప్రెస్‌ని తిడతాడు. పత్రికలు అనవసరంగా హాకర్‌ల గురించి రాస్తాయని ఆయన అభిప్రాయపడతారు. హాకర్‌ల వ్యవహారం అలాగే ఉంటుంది మరి!

కంప్యూటర్ హాకర్‌ల గురించి ఆసక్తికరంగా ఎన్నో విషయాలు ముచ్చటించుకొంటారు. ఈ కంప్యూటర్ పిచ్చి ఉన్నవాళ్ళు భోజనం చేయడం మరచిపోతారు. తరగతులకు హాజరుకారు. నిద్ర పోరు. ఈ ప్రపంచాన్ని గురించి పట్టించుకోరు. ఎలక్ట్రానిక్ అంశాలే బుర్రల్లో తిరుగాడుతూ ఉంటాయి. రాత్రీ పగలు పని చేసి చేసి సొమ్మసిల్లిపోయాక ఏ అరుగు మీదో, ఏ సోఫా క్రిందో నిలబడి- కూర్చొని కూడ నిద్రపోతారు. స్టాన్‌ఫోర్డ్‌కు చెందిన కృత్రిమ తెలివి తేటల ప్రయోగశాలలోని ప్రోగ్రామర్స్ నిజమైన ఇంటి కప్పుకీ ఫాల్స్ సీలింగ్‌కీ మధ్యన పడుక్కొంటే మంచి నిద్ర పడుతుందని చెప్పడం విచిత్రంగా ఉంటుంది. కొన్ని నెలలపాటు ఇలా "నిద్రపోయిన (?)" తెలివి వంతులు కూడ ఉన్నారు!

స్టీవెన్ లెవీ అనే రచయిత "హాకర్స్" అనే పుస్తకంలో కంప్యూటర్ పిచ్చి ఉన్న అతి తెలివివంతుల వల్ల కంప్యూటర్ రంగంలో అద్భుతమైన సంచలనం- ఒక రకమైన ఆందోళన, భయం కూడా- పుట్టుకొచ్చాయని అన్నారు. కాలిఫోర్నియా, కేంబ్రిడ్జి, స్టాన్‌ఫోర్డ్‌లలో పరిశోధించి రాసిన పుస్తకం ఇది!

కొన్ని వారాల క్రితం కంప్యూటర్ హాకర్‌ల సమావేశం జరిగింది. "కంప్యూటర్ లిబ్" అని 1970లో ప్రచురించిన టెడ్ సెల్‌సెన్, ఆపిల్ కంప్యూటర్‌ని తయారు చేసిన స్టీఫెన్ వొజ్‌నియాక్, బిల్ అట్‌కిన్‌సన్, సాత్ తారాసింగ్ ఖల్సా మొదలైన వారంతా- మొత్తం 130 మంది దాకా ఈ సమావేశంలో పాలుగొని కంప్యూటరైజింగ్ ప్రక్రియల మీద లోతుగా చర్చలు జరిపినట్లు నిర్వాహకుడు స్టీవర్ట్ బ్రాంట్ పేర్కొన్నారు!


కంప్యూటర్‌లు ఆర్థిక వ్యవస్థపై బాగా ప్రభావాన్ని చూపుతాయనడంలో సందేహం లేదు. కాబట్టి ఈ హాకర్‌ల వలన వచ్చే అసౌకర్యాన్ని అధిగమించక తప్పదు. కీలకమైన సమాచారాలు, స్పష్టమైన విధానాలు బయట పడటం ఎవరికైనా ఇబ్బందిగానే ఉంటుంది. హాకర్‌ల తెలివితేటల్ని, అంకిత మనస్తత్వాన్ని మెచ్చుకోవచ్చు. కానీ కంప్యూటర్ రంగాన్ని వారు స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడాన్ని ఎవరూ ఒప్పుకోకపోవచ్చు. పైగా అది తప్పు కూడా!


ఉత్కంఠ పూరితమైన వాతావరణాన్ని ఎలా సృష్టించడం అన్నది ముందున్న ప్రశ్న అని ప్రసిద్ధికెక్కిన కంప్యూటర్ హాకర్ బిల్ అట్‌కిన్‌సన్ అంటున్నారని "టయిమ్" ప్రచురించింది. నేరాల్లో ఉపయోగించే కంప్యూటర్ రహస్యాలను కూడ హాకర్‌లు తెలుసుకొంటున్నట్లు ఫిలిప్ ఎల్‌మెర్‌డెవిట్ రాసారు.


ఆలోచించవలసిన సమయం దాటిపోయింది. హాకర్‌లనుంచి కంప్యూటర్‌ల ప్రత్యేకతను నిలుపుకొనే ప్రయత్నం చేయడానికి నడుము బిగించక తప్పదు.


**–డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు**


1. టెడ్ నెల్‌సన్


2. జాన్ డ్రేపర్


3. బిల్ అట్‌కిన్‌సన్


4. స్టీఫెన్ వోజ్‌నియాక్


5. సాత్ తారాసింగ్ ఖల్సా

# గిట్టెక్కించిన చిట్కా

## కందుకూరి వెంకట మహాలక్ష్మి

ఏమండోయి! చూసారా ఇదీ! మళ్లీ కాసుల పేర్లు ఫేషనయి పోయాయండోయి! ఇంత బాడుగుందా? ఎన్ని కాసులనుకుంటున్నారు?" అయిదు కాసులుట! మూడు, నాలుక్కాసుల్లో కూడా నాజూగ్గా, చక్కగా చేస్తున్నారుట. ఎంత చిత్రమో చూడండి! మా బామ్మ మెళ్లో పాతిక్కాసుల కాసుల పేరుండేది. ధరలు పెరిగిపోవడంతోపాటు తక్కువ, తక్కువ బంగారాలతో పెద్ద, పెద్ద నగలు చెయ్యడం కూడా నేర్చుకున్నారీ కంసాలాళ్లు, మొన్న మీనాక్షిగారు మూడు గ్రాములకి గొలుసు చేయించుకొచ్చింది. ఎంత బాగుందనుకున్నారు!" అంటూ చెప్పుకు పోతోంది శాలిని.

అనంతం తింటోన్నది సాంబారన్నమే అయినా అది గొంతుక దగ్గరే ఆగిపోయి, దిగనని మొరాయించింది. అతని కంగారుకి కారణం లేకపోలేదు.

శాలినికి నగల పిచ్చెక్కువ, చూసిన నగల్లా చేయించుకోవాలన్న పిచ్చిసరదా వున్నా, ఆ సరదా అన్న దానికికూడా అంతూ పంతూ వుండాలనుకుంటాడు అనంతం. పైగా తమ తాహతుని బట్టి మసులుకోవాలనుకునే స్వభావం అనంతంది.

అనంతం తాలూకా ఆఫీసులో గుమాస్తా! గవర్నమెంటు ఇచ్చిన జీతం జీతంలాగే సంసారానికి ఖర్చయిపోతుంది. పైనొచ్చే పైసా, పరకా, ఓవర్‌టైంమ్ చేస్తే వచ్చే డబ్బులు తెచ్చి భార్యపేర బ్యాంకిలో వేస్తున్నాడు అలా, అలా కొన్నాళ్లు దాచి, ఓ చిన్న ఇల్లుకొని అందులోకి అందమైన ఫర్నిచర్, ఫ్రిజ్, మిక్సీ వగైరాల్లాంటివన్నీ సమకూర్చుకుని అనుభవించి, ఆనందించాలని అతని కోరిక.

కానీ శాలిని అతని కోరికల్ని కోరికలుగానే మిగిల్చివేస్తోంది. ఆఖరికి ఇంట్లో వంటకి నాలుగు స్టీలు పాత్రలు కూడా కొననివ్వలేదు.

"ఎందుకండీ! అనవసరంగా బోల్డు డబ్బేసి ఆ స్టీలు గిన్నెలు కొనడం! బట్టలు పాతబడిపోతే అవి ఇచ్చి కొనొచ్చు!" మిక్సీకొందాం" అంటే ఎందుకా మిక్సీ వెయ్యి రూపాయలు తగలేసి కొనడం! అందులో ఏది పాడయినా దాని రిపేర్లకి బోల్డు సొమ్ము దాని ముఖాన్ని పెట్టాలి" అనేది. అలాగే "ఫ్రిజ్ కొందాం వేసంకాలం హాయిగా అన్నీ చల్లగా తాగొచ్చు, తినొచ్చు" అంటే, నాలుగువేలు తగలేసి ఫ్రిజ్ ఎందుకు? అది ఉపయోగపడేదీ వేసవి నాలుగైదు నెల్లేకదా? మిగతా సీజనంతా దండగే, పైగా బోల్డు కరెంటు ఖర్చు కూడాను!" అనేది ఇలా అనంతం ముచ్చటపడే ప్రతిదానికీ ఏవో కారణాలు, అడ్డంకులు చెప్పి కొననిచ్చేదికాదు. పోనీ అవన్నీ వచ్చుగాని ఓ చోట చిన్న ఇల్లు కొనుక్కుందాం" అంటే – "ట్రాన్సుఫర్ ఉద్యోగంవాళ్లం మనకెందుకు ఇల్లు? రిటైరయ్యాక చూసుకోవచ్చు – తీరా ఇక్కడ కొన్నాకా బదిలీ అయిపోతే అద్దెలకున్నవాళ్లు ఇల్లంతా నాశనం చేస్తారు. దాని రిపేర్లకి మళ్లీ రెట్టింపు అవుతుం"దంటూ ఆ ఆలోచననీ విరమింప జేసింది శాలిని.

కిక్కురు మనలేని అనంతం మాత్రం ఆమెని బంగారం కొననివ్వకుండా ఆపుచెయ్యలేక పోతున్నాడు. ఆఖరికో రోజు ధైర్యం చిక్కబట్టుకుని అంతంత బంగారం మన కెందుకు శాలినీ!" అన్న మాటలకి వెంటనే అదేమిటండీ! డబ్బుకి విలువ తగ్గిపోతోంది, బంగారం ఖరీదు రోజు, రోజుకి పెరిగిపోతోంది – నేను నాలుగేళ్ల క్రితం వెయ్యి రూపాయలకి కొన్నకాసు ఇప్పుడు పదిహేనొందలయింది! అలా చేతిలో వున్నప్పుడల్లా బంగారంకొని పడేస్తుంటే దాని ఖరీదు పెరుగుతోందే తప్ప తరగటం లేదు!" అంటూ అతన్ని మళ్లా మాట్లాడనివ్వకుండా చేసింది. ఆ దెబ్బతో అతను శాలిని చెప్పేవన్నీ విని ఊ కొట్టడం తప్ప ఏం మాట్లాడలేక పోయేవాడు. కాని అతని తోటి వాళ్లంతా చిన్న ఇల్లు కట్టుకోడం, ఇంట్లో సామాను కూర్చుకోడం వంటివి చేస్తుంటే అనంతంలో కూడా ఆ కోరిక బలపడసాగింది. కాని శాలిని అతన్నామాటలు తలవనన్నా తలవనిచ్చేది కాదు. పైగా అనంతం తనతోటి వారి గురించి చెప్పడం ప్రారంభించగానే, తను కూడా ఇరుగు పొరుగులు చేయించుకునే నగల గురించో, లేదా తన అదృష్టాన్ని కొనియాడి, 'నీ భర్త చాలా ఉత్తము"డని పొగుడుతున్నారనో చెప్తూ అనం



తాన్ని ఉబ్బెయ్యాటానికి ప్రయత్నించేది. ఏ రకం- గానూ శాలిని కొరుకుబడక పోవడంతో గతిలేక అనంతమే నోరు మూసుకుని కూర్చునేవాడు. కానీ అతనిలోని కోరికల్ని మాత్రం సమాధి చెయ్యలేక- పోతున్నాడు. అందుకు మార్గాలని అన్వేషించ- సాగాడు. ఎలాగైనా తన స్నేహితుల్లా తనూ ఓ చిన్న ఇల్లు కొనుక్కోవాలన్న కోరిక రోజు రోజుకీ అతనిలో బలపడసాగింది. ఒకరిద్దరి స్నేహితుల్తో భార్యచేత బంగారాన్ని కొనిపించడం ఎలా మాన్పించాలా? అని ఆలోచించాడు - కూడా. "ఇకనుంచి నీ భార్యపేర డబ్బెయ్యకు. దాంతో ఆమె నీకు తెలీకుండా ఆ డబ్బుతీసి నగలు చేయించుకోవడం మానేస్తుంది" అని సలహా ఇచ్చారు. "అదీ బాగుందనుకుని వేరే ఎక్కవుంటు తెరుచుకుని డబ్బు తనపేర దాచ- సాగాడు.

అకస్మాత్తుగా ఓ రోజు అనంతాన్ని నిలబెట్టి "ఈ మధ్యనా ఎక్కవుంటులో డబ్బెయ్యటం లేదు. ఏం చేస్తున్నారు?" అంటు శాలిని అడిగిన దానికి, "పై రాబడి తగ్గిపోయిం"దన్నాడు నసుగుతూ. అయితే ఓవర్‌టైమ్ డబ్బేదీ?" అని నిలదియ్యగానే తెల్ల- ముఖంవేసి చూస్తున్న అనంతం ముందుకి అతను తనపేర వేరేగా ఎక్కవుంటు తెరిచి దాచిన పాస్ బుక్కు విసిరి "ఎందుకో అబద్దాలు? పెళ్లాం దగ్గరే దాపరికాలెప్పటినుంచి? ఎంత చాటుగా మీ బట్టల మధ్య దాచుకుంటే మాత్రం నాకు కనబడదను- కున్నారా? అందుకే పెద్దవాళ్ళు దొంగతనం, మరోటీ దాగదన్నారు!" అంటూ నానా హంగామా చేసింది. పట్టుబడ్డ దొంగలా నోరుమూసుకోవడం తప్ప మారు మాట్లాడలేని అనంతం మర్నాడే ఆ డబ్బుని శాలిని ఎక్కవుంటుకి మార్చి తన ఎక్కవుంటు క్లోజ్- చేసి పారేసాడు. ఆ నాటి లగాయతూ మళ్లీ డబ్బు పోగవగానే నగలు చేయించుకుంటూ, తన తెలివికి తనే సంబరపడి, పొగుడుకుంటూ, బంగారం

# గట్టెక్కించిన చిట్కా

కొన్నందువల్ల వుండే లాభాలని భర్తకి చెప్పి మురిసిపోయేది పైగా ఇరుగు, పొరుగులు తన అదృష్టాన్ని చూడలేక ఎలా అసూయపడుతున్నారో చెప్పి ఆనందించేది. మూగవాడిలా అనంతం ఆమె చెప్పేవన్నీ విని బాగుంది" అనడం మాత్రం అల- వర్చుకున్నాడు.

చిన్న, చిన్న నగలనుంచి ఇప్పుడు పెద్ద పెద్ద నగల మీదకి మళ్లింది శాలిని దృష్టి. కాసుల పేరయ్యాక వడ్డాణం, తరవాత రవ్వల దుద్దులు, తరవాత రవ్వల నెక్లెస్సు అని వరసపెట్టి చెప్తున్న లిస్టు వింటున్నప్పుడు గుండె ఆగినంత పనయ్యేది అనంతానికి. నగల వ్యామోహం పెరుగుతున్న కొద్దీ, ఇంట్లో సరైన బట్టలు కొననివ్వక పోవడమే కాకుండా, ఆఖరికి తిండి ఖర్చుకూ [illegible]గ్గించేసింది శాలిని రోజు కొక్కసారే కాఫీ ఇచ్చేది. పిండి వంటలమాట ఎత్తవద్దనేది. నూనె, నెయ్యి ఆరోగ్యాన్ని పాడిచేస్తా- యనేది. అన్నంలోకి కూడా ఒక పదార్థం తప్ప వండేదికాదు. భార్య నడత అనంతానికి చాలా చిరాకోసేది. ఇప్పటిక శాలిని పాతిక తులాలదాకా బంగారంకొంది. ఇంకా తృప్తి తీరినట్టులేదు. చేతి ఖర్చుకి చిల్లిగవ్వ ఇచ్చేదికాదు. ఇచ్చినా వాటి ఖర్చులు పైసలతో చెప్పవలసిందే! రోజల్లా కష్టపడ వచ్చే అనంతానికి సరియైన తిండయినా వుండేది- కాదు.


**ఇరుగు పొరుగులు శాలిని చూపే నగల గురించి వారి వారి భర్తలకి చెప్పడంతో, అనంతం పుట్టి- లంచగొండి అనీ, లేకపోతే గుమాస్తా ఉద్యోగంలో ఎవరు పెళ్లానికన్ని నగలు చేయించగలడని వారి భార్యల్ని పూరడించేవారు. అందులో కొందరు అనంతం ముఖం మీదే ఈ విషయమన్నారు కూడ.-**


అది అలా వెళ్లి వెళ్లి అనంతం ఆఫీసు దాకా కూడా- పాకిపోవడంతో అతని గుండెల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్ళు పరిగెత్తసాగాయి. ఇదిలా విషమించి ఉద్యోగం వూడే రోజు కూడా వస్తుందేమో అని గాబరా పడసాగాడు. ఆ మాటే శాలిని దగ్గర అనబోతే "మీ కంతా గాబరా, కంగారూ ఎక్కువండి! ఎవడేం చేస్తాడు? అవన్నీ మా పుట్టింటారు చేయించారని చెప్తాను. రానివ్వండి ఎవడొస్తాడో?!" అని కొట్టి పారేసింది. ఇక శాలినితో మాట్లాడి ప్రయోజనం లేదన్న నిశ్చయాని కొచ్చేసాడు అనంతం. ఇక జరిగేదేదో జరుగుతుందని దేముడిమీద భారంవేసి పూరు- కున్నాడనంతం.

పేరంటాళ్లన్నీ ముగించుకుని ఇంటికి బయలు- దేరేసరికి చీకటి పడింది. ఇంకా రెండు సందులు దాటితేగానీ ఇల్లురాదు. శాలిని గబగబా నడుచు- కుంటూ వెళ్లసాగింది. వెనకనుంచి సైకిల్ మీద దొచ్చిన ఓ వ్యక్తి శాలిని పక్కనుంచే రాసుకుని పోతూ ఆమె మెడలోని గొలుసుని లాగబోయాడు. ఇంతలో ఆమె పెట్టిన కేకలకి ఆ సైకిల్ ఆసామీ మరో సందులోకి పారిపోయాడు.


ఆమె కేకలు విని బైటికొచ్చిన జనం ఆమె అన్ని నగలేసుకుని చీకట్లో వంటరిగా వెళ్తున్నందుకు- ఆమెనే నిందించారు. దాంతో శాలినికి నగలేసుకుని బైటి కెళ్లాలంటేనే దడ ప్రారంభమయింది. పైగా నగల గురించి జరిగే హత్యల గురించి. అనంతం రోజూ పేపరు చదివి చెప్పే వార్తలు వింటుంటే శాలినికి చమటలు పోసేవి. కానీ పైకి ఏమీ తేలకుండా వూరుకునేది. ఏ మాత్రం తన భయాన్ని భర్త ఎదుట వ్యక్త పరిచినా ఇక తన్ని నగలు చేయించుకోనివ్వ- డన్న భయంతో - ఆనాడు సైకిల్ ఆసామీ గొలుసు లాగిన విషయం కూడా అనంతానికి చెప్పలేదు.

క్యాంపు కెళ్లిన అనంతం టెలిగ్రాము చూసుకుని వెంటనే ఆదరా, బాదరాగా ఇంటికొచ్చాడు. తలుపుతీసి ఘొల్లుమంటూ గోలపెడుతున్న శాలినిని వూరుకోపెట్టడం అనంతంవల్ల కావటంలేదు. ఏడ్చి, ఏడ్చి అలిసిపోయిన శాలిని అనంతానికి జరిగిన కథ చెప్పడం ప్రారంభించింది. అతను టూర్ కెళ్లిన మర్నాడు సాయంకాలం ఎవరో ముగ్గురు వ్యక్తులు తలుపుకొట్టి, మీ పేరడిగారని, మీ స్నేహితులనుకుని తలుపు తియ్యగానే అందులో ఇద్దరొచ్చి నా నోరు నొక్కి, నన్నోమూల తాడేసి కుర్చీకి కట్టేసారని, మూడోవాడు తలుపులోపల గడియపెట్టి కత్తి చూపించి "అరిస్తే చంపేస్తా"మని బెదిరించాడని, మొదటి ఇద్దరూ బీరువా తాళాలడిగి తీసుకుని మొత్తం నగలు, విలువైన సరుకులు మూట గట్టు- కున్నారని, పైగా తన వంటిమీదున్న నగలు కూడా తీసుకెళ్లిపోయారని, వెళ్తూ, వెళ్తూ బైటగొళ్లెం పెట్టి మరీ వెళ్లారనీ, మర్నాడు పని మనిషొచ్చి తలుపులు తీసి నా కట్లు విప్పేదాకా అలా ఏడుస్తూ




A feeling of warmth ...
Mansion House
Spirit of Scotland, now in India.

## ఇ'వేమన' పద్యాలు




కలలోని సంపదెల్లను
కలలో మేల్కొనిన తోడ గానక బోవున్
ఇల భోగ భాగ్యగణములు
కలరీతిగ నమ్మవలెను ఘనముగ వేమా.

పడున్నానని చెప్పి గోడు, గోడున ఏడవసాగింది. ఏడుస్తూ అనంతం షర్టుతో ముక్కు తుడుచుకుంది.

అన్నీ విన్న అనంతం పోలీసు రిపోర్టిస్తానంటూ గబగబా బైటి కెళ్ళిపోయాడు.

వారం, పది రోజులు పోలీసు స్టేషనమ్మట తిరిగిన మీదట, ఇదిగో అంటూ వాళ్ళు రంగంలోకి దూకారని, తెలిసిన పెద్ద వాళ్ళని పట్టుకుని పోలీసు డిపార్టుమెంటుకి చెప్పించడంవల్ల అనంతం ఇంట జరిగిన దొగతనం గురించి సీరియస్‌గా దర్యాప్తు

## గట్టెక్కించిన చిట్కా

జరుగుతోందని చెప్పిన వార్తలు విని శాలిని కాస్త సంబరపడింది.

అప్పుడప్పుడు అంత కష్టపడి చేయించుకున్న నగలన్నీ పోయినందుకు శోకాలిడుతూ కూర్చునేది ఇరుగు పొరుగుల కళ్ళు పడ్డాయని తిట్టిపోసేది. "బంగారం పోతేపోయింది కనీసం నీ ప్రాణాలు దక్కాయి. డబ్బుకోసం భార్యా, భర్తల్ని హత్యకూడా చేసారుట. మనం అదృష్టవంతులం, ఇంకో వూళ్ళో డబ్బు, బంగారం తీసుకుని ఆ ఇంట్లో ఆడదాన్ని రేప్ చేసారుట కూడాను. అవన్నీ చూస్తుంటే, మనం చాలా అదృష్టవంతుల మనుకోవాలి. నగలు పోతే మళ్ళీ చేయించుకోవచ్చు. అవిపోతే బ్రతకలేం" అంటూ వూరడించేవాడు అనంతం.

ఆ సంఘటన తరవాత శాలిని పుస్తెల్ని తాడుకి గుచ్చి మెళ్ళో వేసుకుని, చేతికి గాజు లేసుకోడం ప్రారంభించింది. ఒకటి రెండుసార్లు అనంతం ఓ నాలుగువేలు అప్పుచేసి తెస్తాను కనీసం పుస్తెల-తాడు చేయించుకోమని శాలినికి చెప్పాడు. ఆ సంఘటనతో భయపడిపోయిన శాలిని ఒద్దుగాక ఒద్దంది. ఆ రెండు సంఘటనలతో శాలినికి నగలంటేనే దడ వణుకు పుట్టి బైటి కెళ్ళేటప్పుడు చెవినున్న దుద్దులు సహితం తీసేసి మరీ వెళ్ళేది.

"శాలినీ! శాలినీ!" అంటూ రెండు గంటలకే ఆఫీసు నుంచి ఇంటికొచ్చిన అనంతం ముఖంలోని ఆనందం చూసి ఏమిటండీ! అంత సంతోషంగా వున్నారు?" అన్న మాటలకి "ఆనందం కాదూ? పోలీసులు దొంగల్ని పట్టుకున్నారట, నీ బంగార మంతా దొరికిందిట, కానీ అదంతా కరిగించి ముద్ద చేసారుట, ఆ ముద్దని మనకిచ్చేస్తారట. దాంతో మళ్ళీ నువ్వు నీ నగలు చేయించుకోవచ్చు. దానికి మళ్ళీ మనకి మజూరీయే అవుతుందనుకో! ఏం చేస్తాం? ఏదో అసలన్నా దక్కుతోంది" అంటూ చేప్పుకు పోతున్న అనంతం మాటల్ని శాలిని ఆనందం పట్టలేక 'నిజంగానా? నిజంగా దొరికిందా?!" అంటూ అనంతం భుజాల్ని పట్టుకుని కుదిపెయ్యసాగింది. నిజమేనే! నీ పాతనగలన్నీ మళ్ళీ వచ్చేస్తాయి.

"బాబోయ్ యింక నగలు మాత్రం వద్దండీ! మీరన్నట్టు ఆ దొంగలు నా ప్రాణాన్ని కాపాడి, ఆ బంగార మొక్కటే ఎత్తుకెళ్ళి పోయారు. మళ్ళీ వీటికోసం మరొకడొచ్చి ఏం చేసినా ప్రమాదం కూడాను! ఇప్పుడు యింత బంగారం వుందని ఊరంతా ఈ దొంగలవల్ల తెలిసి పోయింది. అది మీ చేతికి యివ్వగానే, అటునుంచటే బజార్లోకెళ్ళి, అమ్మేసి బ్యాంకిలో ఆ డబ్బేసి రండి. ఎక్కడన్నా మంచి ఇల్లు అమ్మకానికొస్తే ఆ డబ్బుతో కొనేద్దాం. అదయితే ఎవ్వరూ ఎత్తుకు పోరు. అంటూ చెప్పుకుపోతున్న భార్యని చూసి లోపలో పల్లో సంతోషించాడు అనంతం.

స్నేహితులచేత ఆడించిన ఈ నాటకం విజయవంత మయిందన్న సంగతి అనంతానికి, స్నేహితులకి, మాత్రమే తెల్సు. అనంతం కోరిక ఇన్నాళ్ళకి తీరి చక్కటి సొంత ఇంట్లో వుంటున్నప్పటికీ, శాలిని మాత్రం బోసి మెడతోనే వుంటోంది. అనంతం బ్రతిమాలినా మళ్ళీ నగల కొట్టువైపు వెళ్ళడంగాని, నగల గురించి తలవడంగాని చెయ్యాలేదంటే నమ్మండి. □


శ్రీవల్లి ప్రొడక్షన్స్
ఆత్మబలం
దర్శకత్వం: తాతినేని ప్రసాద్ B.A.
చక్రవర్తి
నిర్మాతలు: కె.ముత్యాలరావు జె.యమ్.నాయుడు

---







...శోభనం"

## పి. ఎస్. ప్రకాష్ దర్శకత్వంలో "పాతాళ నాగు"

"ఫక్తు జానపద చిత్రం. నలభై రోజుల్లో ఏకబిగిని షూటింగ్ ముగుస్తుంది." అన్నారు. ప్రముఖ ఛాయా గ్రాహకుడు పి. ఎస్. ప్రకాష్. ఈయన ఇంతవరకు పది కన్నడ చిత్రాలను డైరెక్ట్ చేశారు. ఇప్పుడీయన స్క్రీన్ ప్లే, ఛాయా గ్రహణం, దర్శకత్వంలో ఇ. నాగేశ్వరరావు నిర్మించే స్వర్ణ పిలిమ్స్ 'పాతాళ నాగు' చిత్రంలో అరుణ, నరసింహరాజు నాయికా నాయకులు. రాజనాల, త్యాగరాజు, జ్యోతిలక్ష్మి, జయమాలిని, అనూరాధతో పాటు ఒక బొంబాయి నర్తకీమణి కూడా పాల్గొంటుంది పిల్లర భావనారాయణ సంభాషణలు, సత్యం సంగీతంతో నిర్మాతే సంకలకర్త

## 'ఆలయ దీపం" లో సింగపూర్ సిసింద్రీ

ఓ సింగపూర్ కోటీశ్వరుడి గారబ్బాయి తనను పెళ్లి చేసుకోడానికి వస్తున్నాడని రాణి (అనుపమ) చెప్పగానే సుందరి (రమాప్రభ) ఆనందంతో పాటు ఎంతో కంగారు పడిపోయింది. పదేళ్లబట్టి ఉన్న ఒకే సూట్‌ను తన భర్త బాబూరావు (నూతన్ ప్రసాద్)ని తొడుక్కోమంది.

కాస్సేపటికి సింగపూర్ ఓడల యజమానిలా బుచ్చిబాబు (శుభలేక సుధాకర్) రావడంతోటే చటుక్కున వొంగి, "నమస్కారమండీ సింగపూర్ స్టయిల్,' అన్నాడు

సుందరి తమాయించుకుంటూ, 'నమస్కారం చేశారా? ఇంకేమిటో నని కంగారు పడ్డాను. కూచోండి అల్లుడుగారూ! సింగపూర్‌లో తిరిగే మన ఓడ పేరేమిటి? అంది

"సర్కార్ ఎక్స్‌ప్రెస్"

"చాలా బాగుందండీ పేరు ఇంతకీ మన నాన్నగారి రేంటి? అదేనండి– మీ నాన్నగారి పేరు?

"ఆయన పేరు డన్‌హిల్ మెక్‌డొవెల్"

"అదేంటండీ ఇంగ్లీషు పేరులా ఉందే! డబ్బుండాలేగాని, ఏ దరిద్రవు పేరైనా బాగానే ఉంటుంది లెండి," అంటూ సుందరి గది వంక తిరిగి, ఏవండోయ్! ఇలా రండి మన సింగపూర్ అల్లుడుగారొచ్చారు, అని కేకేట్టింది

బుచ్చిబాబు ఆ గది వంక చూస్తూ "అంత గట్టిగా పిలుస్తున్నారు ఎవరైనా చెవిటాయన్నాండీ?' అన్నాడు


"కాదండి మా ఇంటాయనే నికల్సన్ అండ్ పికల్సన్ కంపెనీలో పెద్ద మేనేజర్,' అని సుందరి అంటూండగా కోటు సర్దుకుంటూ బాబూరావు రీవిగా వచ్చాడు

అంతే బాబూరావూ, బుచ్చిబాబూ ఒకర్నొకరు చూసుకుని అమాంతంగా తెల్లబోయారు

"ఇతను ఇతను నికల్సన్ పికల్సన్ మేనేజరా? అన్నాడు బుచ్చిబాబు

"ఏవిటీ! – వీడు – వీడు - వీడు సింగపూర్ కోటీశ్వరుడి కొడుకా? వీడు మహాలక్ష్మి గారింట్లో సెక్రటీగాడు వీడికి అప్పులూ, తాకట్లూ తప్ప ఏమీ లేవు దరిద్రం ఇలాంటి వాడ్ని ఊరికే వదలకూడదు జైల్లో పెట్టించాలి" అన్నాడు బాబూరావు


'నన్ను ఫ్రాడ్ అని పట్టించారంటే మీరూ ఫ్రాడ్ అని రుజువు చేయగలను నేను రాణిని ప్రేమించాను తనకోసం అబద్ధం చెప్పాను తనుకూడా నాతో



'పట్నంతో పోరాటం' లో

# విశేషాలు

-జి. వి. జి.



రాధ "దొంగ"

అబద్ధం చెప్పింది మాదేం పెద్ద దేవదాసు – పార్వతుల ప్రేమకాదు . రాణీ! అర్జెంట్‌గా నిన్ను నేను మరచిపోతున్నాను "నువ్వూ అదే ప్రోగ్రాం పెట్టుకో!" అంటూ బుచ్చిబాబు స్టయిల్‌గా వెళ్ళిపోయాడు


రాణి టడ్పు లంకించుకుంది

శ్రీధర్ కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వంలో నంగునూరు శ్రీనివాసరావు సమర్పించే లక్ష్మీ ఫిలిమ్స్ కంబైన్స్ "ఆలయదీపం" చిత్రానికి ఎన్ ఆర్ అనూరాధాదేవి నిర్మాత

## షూటింగ్ పూర్తయిన "మిస్టర్ ఎక్స్"

"థ్రిల్స్‌తో కూడిన సోషియో, సైంటిఫిక్ ఫాంటసీ చిత్రం పి. ఎస్ ప్రకాశ్ ట్రిక్ ఫొటోగ్రఫీ విశేషాకర్షణ డిసెంబర్‌లో విడుదల," అని తెలిపారు అశ్వనీ కంబైన్స్ నిర్మాతలు – శివకృష్ణ, శ్యామల గౌరి, రంగనాథ్ గొల్లపూడి, రమాప్రభ, త్యాగరాజు, రాళ్ళపల్లి, విక్రమ్, నాగేష్, జ్యోతిలక్ష్మి, పి జె శర్మ, కాంతారావు నటించారు అమ్మ ఫైనాన్స్ సమర్పణలో సి కె భానోజీరావు, జె అనంత కృష్ణ నిర్మించిన ఈ చిత్రానికి మోదుకూరి జాన్సన్ మాటలు, సత్యం సంగీతం, మోహన్ రాజేందర్

రావు గోపాలరావు, చిరంజీవి




శిల్పం, గౌతంరాజు – రవీంద్ర సహకార దర్శకత్వం, రాజ్‌కుమార్ ప్రొడక్షన్‌తో ఎ దమయంతి, సి వి లక్ష్మి సహ నిర్మాతలు

## రామోజీరావు నాల్గవ చిత్రం "మయూరి"

"పట్టుదల గల ఒక యువతి నిజజీవితంలో ఎదురైన ఘటనకు – ప్రతిఘటనే 'మయూరి' కథ అసలు ఇది కథ కాదు; నిజం నాయికగా సుధ అనే నర్తకి పరిచయం గావింపబడుతుంది," అన్నారు సింగీతం శ్రీనివాసరావు ఈయన దర్శకత్వంలో రామోజీరావు "శ్రీవారికి ప్రేమ లేఖ, సుందరి – సుబ్బారావు, కాంచన గంగ" అనంతరం నిర్మించే ఉషాకిరణ్ మూవీస్ "మయూరి" చిత్రంలో శుభాకర్, పి ఎల్ నారాయణ, వై విజయ, నిర్మల, శ్రీశైలజ, ఎస్ ఆర్ రాజా ప్రభృత నటవర్గం. గణేశ్ పాత్రో మాటలు, వేటూరి పాటలు, ఎస్ పి బాల సుబ్రహ్మణ్యం సంగీతం, హరి ఛాయ, శేషు నృత్యాలు, భాస్కరరాజు శిల్పం, గౌతంరాజు కూర్పుతో నిర్వహణ బాధ్యతలు వహించే అట్లూరి రామారావు "నవంబర్ 10 నుంచి డిసెంబర్ 26 వరకు హైద్రాబాద్, జైపూర్‌లో నిర్విరామంగా జరిగే షెడ్యూల్‌తో షూటింగ్ పూర్తవుతుంది," అని తెలిపారు

## నరేష్ "కిరాయి మొనగాడు"

నరేష్ పక్కన చిత్ర చాలా చలాకీగానటించింది, అన్నారు రాజశేఖర్ ఈయన దర్శకత్వంలో పంపిణీ సంస్థ శ్రీ విజయ కృష్ణా ఫిలిమ్స్ అధినేత డి పృథ్వీధరరావు నిర్మించే వి ఎన్ ఆర్ పిక్చర్స్ "కిరాయి మొనగాడు" చిత్రం షూటింగ్ నవంబర్ 15తో పూర్తయింది బాలాజీ, శ్యామలగౌరి, లక్ష్మికాంత్, డాక్టర్ శివప్రసాద్, గోకిన రామారావు కాంచన, విజయచాముండేశ్వరి తక్కిన నటవర్గం, కథ స్క్రీన్ ప్లేను ఆంజనేయ పుష్పానంద్ సమకూర్చారు సత్యం స్వకల్పనలో ఆరుద్ర, కొసరాజు, రాజశ్రీ గీతాలు రాశారు రామకృష్ణ ఛాయాగ్రాహకుడు వాసిరెడ్డి నాగేశ్వరరావు నిర్మాణ సారధి



అక్కినేని, రాధిక, "ఇల్లాలే దేవత"



"దొంగల్లో దొర" సుమన్, విజయశాంతి

# సినిమా

## "బాబాయ్ – అబ్బాయ్"లో నెంబరే ప్రాప్తం

బాల (కృష్ణ), వీర (భద్రరావు)రెస్టారెంట్‌లో కూర్చొని ఉన్నారు. బేరర్ దగ్గరికి రాగానే "మీ రెస్టా-రెంట్ మొత్తం మీద కాస్ట్లీ ఐస్‌క్రీమ్స్ రెండు పట్రావోయ్! ఏమిటలా చూస్తావ్? డబ్బులున్నాయ్ లేవోయ్!" అంటూ వీర స్టయిల్‌గా వంద రూపాయల నోటు తీసి ఊపాడు.

బేరర్ వెళ్ళి తెచ్చిన ఐస్‌క్రీమ్‌ను ఆరగిస్తూ, వీర, బాలకృష్ణతో "వెరీగుడ్! కంగ్రాచులేషన్స్, అబ్బాయ్! బంగారు బాతుని పట్టావ్! జాగ్రత్తగా టికెట్ వేసుకో! ఈ ఉన్న వాళ్ళ పిల్లలకి లేని వాళ్ళన్నా, పనీపాటా లేని వాళ్ళన్నా ఓ రకమైన ఏవగింపు ఉంటుంది. వెయ్యి అబద్దాలాడైనా ఈ స్నేహాన్ని మాత్రం నిలుపుకో," అంటూ వంద రూపాయల నోటిచ్చి, "ఇందా వంద.జాగ్రత్తగా చిల్లర పట్రా.... బీ కేర్‌ఫుల్," అన్నాడు.

బేరర్ వెళ్ళిన వెంటనే తిరిగొచ్చి," సార్, ఇంకో నోటివ్వమన్నారు, సార్! ఇది మధ్య చిరిగింది చూడండి," అంటూ నోటును చూపించాడు.

వీర నెత్తిబాదుకుంటూ, అమ్మ గోదావరీ! ఈ ట్రిప్‌లో పొంగి మమ్మల్ని ముంచేశావా? ఇప్పుడు రెండే పద్ధతులు, బాబూ! మీ ఓనర్‌కి నూట రెండు ఇవ్వు; మాకు రెండు టోపీలన్నా ఇవ్వు," అంటూ రెండు వేళ్ళు చూపించి, "ఈ రెండింట్లో ఓ వేలు పట్టుకో, నాయనా!" అన్నాడు.

బేరర్ ఎగాదిగా చూశాడు. "డబ్బిమ్మంటే వేలు పట్టుకోమంటారేమిటండీ?"

"చెప్తాను. పట్టుకో."

బేరర్ ఓ వేలు పట్టుకోగానే "అంతే! మీ ఓనర్‌కి నెంబరే ప్రాప్తం. నూట రెండు!" అన్నాడు వీర.


అర్థంగాక ఆముదం తాగిన వాడిలా ముఖం పెట్టే-శాడు బేరర్.

జంధ్యాల రచన, దర్శకత్వంలో ఎస్. సుధాకరరెడ్డి నిర్మించే ఉషోదయా మూవీస్ "బాబాయ్ – అబ్బాయ్" చిత్రానికి కె.కృష్ణకుమార్‌రెడ్డి ఎగ్జి-క్యూటివ్ ప్రొడ్యూసర్.


"మంత్రదండం"లో శివకృష్ణ, వనితశ్రీ



"బాబాయ్- అబ్బాయ్"లో అనితారెడ్డి, బాలకృష్ణ



"బుల్లెట్"లో సుహాసిని, దర్శకుడు బాపూ, కృష్ణంరాజు





మోహన్‌బాబు, విజయశాంతి, "తిరుగుబాటు"



శరత్‌బాబు, తులసి, "వస్తాద్"

## మాదాల విప్లవ సృష్టి "ఎర్రమట్టి"

"భూమినే తల్లిగా నమ్ముకున్న బడుగు జీవి రైతు పరిస్థితిని ఇవ్వాళ పట్టించుకునే వారెవరూ లేరు. వారి జీవితాలలోకి వెళ్లి, వారి కష్ట సుఖాలకు అద్దం పడుతూ తయారు చేస్తున్న చిత్రమిది. మా లక్ష్య సాధనలో ఒకడుగా మాతో మొదట్నుంచి ఉంటున్న ధవళ సత్యం ఈ చిత్రానికి డైరెక్టరు. 1972లో ఒక లక్ష్య సాధన కోసం మద్రాసు వచ్చిన నేను నా ఆశయ సాధన కోసం నవతరం పిక్చర్స్‌ను స్థాపించి,


'యువతరం కదిలింది' లాంటి ప్రబోధాత్మకమైన చిత్రాలు తీశాను. వాటి ఆదరణ చూసి విప్లవ చిత్రాలపై పూతతో ఫక్తు వ్యాపార చిత్రాలు కొన్నింటిని ఇతరులు గబగబ రీళ్ళు చుట్టేసి ప్రేక్షకలోకం మీదికి దాడి చేయడంతో ప్రేక్షకులు నిరాశ చెందారు. ఆ ప్రభావం చిత్త శుద్ధితో రూపొందించే నా తదుపరి చిత్రాల మీద కాస్త పడింది. ఆర్థికంగా అపజయం పొందడం, సెన్సారు వారి అనేక ఇబ్బందులు నన్ను

జ్యోతిలక్ష్మి "లంచావతారం"




హైరానా పెట్టాయి. ఈ పరిస్థితిలో నా లక్ష్య సిద్ధితో చిత్రాలు కొనసాగించడం కోసం నేను బయట చిత్రాల్లో నటించవలసిన అవసరం ఏర్పడింది అలా మొదట దాసరిగారి 'ఉగ్ర నరసింహం'లో ఒక ప్రత్యేక పాత్రను నిర్వహించడం నాకెంతో సంతోషంగా ఉంది. ఈ నిర్ణయం నా స్వార్థం కోస్లం కాదు; నేను నిర్మించే సిసలైన విప్లవాత్మక చిత్రాల కోసం. అలాంటి చైతన్యవంతమైన చిత్రాలను నిర్మించడమే కాకుండా సమర్థులైన మట్టిలో మాణిక్యాలకు అవకాశాలిచ్చే ఆనవాయితీని నేను సదా పాటిస్తాను," అన్నారు మాదాల రంగారావు. ఈయన కథ, నిర్వహణలో డిసెంబర్‌లో మొదలైన 'ఎర్రమట్టి' విప్లవాత్మక చిత్రంలో ప్రజామండలి గాయకుడు శ్రీనివాస్ పతాక సన్నివేశం కోసం మధురంగా గానం చేసిన 15 నిమిషాల జముకుల కథ హైలెట్ అని డైరెక్టర్ ధవళ సత్యం తెలిపారు. ఎం. జి. రామారావు సంభాషణలు, పార్థ సారథి సంగీతం, ఆర్. రామారావు ఛాయ, మహేశ్ సహకార దర్శకత్వం, చౌదల సుబ్బారావు కూర్పు తెర వెనుక హంగులు.

"మాంగల్యబంధం" సుహాసిని, చంద్రమోహన్



"కిరాయి మొనగాడు"లో చిత్ర, నరేష్, గోగిన రామారావు





విజయలక్ష్మి, దీప, సుహాసిని, శోభన్‌బాబు, శ్రీధర్ "కొంగుముడి"



గొల్లపూడి, చిడతల అప్పారావు, అల్లు రామలింగయ్య "బందీ"

## వై. హరికృష్ణ ఆధ్వర్యంలో కృష్ణ స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహించే రెండు చిత్రాలు

"మా శోభన్‌బాబు సమర్పించే శ్రీనికేతన్ ఆర్ట్ క్రియేషన్స్ 'దేవాలయం' చిత్రం షూటింగ్ డిసెంబర్ 16 నుంచి జనవరి 15 వరకు అమరావతి, శ్రీశైలం, హైదరాబాద్ ప్రాంతాలలో జరుగుతుంది." అన్నారు ప్రసిద్ధ పంపిణీ సంస్థ లక్ష్మీచిత్ర అధినేత వై హరికృష్ణ. బి లక్ష్మి, వై. రాజ్యలక్ష్మి నిర్మించే ఈ చిత్రంలో విజయశాంతి నాయిక. రావుగోపాలరావు, జె వి. సోమయాజులు, ఎ. ఎల్. నారాయణ, వేలు, వీరభద్రరావు. నర్రా వెంకటేశ్వరరావు, ఎం.వి.ఎస్. హరనాథరావు. మాడా, పండిట్ రవికాంత్, అన్నపూర్ణ, దేవి శశికళ పాల్గొంటున్నారు మోపర్తి జాన్సన్ కథ, మాటలు రాశారు. రవికాంత్ నగాయిచ్ ఛాయ, తార నృత్యాలు, తోట శిల్పంతో నర్రా కోటయ్య ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రామకృష్ణారెడ్డి ప్రొడక్షన్ డిజైనర్

కృష్ణ చిత్ర పతాకంలో 'అనిల్‌బాబు నిర్మించే "వందేమాతరం" చిత్రంలో విజయశాంతి సరసన

ఈ చిత్రాన్ని చలి కాలంలో ఊటీలో తీసాం. అందుకే ఆ పేరు పెట్టాం!





రాజశేఖర్ అనే రంగస్థలానుభవం గల యువ ప్రతిభాశాలి నాయకుడుగా పరిచయం గావింపబడుతున్నాడు ఎ ఎల్. నారాయణ, నల్లూరి వెంకటేశ్వర్లు, సాయిచంద్, నర్రా కోటేశ్వరరావు, వేలు, వీరభద్రరావు, సాక్షి రంగారావు, శ్రీనివాసరావు, చిట్టిబాబు, ఎం వి కోటేశ్వరరావు, బెనర్జీ, సాయికుమార్, రఘునాథరెడ్డి, నిర్మల, జానకి, లక్ష్మిప్రియ, జయశీల, వరలక్ష్మి, షహబా విజయవాణి పాత్రధారులు. డిసెంబర్ 4 నుంచి 15, జనవరి 15 నుంచి నెలాఖరు వరకు గుంటూరులో షూటింగ్ పూర్తవుతుందని, ఒక పాట మాత్రం హైదరాబాద్ స్టూడియోలో చిత్రీకరింపబడుతుందని డైరెక్టర్ కృష్ణ తెలిపారు వి. ఎస్. కామేశ్వరరావు మాటలు, ఆర్. రామారావు ఛాయ, ఉల్చి శిల్పం, చిన్ని నృత్యాలు నిర్వహిస్తున్నారు.

పై రెండు చిత్రాలకూ చక్రవర్తి సంగీతం, ముత్యాల సుబ్బయ్య సహ దర్శకత్వం, నరసింహారావు సహకార దర్శకత్వం, దాసుల సుబ్బారావు కూర్పు, బి. కోటేశ్వరరావు- వి. నాగభూషణరావు ప్రొడక్షన్‌తో తాతినేని సదాశివరావు ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్.

సినిమా

"ఆలయ దీపం", సుజాత, కల్పన



"రేచుక్క"లో గిరిబాబు, భానుచందర్





రాధా, మురళి, "యవ్వనం పిలిచింది"

# సినిమా

## ఊటీలో చిరంజీవితో సత్యనారాయణ సమర్పించే "చిరంజీవి" చిత్రం

"ఊటీలో చిరంజీవి, విజయశాంతి మీద రెండు సాంగ్స్‌ను మా డైరెక్టర్ సి.వి. రాజేంద్రన్ మహోన్నతంగా పిక్చరైజ్ చేశారు. ప్రముఖ దర్శకుడు శ్రీధర్ సోదరుడైన రాజేంద్రన్ శివాజీ గణేశన్ హీరోగా 17 చిత్రాలను డైరెక్ట్ చేశారు. కన్నడ చిత్రాల డైరెక్టర్‌గానూ ఈయనకు మంచి పేరుంది. విశేషమేమిటంటే ఈయన మాతృ భాష తెలుగే," అన్నారు కైకాల సత్యనారాయణ. ఈయన సమర్పించే అజయ్ క్రియేషన్స్ "చిరంజీవి" చిత్రంలో ఈయనతోపాటు మురళీమోహన్, రంగనాథ్, నూతన్‌ప్రసాద్, వేలు, వీరభద్రరావు, భానుప్రియ, తక్కిన తారాగణం. సత్యానంద్ సంభాషణలు, చక్రవర్తి సంగీతం, జయరాం ఛాయ, కె. ఎల్. ధర్ శిల్పం, ఆంథోనీ నృత్యాలు, విజయన్ సాహసాలు, సంతానం- వేమూరి జ్యోతేంద్ర సహకార దర్శకత్వం, సత్యం- నాగేశ్వరరావు కూర్పుతో జి వి కృష్ణారావు నిర్మాణ సారధి. డిసెంబర్‌లో చిత్రీకరణ ముగిసినట్లు నిర్మాతలు కె వి రామారావు, కె. ఎ రామారావు తెలియజేశారు. □

---

# సినీతార

(తార తల్లి వ్యధ!)

చూడండి!

అంతా సినిమాల్లో చేరడం చాలా సులభం అన్నారు.

ఓ పక్క యిన్ని కష్టాలతో సతమతమవుతుంటే వీళ్ళకెందుకండీ తక్కువకి నటించాలి?

వున్న కష్టాలుగాక మరో పెద్ద కష్టంవొచ్చి పడింది! ఆ వంటమనిషి చూడండి ఎనిమిదింటి కివ్వాల్సిన బత్తాయిరసం ఎనిమిదున్నరైనా ఇచ్చిందా? పేరుకి తార తల్లిని! పడేవన్నీ కష్టాలే! చూస్తూనే వున్నారుగా.

యిలాంటి తారలూ వారి తల్లులూపడే అనేక కష్టాలూ గాధలూ బాధలూ వ్యధలూ అన్నీకలిపి "సినీతార"గా విడుదలవుతోంది.

అమ్మాయిని తీసుకుని మద్రాసు చేరాను. అప్పుడు తెలిసింది వేషాలు దొరకడమంటే ఎంత కష్టమో. అమ్మాయి, నేనూ పడరాని పాట్లెన్ని పడ్డామో పట్టుకోరాని కాళ్ళెన్ని పట్టుకున్నామో చేయరాని పనులెన్ని చేశామో ఆ భగవంతుడికూడా తెలియదు.

ఏదో ఆ దేవుడు చల్లగా చూడబట్టి పగలనకా రాత్రనకా కష్టపడి నటించి అమ్మాయి ఈరోజు ఎంతో పేరు తెచ్చుకుంది. నిన్ననే అమ్మాయికి నేషనల్ అవార్డుగూడా వచ్చింది. ఇంత కష్టపడి అవార్డు తెచ్చుకుంటే కొంపలొచ్చి మా చిత్రంలో ఇరవైవేలకి నటించమని మరీ అన్యాయంగా అడుగుతున్నారు. అవార్డు పుచ్చుకున్నాం. అంత తక్కువకి నటించాల్సిన ఖర్మమాకేమిటి? ఓ పక్కన మలయాళం వాళ్ళూ, అరవ్వాళ్ళూ, కన్నడంవాళ్ళూ, హిందీవాళ్ళూ లక్షలకి లక్షలిస్తామంటుంటే తెలుగు సినిమాల్లో అంత తక్కువకి నటించాల్సిన ఖర్మ మాకేమిటి?

అసలు ప్రస్తుతం మేం ఎన్నికష్టాల్లో వున్నామో మీకు తెలుసా?



నాకు నాలుగురోజుల్నించి ఒహటే జలుబు!

మా అమ్మగారికి ఎనిమిది రోజుల్నించి తలనెప్పి!

కారేమో రిపేరుకెళ్ళింది!

ఈ యిల్లుమీద అప్పు తీరిందని సంతోషించనా! నిన్న కొన్న ఎనిమిదిలక్షల రూపాయల ఇంటిమీద ఇంకా లక్షరూపాయలు అప్పుందని విచారించనా!

పూలపాన్పుగా వుందనుకున్న తారల జీవితాల్లో కూడా ఎన్నో భావాలు, కథలూ వున్నాయి. సినీ జీవితాలకు అద్దం పట్టే చిత్రం లావణ్యా ఆర్ట్స్ పిక్చర్స్ వారి "సినీతార" కె.జి. జార్జ్ దర్శకత్వంలో పర్వతరెడ్డి శివకుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి గోపి రచన చేయగా, వి.ఎస్.వి. నరసింహారావు సమకూరుస్తున్నారు.

# పిల్లలు వారి మానసిక ప్రవృత్తులు



# పిల్లలు-కుతూహలం

డాక్టర్ (శ్రీమతి) జయానాగరాజు
మానసిక వేత్త

పిల్లలకు తెలియనివి తెలుసుకోవాలనే కుతూహలం వుంటుంది. తమ చుట్టూ ఎన్నో వింతలు విడ్డూరాలు తెలియనివి.. ఆసక్తి కరమైనవి అడిగి, చూచి, ముట్టుకుని తెలుసుకోవాలని వుంటుంది. గర్భస్థ శిశుస్థాయి నుంచి కూడా కుతూహలం వుంటుందని శాస్త్రవేత్తలు చెపుతూ వుంటారు. తల్లి కడుపులో వుండి నారదుడు చెప్పిన శ్రీమన్నారాయణ మంత్రాన్ని నేర్చుకొని హరి భక్తుడైన ప్రహ్లాదుడు, కడుపులో నుండి శ్రీ కృష్ణుడు పద్మ-వ్యూహ తంత్రాన్ని చెబుతుండగా 'ఊ' కొట్టి విన్న అభిమన్యుడు... మొదలైన పురాణ కథలు దీనికి దృష్టాంతం అని చెప్పవచ్చు. తెలుసుకోవాలనే తపన, అర్థం చేసుకొనే పరిజ్ఞానం, చాలా చిన్నతనం నుండే అలవడతాయి. తల్లి యొక్క మానసిక పరివర్తనే గర్భస్థ శిశువు తెలుసు కుంటుంది. తల్లి గనుక ఆనందంగా వుంటూ గల గలా నవ్వుతూ, చక చకా పని చేసుకుపోతూ వుంటే కడుపులోని బిడ్డకూడా ఆనందానికి వంత పాడుతూ చక చకా కదులుతుంది. మరి భయంతో, విచారంతో తల్లి ఊగిపోతే పిండం కూడ విచారంతో వూగిసలాడుతుంది. మానసిక శరీరం ద్వారా తెలుసుకుంటుంది. (కినెస్థటిక్ సెన్సేషన్) చప్పుడు, వెలుతురు, వచ్చేపొయ్యే తన కంటి ముందు కదలాడే బొమ్మలు అన్నింటిని గురించి తెలుసుకోవాలనే అభిలాషతో అటూ యిటూ సుమారు రెండు నెలల వరకు బిడ్డలు తల్లి ఎత్తుకోగానే ఏడ్పు మానడం, పరాయి వారు ఎత్తుకోగానే ఏడ్వటం చేస్తారు. "అబ్బో నంగనాచి... అప్పుడే అమ్మను గుర్తు పట్టుతున్నది..." అని అనుకుంటూ ఎందరో తల్లులు పొంగిపోతారు... కాని వాళ్ళు శారీరక అనుభవం వల్ల అలా చేస్తారు. కొన్నాళ్ళపాటు తల్లి ఎత్తుకోవడం ఆ స్పర్శ వల్ల ఆనందం పొందటం జరుగుతుంది... ఆ స్పర్శా జ్ఞానంలో తేడా వచ్చినప్పుడు (యితరులు ఎత్తుకున్ననాడు) పిల్లలు ఏడుస్తారు. తమ వేళ్ళను, చేతులను చూచుకోవడం, మొదలైన శైశవ క్రీడల ద్వారా తమని తామే కాకుండా తామున్న పరిసరాలను కూడా చాలా కుతూహలంతో తెలుసుకుంటారు. మూడు నుంచి ఆరు నెలల వరకు పదే పదే చూడడం, అవే మాటలు వినడం మూలంగా పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటారు పిల్లలు. తమకు తెలియనివి ఏవైనా చూచినా విన్నా బిడ్డలు ఏడుస్తారు. అది భయం వల్ల కాదు. కాని తమకంత వరకూ తెలియని "క్రొత్త"దనం వల్ల ఏడుస్తారు. వులిక్కి పడతారు. అన్నింటికన్నా నోరు, నోటి స్పర్శ వైకల్యంతో గనుక తల్లి ఓ మూల చలనం లేకుండా కూర్చుంటే బిడ్డకూడా మొద్దుగా లోపల చలనం లేకుండా వుంటుంది. ఇది శాస్త్రయుక్తంగా విశద పరచిన సంగతేను. అందుకే మన పెద్దలు గర్భిణీ స్త్రీలను సాధ్యమైనంత వరకు ఆహ్లాదకరంగా వుంచడానికి చూస్తూ వారి కోరికలను తీరుస్తూ వుంటారు.

పుట్టీ పుట్టగానే చీకటి నుంచి వెలుగులోనికి వచ్చిన పాప వెలుతురును చూడాలని ప్రయత్నించి అదేమిటో తెలియక తికమక పడి కండ్లు మూసుకుంటుంది. తనంతట తనే గాలి పీల్చి ఆ వింత ఎరుగక ఏడుస్తుంది. పుట్టిన బిడ్డ ముందు ఏడ్చి తరువాత నవ్వుతుంది చిన్నగ... పాప పంకిలమైన భూమి మీద జన్మించినందుకు ఏడ్చి పిచ్చి లోకాన్ని చూచి తనలో తాను నవ్వుతుందంటారు పెద్దలు.

కానీ తన శరీరం మీద ఒక్కుమ్మడిగా దాడి చేసిన ప్రకృతి సిద్ధమైన గాలి, వెలుతురు, చలి, వేడి, నెప్పి, సౌఖ్యము ఏమిటో తెలుసుకోలేక బిడ్డ ఆ ఒత్తిడికి ఏడుస్తుంది... క్రమేణా శరీరం అలవాటు పడ్డాక వూరుకుంటుంది. పుట్టిన ఓ రెండు నెలల వరకూ చిన్న బిడ్డ తన చుట్టూ వున్న పరిసరాలను తన చూస్తూ, వింటూ వుంటుంది పాప... తను చూచి దాని గురించి తెలుసుకొన్న వస్తువు తన దృక్పథంలోకి వస్తే ఆనందంతో నవ్వుతుంది బిడ్డ... అందుకే తను సదా చూచే తల్లి ముఖం చూడగానే నవ్వ వొలకబోస్తాడు చిన్నారి. పుట్టినప్పటినుంచి




ముందర ఎదుగుతుంది గనక ప్రతీ వస్తువును "తెలుసుకోవా"లనే కుతూహలంతో నోట్లో పెట్టుకోవడం జరుగుతుంది.(మౌతింగ్) "అమ్మ... నాన్న... తాత... కుక్క" అనే పదాలు వినడం... ఆ పేర్లకి చెందిన వస్తువులను చూడడం ముట్టుకోవడం అనే కార్యక్రమాల వల్ల చంటిబిడ్డ వీటి గురించి తెలుసుకుంటుంది. అదే వస్తువులు మరల కనబడిననాడు వాటి గురించిన జ్ఞానం యిదివరలో వుండడం మూలంగా వాటిని గుర్తుపట్టి పిలవడం, పలకడం చేస్తారు. ఆ స్థానంలోనే కొత్త వస్తువులు కనబడితే వాటి గురించి తెలియదు కాబట్టి జంకుతారు. ఆమూలాగ్రంగా ఒకదాని గురించి తెలిసిననాడు మానసిక పరివర్తన ఒకలాగుండడం ఏ విషయం తెలియనినాడు మరోలాగుండడం సహజం. తెలియని విషయాలు తెలుసుకోవాలనే కుతూహలం వుండడం కూడా సహజమే. వయస్సు పెరుగుతున్నకొద్దీ... తన చుట్టూ పరిభ్రమిస్తున్న ప్రపంచం, అందున్న వస్తువులు, విషయాలు ఎక్కువ అవుతున్నకొద్దీ కుతూహలం కూడా పెరుగుతుంది. మూడు నుంచి ఆరేండ్ల వరకు ఈ కుతూహలం చాలా ఎక్కువగా తెలివైన పిల్లలలో వుంటుంది.. "అమ్మా అదేంటి..

(66 వపేజీ చూడండి)

సీరియల్

# ఎదవీణ మోగినవేళ

"కృష్ణజ"

(గత సంచిక తరువాయి)

మరి రెండు రోజులు గడిచేప్పటికి సాకేత కొంచెంగా కోలుకుంది.... తను ఖచ్చితంగా బ్రతికే ఉన్నాననే విషయం మాత్రం అర్థమైంది సాకేతకు. కానీ, ఈ వారం రోజులుగా శ్రీధర్ తనను కంటికి రెప్పలా కాచుకుంటూ సేవలు చేయడంలో అర్థం మాత్రం బోధపడకుండా ఉంది.

"సత్యా...."

.........

"హార్లిక్స్ త్రాగుతావా....."?

ఈసారీ మౌనంగానే ఉండిపోయింది సాకేత....

శ్రీధర్ నెమ్మదిగా, ఆప్యాయంగా ఆమె నోటికి హార్లిక్స్ అందించాడు. కనీసం అతని చేతిని నెట్టివేసేందుకైనా శక్తి లేనట్లుగా మౌనంగా నోరు తెరిచింది....

కొంచెం కొంచెంగా ఆమెచేత హార్లిక్స్ త్రాగించాడు శ్రీధర్. శ్రీధర్ రెండు చేతులూ దోసిటగా పట్టి ఆమె ముఖాన్ని దోసిటిలోకి తీసుకున్నాడు ఆప్యాయంగా.....

మూడు రోజులుగా మృత్యువుతో పోరాడి అలసిపోయిన శరీరమూ పాలిపోయిన ముఖమూ, అస్తవ్యస్తంగా చెదిరి నుదుటను పాకిన ముంగురులూ.....

శ్రీధర్ గుండె జాలితో కరిగి పోయింది....

ప్రేమగా ఆమె ముంగురులు సవరించి తలను ఆప్యాయంగా మూర్కొన్నాడు. ఈ అనురాగ వల్లినేనా తను నిర్దాక్షిణ్యంగా వదులుకుంది.... ఈ అపరంజి బొమ్మకేనా తను పిరికి తనంతో దూరమయ్యింది..... ఈ శిరీష కుసుమాన్నేనా తను నిర్లక్ష్యంగా, మూర్ఖుడిలా ధూళిలోకి విసిరేశాడు....

తన ప్రియ బాంధవిని తను ఎన్నాళ్లకు చేరుకోగలిగాడు....

భగవంతుడు దయామయుడు....

తను అజ్ఞానంతో చేజార్చుకున్న జాతి రత్నాన్ని తిరిగి తన తలకే శిరోమణిగా అలంకరించి దయా సముద్రుడయ్యాడు....

అతని చేతుల మధ్య పిచ్చిగా అతన్ని చూస్తున్న సాకేతలో చలనం కలిగింది....

**జరిగిన కథ - 10 : స్వామీజీ చేసిన మోసం తెలుసుకున్న సాకేత కుమిలిపోతుంది. తన భర్త నపుంసకుడని స్వామీజీ ద్వారా తెలుసుకున్న సాకేత అత్త మామల ఇల్లు విడిచి పుట్టింటికెళ్లి, తన ఆప్తీయుల మధ్య చనిపోవాలని నిశ్చయించుకుంటుంది. మూడు రోజులు హాస్పిటల్లో బెడ్‌మీమృత్యువుతో పోరాడిన ఆమె తన వాళ్ల మధ్య కళ్లు తెరిచింది.**

ఆమె అతని చేతుల్లోనుండి విడిపించుకునేందుకు పెనుగులాడింది.... గింజుకుంది....

శ్రీధర్ చటుక్కున వంగి ఆమె పెదవులనూ, కళ్లనూ, ఆప్యాయంగా చుంబించాడు....

ఆమెనే చూస్తున్న అతని కళ్లు చెమ్మగిల్లాయి....

ఆమె ఈ స్థితికి కారణం పూర్తిగా తనే....

తన చిన్ననాటి చెలి.... తన నేస్తం.... తన ప్రియ బాంధవి.... తన జీవన సర్వస్వం.... తన ప్రాణం.... గుండెల్లో గుడి కట్టి తన దేవిగా ప్రాణ ప్రతిష్ఠ చేసుకుంటాడు....

"సత్యా...."

..........

"ఎలా ఉందిప్పుడు...

"చచ్చి పోవాలని ఉంది...." కటువుగా అంది సాకేత.

"సత్యా! ఇక ఆ అవసరం లేదు...."

"ఏం....నాకోసం క్రొత్తగా ఏమైనా స్వర్గం దిగివస్తుందా... ?"

"సత్యా! ఇప్పుడు నీకు పూర్తి రెస్ట్ అవసరం..... ఆవేశపడకు. తరువాత మాట్లాడుకుందాం...."

అక్కడ్నుంచి బయటికి వెళ్లిపోయాడు శ్రీధర్.

అతనూ, అతని మాటల తీరూ క్రొత్తగా ఉన్నాయి సాకేతకు.

ఈ మూడేళ్లల్లో మరి కాస్త పెరిగినట్లున్నాడు.... బాగా పొడవుగా బలంగా అనిపిస్తున్నాడు....

పోలీసు ఆఫీసరుకు తగ్గట్లుగా ఉంది ఆకారం....

స్వరంలో కూడా పూర్వపు పిరికితనం, బేలతనం స్థానే గాంభీర్యం ఆలోచనా చోటు చేసుకున్నట్లనిపించింది....

మొత్తం మీద మనిషి పూర్తిగా మారినట్లు అనిపించింది సాకేతకు. తానెరిగిన శ్రీధర్ వేరు.... ప్రాణస్నేహితుడైన తన చిన్ననాటి మిత్రునితో పాటు! అమ్మ కిష్టంలేదు.... ఎలా... అని పిరికిగా మాట్లాడిన శ్రీధర్‌ను మాత్రం తానెరుగును....

అసలు అతని ఈ సన్నిహితత్వానికి అర్థం....?

తనను గురించి ఇతనేమనుకుంటున్నాడు....?

తల్లి - దండ్రీ కూడా అతని రాకకు సంతోషించడం గమనించింది సాకేత.... అసలు అమ్మా - వాళ్లకూ శ్రీధర్‌కూ మధ్య ఇంత అవగాహన ఎలా కుదిరింది మళ్లీ.....

ఆలోచనలతో అలసటగా కళ్లు మూసుకుంది సాకేత.

* * *

సాకేత హాస్పిటల్‌లోనుండి డిశ్చార్జ్ అయ్యింది....

ఆమెకు తన ఈ స్థితి దయనీయంగా, సిగ్గు చేటుగానూ అనిపించ సాగింది....

తానొకటనుకుంటే ఒకటి జరిగింది....

తాను అనవసరంగా తల్లిదండ్రులను బాధపెట్టి బ్రతికిందే తప్పు....

తాను కోరుకున్న విధంగా జరగనేలేదు....

తను ప్రేమలో విఫలం అయ్యింది....

పెళ్లిలో విఫలం అయ్యింది....

చివరకు చావులో కూడా విఫలం అయ్యింది....

ఏమిటి ఇక తన జీవితం.... ముందు ముందు తను ఏమిటి....?

ఎడతెగని ఆలోచనలు....పరిష్కారం కాని సమస్యలు....

కడుపులో ఏదో కదలిక.... వికారం....

సాకేత కళ్లల్లో చివ్వున నీళ్లు చిమ్మాయి....

తను....ప్రాణంతో సహా ఈ పాపాన్ని ఒదిలించుకోవాలనుకుంది....-

కానీ....తన ప్రాణం మొండిది.

ఇంతమందిని దుఃఖపెట్టి అది తన శరీరంలోనే మిగిలిపోయింది. నీరసంగా లేచి పెరటివైపు వెళ్ళింది సాకేత....

వంట గదిలో తల్లి ఎవరితోనో మాట్లాడుతుంది....

ఆ గొంతు.... ఆ గొంతు శ్రీధర్‌ది....

ముఖం చిట్లించుకుంది సాకేత.

ఆమెకు అతన్ని చూడ్డం ఇష్టంలేదు....

"సత్య ఏం చేస్తోందత్తయ్యా....?" శ్రీధర్ ప్రశ్న.

"ఏం చేస్తుంది బాబూ.... ఆ మంచం మీదపడి కంటికి కడివెడుగా ఏడుస్తుంది....ఏ ముహూర్తాన పెళ్ళి అనుకున్నామో గానీ దాని బ్రతుకు అన్ని విధాలా బండలయ్యింది...." తల్లి జవాబు.

"దీనంతటికీ కారణం నేనే నత్తయ్యా...."

"నువ్వేం చేశావు బాబూ.... అంతా దాని ఖర్మ.... మా ప్రారబ్ధం.... ఒక్కగానొక్క పిల్ల అది సుఖంగా సంతోషంగా పదికాలాలు పచ్చగా ఉంటే సంతోషపడే అదృష్టం మాకు లేదు...."

ఛీ....ఛీ.... అమ్మకేమీ తెలీదు....ఇప్పుడతనితో ఈ మాటలన్నీ ఎందుకు....?

సాకేత తల్లి ఛాదస్తానికి విసుక్కుంటూ లోపలికి వచ్చింది. కళ్ళు తిరుగుతున్నట్లనిపించడంతో, నీరసంగా మంచంమీద వాలిపోయింది.

మరో గంట తరువాత రాధమ్మ సాకేత ఉన్న గదిలోకి వచ్చింది.

"అమ్మా...."

"ఏవిఁటి సత్యా....?"

"శ్రీధర్ ఎందుకు వస్తున్నాడమ్మా....?"

"అదేమిటి సత్యా....అలా అంటావ్...."

"అవునమ్మా.... అతను మనింటికి ఎందుకు రావాలి....?"

"అదేవిటే సత్యా....అతనేమయినా పరాయి వాడా....? ఏ దుష్ట ఘడియో తోసుకు వచ్చి ఇలా అయింది కానీ....లేకపోతే...."

"అమ్మా! అతను.... అతను రావడం నాకిష్టం లేదు...."

రాధమ్మ ముఖం మ్లానమైంది....

"సత్యా! అంత అభిమానంతో ఇంటికి వచ్చిన వాణ్ణి పొమ్మని ఎలా అంటాం....?"

"అమ్మా! అతనితో మన ఇంటి సంగతులన్నీ ఎందుకు చెప్పాలమ్మా...."

"సత్యా....అతను మనకేమన్నా పరాయి వాడుటే....

"పరాయివాడు కాక అతను మనకేమవుతాడమ్మా....?"

రాధమ్మ సమాధానం చెప్పలేనట్లు మౌనంగా ఉండిపోయింది.

"ఎవరి అభిమానమూ, దయా మన కక్కర్లేదమ్మా.... అతను ఈసారి వస్తే చెప్పేసెయ్.... ఇంకెప్పుడూ రావద్దని.... నీకు మొహమాటంగా ఉంటే చెప్పు.... నేను చెప్పేస్తాను...."

ఏదో నీడ కదలినట్లయి చటుక్కున గుమ్మం వైపు చూసింది సాకేత అంతే.... మరి మాట్లాడలేనట్లుగా చూస్తూ ఉండిపోయింది....

ఎదురుగా "శ్రీధర్."

తమ మాటలు విన్నట్లుగా అతని మొహం అవమానంతో కంది-పోయింది.

ఆవేదన....బాధ.... స్పష్టంగా కనిపిస్తున్నాయా.... ముఖంలో....సాకేత వంక సూటిగా చూస్తున్న అతని చూపుల్లో ఇదీ అని చెప్పలేని ఏదో భావం....

తల వంచుకుని కూర్చుంది సాకేత.

కూతురి వంకా, శ్రీధర్ వంకా మార్చి మార్చి ఏమీ చెప్పలేనట్లుగా అక్కడ్నించి వెళ్ళిపోయింది రాధమ్మ.

ఒక్కో అడుగే వేస్తూ లోపలికి వస్తున్న శ్రీధర్ వంక అయోమయంగా చూసింది సాకేత....

లోపలికి వచ్చిన శ్రీధర్ మళ్ళా ఏదో గుర్తుకు వచ్చినట్లు ఒక్కడుగు వెనక్కు వేసి తలుపు గడియ వేశాడు....

బిత్తరపోయి చూసింది సాకేత.

సాకేతను సమీపించిన శ్రీధర్ ఒక్కక్షణం ఆమె ముఖంలోకి తేరిపార చూస్తూండి పోయాడు....

"సత్యా....మై....లవ్....మై హార్ట్.... సత్యా.... నా సత్యా...." అతని గుండె స్పందిస్తూంది....

అతని ఊపిరి ఆమెకు వెచ్చగా తగులుతోంది....

కళ్ళు విప్పార్చుకుని అతని చర్యలను విచలితమై చూస్తుండి పోయింది.



శ్రీధర్ చెయ్యి సాకేత భుజం మీద బరువుగా పడింది.

ఉలిక్కిపడింది సాకేత.

అతని పిడికిటిలో ఆమె మెడలో ఉన్న మంగళ సూత్రపు త్రాడు....

గతుక్కుమంది సాకేత.

శ్రీధర్ రెండు చేతులతోనూ ఆ సూత్రాన్ని తెంచి మూలకు విసిరి కొట్టాడు....

విమూఢలా, అచేతనంగా అతనివంక చూస్తూండిపోయింది.

శ్రీధర్ రెండు చేతులూ ఆమెను ఆప్యాయంగా చుట్టి వేశాయి....

ఎన్నో సంవత్సరాల వియోగానంతరం, తన ప్రియ బాంధవిని కలుసు-కున్న ఆర్తి ఆ గాఢ పరిష్వంగంలో ద్యోతకమవుతోంది....

ప్రేమగా, ఇష్టంగా అనురాగంతో, ఆర్తితో ఆమె పెదవులూ, కను-

# ఎదవీణ మ్రోగినవేళ

బొ మలూ, కనురెప్పలూ, నుదురూ, చెంపలూ, మెడవంపూ పదే పదే చుంబించాడు.

అచేతనావస్థనుండి, చేతనావస్థలోకి వచ్చిన సాకేత తీవ్రంగా నిరోధించింది అతని చర్యలను....గింజుకుంది.... మౌనంగానే అయినా తన శక్తి మేరకు తీవ్రంగా ప్రతిఘటించింది.

బలహీనమైన శరీరంతో అతని చేష్టలకు మౌన ప్రతిమలా ఉండిపోయింది. ప్రతి ఘటనతో అలసి న ఆ క్షీణ శరీరాన్ని పడక మీద చేరుస్తూ ఆమె చెవిలో గుసగుసగా అన్నాడు శ్రీధర్....

"సత్యా! మై లవ్....ఇక నిన్నెప్పటికీ విడిచిపెట్టను....

సత్యా.... నలుగురి ముందూ గర్వంగా నిన్ను నాదాన్ని చేసుకుంటాను. అప్పటివరకూ ముద్దులోని ఆనందాన్ని మాత్రం చవిచూస్తాను....

సత్యా .. నాపంక అలా కోపంగా చూడకు....

సత్యా....మైడియర్.... నీ కోపంతో నామతి పోగొట్టకు...

సత్యా....సత్యా.... నా చెలీ.... నిన్ను పోగొట్టుకుని నేనెంత పోగొట్టుకున్నానో, నీ పెళ్ళి మంగళ వాయిద్యాలు మ్రోగుతున్నప్పుడు కానీ నాకు తెలీలేదు ...

నీకు మొదటి రాత్రి అని తెలిసిన రోజున నేనెంత వేగిపోయానో ఎలా చెప్పను ...? ఎవడో నీ ఒంటిమీద చేయివేస్తాడనీ, నీ అధరాలను చుంబిస్తాడనీ.... నిన్ను... నా ఆత్మను...తనలో కలుపుకుంటాడనీ ఎంత క్షోభించానో ఎలా చెప్పను....?

సత్యా! నిజం చెప్పనా....నేను నిన్ను అంతగా ప్రేమిస్తున్నాననీ, కోరుకుంటున్నానని అప్పటివరకూ నాకు తెలీదు....


నేనెంత "ఫూల్"నో అప్పుడే తెలుసుకున్నాను.

అప్పటి కప్పటి కప్పుడే మీ అత్తవారింటికి వచ్చి నిన్ను.... నా ప్రాణాన్ని చేయిపట్టుకు తెచ్చుకోవాలనుకున్నాను....

కానీ.... ఎలా.... నా సత్య.... నా పవిత్రమూర్తి.... నా ప్రాణం.... దానికి ఇష్టపడదని నాకు తెలుసు...."

శ్రీధర్ ఎన్నో ఏళ్ల ఊసులూ, గుండె గుబుళ్ళూ తన దేవతకు నివేదించుకుంటున్నట్లు, సాకేత ముఖం మీదికి వంగి ముంగురులు సవరిస్తూ, కపోలాలను స్పృశిస్తూ, అధరాలను చుంబిస్తూ ఆమె చెవి దగ్గర మంద్ర స్వరంతో మృదువుగా చెప్పుకు పోతున్నాడు....

మూసుకున్న సాకేత కనురెప్పలనుండి కన్నీటి బిందువులు జాలు వారుతున్నాయి.... గుండెలో ఏదో.... కదలిక.... కరుగుతున్న బాధ.... ఉబుకుతున్న కన్నీరు....




"సత్యా! ఇక జీవితంలో నీకు దగ్గరగా రాలేనని.... ఎంత కుమిలిపోయానో తెలుసా....?

ఒక్కసారి కళ్లారా నిన్ను చూడాలనీ, మనస్సు విప్పి నీతో మాట్లాడాలనీ, నా హృదయం తపించి పోయేది.... కానీ.... ఎలా... నిన్ను బాధ పెట్టలేను... నీ దరికి చేరలేను....

సత్యా.... నీకు నామీద కోపంగా ఉంది కదూ.... మన పెళ్లయ్యాక ఊపిరి సలపని నీ ముద్దులతో ముంచెత్తి నాకు శిక్షవేసి నీ కక్ష తీర్చుకో....

నీ కౌగలి చెరసాలలో నన్ను జన్మఖైదుచేసి శిక్షించు....

సత్యా! ఎలా.... ఎలా నీ కోపం పోగొట్టను... ?"

శ్రీధర్ తలవాల్చి అతిశయించిన ప్రేమావేశంతో, ఆప్యాయతతో ఆమె పాదాలను పదే పదే చుంబించాడు....

రెండు పాదాలనూ గాఢంగా హృదయానికి హత్తుకున్నాడు....పాదాలను లాక్కుందుకు ప్రయత్నించీ విఫలమైంది సాకేత....

ఆమె కళ్లలో నీళ్ళు మాత్రం అవిరళంగా స్రవిస్తూనే ఉన్నాయి. ..

సత్యా....సత్యా....సత్యా.... అతను ఆ కన్నీళ్లను తుడుస్తూనే ఉన్నాడు విసుపు లేకుండా....

* * *

సంధ్య చీకట్లు భూమిని కౌగలించుకుంటున్నాయి వాలు కుర్చీలో కూర్చుని కిటికీలోనుండి మల్లెతీగ వైపు చూస్తూ కూర్చుంది సాకేత.

మల్లెతీగ క్రొత్త చిగుళ్లతో నవనవలాడుతోంది. .. అంతులేని ఆలోచనలు... అగాధంలాంటి భూత కాలమూ.... అయోమయంగా గడుస్తున్న వర్తమానమూ... అగమ్య గోచరంగా ఉన్న భవిష్యత్తూ... .

క్రితంరోజు శ్రీధర్ చెప్పిన ప్రతిమాటా ఆమె చెవిలో మారుమ్రోగుతోంది. ఇది.... ఎలా.... ఎలా సాధ్యం....? తను వివాహిత.... కులట.... గర్భవతి.... పాప ఫలాన్ని మోస్తున్న పతిత....

తిరిగి తనకు వివాహమా....? అందులోనూ....శ్రీధర్ తన.. పాపాన్ని శ్రీధర్‌కు చుట్టబెట్టడం.....నో.....నో.... నో....ఇంపాజిబుల్....

తనకు ఉన్న సమస్యలు చాలనట్లు శ్రీధర్ సమస్య మరొకటి.... ఎలా అతనినుండి దూరంగా వెళ్లడం....

అమ్మ నాన్నలకు కూడా అతని ప్రతిపాదన ఆమోదయోగ్యమే.... ఒంటరిగా తను అతన్ని ఎదుర్కోవాలి....

తన అయిష్టాన్ని అతను తన ప్రేమతో ఎదుర్కొంటున్నాడు....

తన వాదనను అతడు తనమాటల చాతుర్యంతో కొట్టేస్తున్నాడు...

ఛీ....ఛీ.... ఒకసారి పెళ్లయిన తను.. . గర్భవతి అయిన తను....అతనికి వధువుగా తిరిగి పెళ్ళి పీటలమీద ఎలా కూర్చోగలదు.... పవిత్రమైన నూతన వధువులా.....

వెనకనుండి ఎవరో రెండు కళ్ళు మూసినట్లయి ఉలిక్కి పడింది సాకేత.

ఆ స్పర్శ ఆమెకు పరిచయమే.. .

కానీ, ఆ స్పర్శ మాత్రం ఆమెకు ప్రియంగా లేదు....

కనీసం అతన్ని చూడ్డం కూడా ఇష్టంలేదామెకు....

ఏమిటీ వేళాకోళం ఇతనికి...? ఒక వంక జీవిత సమస్యలతో తను వేధించబడుతూంటే తన బ్రతుకు ఇతనికి వేళాకోళంగా ఉందా?

ఉవ్వెత్తున కోపం ముంచుకు వచ్చింది.

నిస్సహాయమైన కోపంతో మౌనంగా ఉండి పోయింది. అతను ఆమె కళ్ల మీది నుండి రెండు చేతులూ తీసి భుజం మీద వేసి వంగి ఆమె నుదుటిని ముద్దు పెట్టుకున్నాడు ప్రేమగా.

తన రాకపట్ల అయిష్టత, అప్రియమూ, ఆమె ముఖంలో స్పష్టంగా చదవగలిగాడు.

శ్రీధర్ జేబులో నుండి కాగితాలు తీసి సాకేత చేతికి ఇచ్చి, "వీటి మీద సంతకాలు చెయ్యి..." అన్నాడు

# రైతు సోదరులకు శుభవార్త




అరుణా వారి ఆధునిక వ్యవసాయ పరికరములతో
మీ భవిష్యత్తును బంగారు బాటగా మలుచు
కొండి. గ్రామీణ నిరుద్యోగ యువకులు
ప్రభుత్వం వారిచే రూపొందించిన
గ్రామోదయ పథకమును వినియోగించు
కొండి. ప్రభుత్వమువారు యిచ్చిన
ఈ సదవకాశాన్ని దేశశ్రేయస్సుకు
వినియోగించండి.

**ఇవేగాక మావద్ద**

పంట నూర్పిడి యంత్రము
వేరుశనగ నూర్పిడి యంత్రము
మొక్కజొన్నలు వలుచు యంత్రము
బావులనుండి పూడకతీయు యంత్రము
వేరుశనగ వలుచు యంత్రము
మరియు ఎన్నో రకముల మరనాగళ్ళు
మీకు ఏమి కావాలో త్వరగా ఎన్నుకొండి.


**పంట నూర్పిడి యంత్రము**


50 మంది కూలీలతో చేయు పని
6 గురు కూలీలతో చేయవచ్చును.
5 హెచ్. పి. మోటారుతోగాని
ఆయిల్ ఇంజనుతోకాని నడపవచ్చును.


# ARUNA INDUSTRIES

119 B, Kattedan Hyderabad 500252

**Manufacturers & Exporters of Agriculture Implements & Machinery**







# ఎదవీణ మ్రోగినవేళ

వాటిని చదివిన సాకేత మొహం క్రమంగా పాలిపోయింది. ఆవేశంతో ఊపిరి బలంగా వదులుతూ, "నాకిష్టంలేదు... నేను చెయ్యను." అంది కోపంగా.

"ఏమిటి...?

"డైవోర్సు చేయడం నాకిష్టంలేదు...."

"ఏం...?"

"అన్ని ప్రశ్నలకూ జవాబు లుండవు. నాకిష్టంలేదు... అంతే.."

"అన్ని ప్రశ్నలకూ జవాబు లుండక పోవచ్చు కానీ, ఈ ప్రశ్నకు మాత్రం జవాబు కావాలి..."

సాకేతకు కోపం పొంగుకు వచ్చింది. ఏమిటితనిదౌర్జన్యం.... తన జీవితం.... తన ఇష్టం..... అసలు ఇతను ఎవరు....?

"ఇది నా స్వంత విషయం" అంది కోపంగా.

"ఊహుం.... అలాగా! నీకు స్వంతమనేది ఏదీ ఉండదు ఇకమీద.... అన్నీ.... అంతా.... నాదే...."

రోషంగా తల ఎత్తి చూసింది సాకేత....

ఏమిటి ఇతని కింత అధికారం తనమీద....

"నువ్వు నాకేమవుతావు.... నీ మాట నేనెందుకు వినాలి....?"

శ్రీధర్ ఒక్కడుగు ముందుకు వేశాడు....

సాకేత ఒక్కడుగు వెనక్కు తగ్గింది భయంగా.... బేలగా....

"నేను ఏమవుతాను అనే ప్రశ్నకు సమాధానం మరొక్క నెలలో అయితే మాటల ద్వారా చెప్పగలను....కాదూ ఇప్పుడే కావాలీ అంటే చేతల ద్వారా.... చెప్పు.... ఎలా చెప్పను....?"

సాకేత పెదవి కొరుక్కుంటూ మౌనంగా ఉండిపోయింది.

"ఊం..... సంతకం చెయ్యి...."

"నేను చెయ్యను...." అంది మొండిగా....

"సత్యా! మొండితనం చెయ్యకు.... నా సంగతి తెలుసుగా....." అన్నాడు ఆమె కళ్ళల్లోకి అదోలా చూస్తూ....

సాకేతకి భయం వేసింది.

మొన్నటి అతని తీరూ.... ఆ ప్రవర్తనా ఆమె కా భయాన్ని కలిగించాయి....

ఇంట్లో ఎవరూ లేని ఈ సమయంలో అతను అంతతోనే ఆగుతాడనే నమ్మకం ఏముంది....?

అందుకే నచ్చచెబుతున్నట్టుగా అంది" డైవోర్సు నాకిష్టం లేదు...."

"అదే.... ఎందుకూ అంటున్నా...."

"ఎందుకూ.... ఎందుకూ అంటే ఏం చెప్పను....? విడాకులు అంటే ఎంత అసహ్యంగా ఉంటుందో ఆడదానివై పుట్టి వుంటే నీకు తెలిసి ఉండేది...."

కోపం, దుఃఖం పెనవేసుకున్నాయి ఆమె స్వరంలో....

అలిగిన పాపాయిలా ఉన్న ఆమె ముఖాన్ని చూస్తూ, ఆ ముఖాన్ని చేతుల్లోకి తీసుకుని ఊరడించకుండా ఉండటం అతనికి సాధ్యం కాలేదు...

"సత్యా! ఎంత పిచ్చిదానిలా ఆలోచిస్తున్నావ్....

డైవోర్సు అనేవి ఇష్టం లేని వైవాహిక జీవితం నుండి స్త్రీకి విముక్తి కలిగించేందుకు రాజ్యాంగం ఏర్పరచిన ఒక చట్టం. అది పాపం గాదు.... నేరం గాదు.... ఇక సమాజపరంగా అవమానం అంటావా....?

ఇది లోకం.... ఇవ్వాళిటి క్రొత్త విషయం రేపటికి పాత పడి పోతుంది. ఇంకా అమ్మమ్మ కాలం నాటి ఆలోచనలో నే ఉన్నావు.... లోకం ఎంత మారిందో నీకు తెలీడం లేదు...."

"కానీ...."

"ఊం.... ఏమిటి కానీ...."

"మళ్ళీ పెళ్ళి చేసుకునేందుకు ఇష్టం లేని నాకు డైవోర్సు ఎందుకు....?"

"సత్యా! ఒకసారి తప్పు చేసి చాలా క్షోభ అనుభవించాను.... మళ్ళీ తప్పు చెయ్యాలనుకోడం లేదు...."

"అంటే....?" అయోమయంగా అడిగింది సాకేత....

"అంటే.... ఎలాంటి పరిస్థితుల్లోనూ నిన్ను ఒదులుకోను.... అర్థమైందా....?"

"నువ్వంటే నా కిష్టం లేదు...."

శ్రీధర్ పెదవులమీద చిరు మందహాసం మెరిసింది అందంగా..... అతని కళ్ళు కొంటెగా నవ్వుతున్నాయి.

"నాకు తెలుసు...." అన్నాడు ఆమె పెదవులమీద ఓ తియ్యటి ముద్ర వేస్తూ.

"సిగ్గు లేదూ.... పదే పదే పరాయి ఆడదాన్ని ముట్టుకోడానికి...?"

"సత్యా డార్లింగ్.... ఈ విషయం నీకు తెలుసా....? కసిరికొట్టే ప్రేయసి కౌగిలింత ఎంతో మధురంగా ఉంటుంది.... నువ్వు గానీ ఇప్పుడు సంతకం చెయ్యకపోయావో... ఒక్క ముద్దూ కౌగిలింత మాత్రమే కాదు.... నిన్ను రేప్ చేస్తాను కూడా...."

సాకేత గుడ్లప్పగించుకుని అతని వంక చూస్తుండి పోయింది.

"ఊం.... సంతకం చెయ్యి...." పెన్ అందించాడు శ్రీధర్....

మౌనంగా సంతకాలు చేసి కాగితాలు అతనికి అందించింది....

"ఒ. కె. గుడ్ గర్ల్.... అలా చెప్పినట్టు మంచి పిల్లలా చెయ్యాలి.... ఇంత మంచి పిల్లకు బహుమానం ఇవ్వద్దూ...."

రెండడుగులు ముందుకు వేశాడు శ్రీధర్....

(ఇంకా ఉంది)




## ఎస్.ఎం. – ఉరవకొండ

మా తల్లి గారికి ఎవరివో మాటలు వినిపిస్తాయట. అవి మా కెవ్వరికీ వినిపించవు. రాత్రిళ్ళు ఎవరిమీదో అరుస్తూ ఉంటుంది. ఇక్కడ డాక్టర్లకి చూపించినా వారు మెంటల్ అని, నరాల బలహీనత! అని ఎన్నో మందులు వాడారు. కానీ తగ్గలేదు.

★ మీరు సైకియాట్రిస్టులను కలుసుకొని సంప్రదించటం చాలా అవసరం. వారి సలహా ప్రకారం మందులు వాడండి.

## పి.ఎస్.ఆర్ – పామర్రు

నాకు కామెర్లు వచ్చి తగ్గిపోయినవి. 15 రోజులు అవుతున్నది. 6 నెలల దాకా స్త్రీ సంభోగము చేయకూడదని విన్నాను. నిజమేనా?

★ కామెర్లు వైరస్‌లవల్ల వచ్చినప్పుడు అది అంటురోగం అవుతుంది. కామెర్లు వచ్చి తగ్గిన రోగి శరీరంలో దాదాపు నెలదాకా ఈ వైరస్‌లు ఉండే అవకాశం లేకపోలేదు. అందువల్ల ఈ రోగం ఇతరులకి సక్రమించకుండా చూడటం అవసరం. ఆరు నెలలు మరీ ఎక్కువ గడువే!

## సి.ఎ. – గుంటూరు

కూల్ డ్రింక్స్‌వలన శరీరమునకు ఏమైనా ప్రయోజనము వున్నదా?

★ కూల్ డ్రింక్స్ తాగటం వల్ల, మిగిలిన ఆహారాలు తీసుకొన్నప్పుడు లభించేటట్లే కొన్ని "కాలరీలు" (శక్తిని కొలిచే ప్రమాణం) వస్తాయి. వీటిలో నీరు ఉండటం వల్ల శరీరానికి నీరు కూడా సరఫరా అవుతుంది. దీనికి మించి కూల్ డ్రింక్స్‌వల్ల ప్రయోజనంలేదు.

ప్రస్తుతం, నాగరికత కోసం వీటిని త్రాగుతూ అదేసమయంలో వీటివల్ల అదనపు కాలరీలు శరీరానికి చేరకుండా ఉండటానికి తక్కువ కేలరీలు గల డ్రింక్స్ చెలామణి అవుతున్నాయి.

## ఎ.ఎన్.ఆర్ – గుంతకల్లు

నాకు 2 సం.ల నుండి కుడిచేయి మణికట్టు మొదలు కడిచేతి వేళ్ల కీళ్లలో నెప్పిగా ఉంటున్నది. ఇప్పుడు బొటన వేళ్లలో రెండు కీళ్ళు బాగా వాచి సరిగా వ్రాయటానికి కూడా వీలుపడదు. దానికితోడు కొంచెం నరాల బలహీనత ఉన్నది.

★ రుమటాయిడ్ ఆర్‌థ్రైటిస్ అనే రోగం ఉన్న వారికి చిన్న చిన్న కీళ్ళు వాస్తూ ఉంటాయి.

మీరు ఫిజీషియన్లకి చూపిం వారి సలహా ప్రకారం, సాలిసిలేట్-ముందులు, కార్టిసోన్ మొదలైనవి వాడవలసి ఉటుంది. □

## ఇజ్రాయిల్‌లో నీటికి కటకట!


ఇజ్రాయిల్‌లో నీటి కష్టం చాలా ఎక్కువట. ఎక్కడ చూసినా "నీటిని పొదుపుగా వాడుడు", "నీటిని దుబారా చేయువారు దండింపబడుదురు." "సోదరా నీటిని వృథా చేయకుము" వంటి వాక్యాలు ఎక్కువగా వుండడమేగాక ఎవరైనా నీటిని దుర్ వ్యసనంగా ఖర్చుచేస్తే చాలా కఠినంగా అక్కడి ప్రభుత్వం అట్టివారిని శిక్షిస్తుందట!

## మేకప్ అలవెన్స్!

నటుడు కమలహాసన్, నటి సుజాత తమకు ప్రత్యేకమయిన మేకప్‌మేన్‌ని పెట్టుకోరట. మేకప్ ఎలవెన్సు అని ఆ డబ్బులు కూడా వాళ్లే తీసేసుకుంటారట. వీరు తమ ముఖాలంకరణ తామే చేసుకుంటారా, లేక యింట్లో వాళ్లవాళ్లే వీళ్లకు చేస్తారా అనే పాయింటుకి అన్సరు చాలా మందికి తెలీదట.

## పెట్టిలో పట్టే హెలికాప్టర్!

రష్యా దేశం ఒక ఆధునాతనమైన హెలికాప్టరును తయారు చేసిందట. ఈ కాప్టరు గంటకు నూరుమైళ్ళ వేగంతో పోతుందట. దీనిని మడచి వో పెట్టిలో



పెట్టేసుకోవచ్చుట. కావలసినప్పుడు పెట్లోంచి తీసి విప్పదీసి హెలీకాప్టరును మూడే మూడు నిమిషాలలో రెడీ చేసుకోవచ్చుట. హెలీకాప్టరు మడిచి పెట్టే పెట్టే హెలీ కాప్టరు పైలట్ సీటుగా అమరుతోందట-ఆహా శాస్త్ర విజ్ఞానమా! ఆహా!

## నమ్మలేని వార్త!

నంద్యాల వన్ టవున్ పోలీసు స్టేషనులో డిశంబరు 8న దుర్గయ్య అనే వో బాలుడు ఆత్మహత్యచేసుకు చనిపోయాడన్న పోలీసు వార్త సుద్ద అబద్ధమని పోలీసు వారు ఆ పిల్లాణ్ణి చిత్రహింసలూ పెట్టి చంపేశారని ఆ జిల్లా బి.జె.పి. అధ్యక్షుడు శ్రీ హనుమంతరెడ్డిగారొక ప్రకటనలో తెలియ జేసి, దీనిని తరచి, నిజం కనిపెట్టాల్సిన కర్తవ్యం ప్రభుత్వానికున్నదని ప్రకటించారట.

## ఉష్ణోగ్రత ఎక్కువై రియాక్టర్స్ ధ్వంసం!

మెదక్ జిల్లాకు చెందిన పటాన్ చెరువు సి.పి.సి. ఫార్మసూటికల్స్ కంపెనీలోని రియాక్టర్స్‌లో ఉష్ణోగ్రత ఎక్కువై, ఆ వొత్తిడికి అవి ధనేల్నా బద్దలై



అవి సర్వ ధ్వంసం అవటమేగాక, ఫ్యాక్టరిని కూడా పొట్టనబెట్టుకున్నాయట. అవి పేలిన సమయానికి పనివారెవరూ ఫ్యాక్టరీలో లేరట. ఈ పేలుడు వల్ల ఆ కంపెనీకి దాదాపు 15 లక్షల నష్టమట

## రేషన్‌కార్డు అరువిస్తే ముప్పు!

తిరుణ్ణామలైకు చెందిన మేల్‌కచ్చిరాపట్టు గ్రామంలో రంగరాజన్ అనే అతను తన బంధువు గోవిందసామివద్ద రేషను కార్డు యీనెల 'బియ్యం తీసుకుని యిస్తా' అని చెప్పి తీసుకుని ఆ కార్డే అమ్మేసి, డబ్బు ఖర్చు చేసేశాడట. ఈ విషయం తెలిసిన గోవిందస్వామి గోలపెట్టేసరికది పెద్ద కొట్లాటగా మారిపోయిందట దాంతో రంగరాజన్ ఆ గోవిందస్వామిని కత్తితో కసకస పొడిచేశాడట. గోవిందస్వామి ఆసుపత్రిలోయిటూ, అటూ అనే స్థితిలో వున్నాడట.

## సినీ మాయ!

పారిస్‌లో వో సినిమా బృందం నాయకుడు హెలికాప్టరులో ఎగిరి వెళ్లే సీను ఆ నగరంలోని లెవంటర్ జైలు భవనం పైభాగం మీంచి తీస్తే బాగుంటుందని సంబరపడితే, దానికి జైలు సూపరెంటెండెంటూ వోహో అన్నాడట. తీరా షాటు పూర్తయి హెలికాప్టరు జైలు భవనంపైనుంచి ఎగిరిపోయాక తమ జైలునుంచి వో ఆరుగురు తీవ్రవాదులయిన ఖైదీలు కూడా ఎగిరిపోయారని తెలుసుకున్న ఆ జైలు సూపర్నెంటు లబో మన్నాడట – అనడా మరి!

## భారతదేశంలో ఆసుపత్రులు!

దేశంలో 1982-83 లెక్కల ప్రకారం 6,805 ఆసుపత్రులున్నాయట. వీటిలో 4,76,226 మంచాలున్నాయట. వీటిలో 4,984 ఆసుపత్రులు, 4,11,684 మంచాలు కేవలం పట్నవాసపు ఆసుపత్రులలోనే వున్నాయట. కేరళలో వున్న 578 ఆసుపత్రులలో 432 ఆసుపత్రులు గ్రామాలలో వున్నాయట. మొత్తం ఆ రాష్ట్రంలో వున్న 43,078 ఆసుపత్రి మంచాలలో 25,846 మంచాలు గ్రామాలలో వున్నాయట. మన రాష్ట్ర లెక్కలో..

## ప్రపంచంలో పొడవైన వ్యక్తి!


ప్రపంచంలో కల్లా అతి పొడుగైన మనిషి పేరు మహమ్మద్ ఆలం చన్నా అట. ఈతడు పాకిస్తాన్‌కు చెందిన సింద్‌లో వున్నాడట. ఇతను 2.51 మీటర్ల పొడవు 208 కిలోల బరువు వున్నాడట. ఈతని నడుం 127 సెంటీమీటర్లు, ఛస్టు (గుండె భాగం) 137 సెంటీమీటర్లునట.

## జాతీయం తర్వాత బ్యాంకుల అభివృద్ధి!

1969లో మన దేశంలోని బ్యాంకులు, వాటి శాఖలు కలిపి మొత్తం 8,262 అట. బ్యాంకులను జాతీయం చేశాక 1983 డిశంబరునాటికి అవి 42,000 అయ్యాయట. డిపాజిట్లు 5వేల కోట్ల నుంచి 60వేల కోట్లకు పెరిగాయట.

## ఈతలో రికార్డు సృష్టించిన వృద్ధుడు!

64 ఏళ్ళ జి. సూర్యనారాయణ అనే ఆయన విజయవాడలో క్రిష్ణానదిలో 24 గంటలు యీది రికార్డు స్థాపించారట. ఈ 24 గంటల కాలంలో



ఆయన తేనె, పాలు మాత్రమే ఆహారంగా తీసుకున్నారట. 1945లో ఆయన కలకత్తాలోని యీతల పోటీలలో నేషనల్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ బహుమతి పొందారట.

## ఆవేశంలో భార్యాని హత్యా చేసిన భర్త!

బొంబాయికి చెందిన 35 ఏళ్ళ కేశవ్ అనే ఒకతను తన భార్యతోటి పోట్లాటలో వొళ్ళు తెలీని ఆవేశం వచ్చి పైకలు ఎత్తి ఆమెమీద విసిరేశాడట. దాంతో ఆమె అక్కడికక్కడే చనిపోయిందట.

## విరక్తితో ఆత్మహత్య!

నంద్యాలకు చెందిన 20ఏళ్ల పి. పార్వతమ్మ తన తండ్రి రిటైరవడంతో తాను తన పదవ క్లాసు చదువుకు స్వస్తి చెప్పి, తన తండ్రి పని చేసిన కంపెనీకి వెళ్ళి తనకో వుద్యోగం కావాలని, కుటుంబ పోషణ తన ధ్యేయమనీ వివరిస్తే వారు లేదు పొమ్మన్నారట. దాంతో ఆమెకు జీవితం మీద రోత పుట్టి నల్లుల మందు త్రాగి, ఆత్మహత్య చేసుకుందట. □


"అమ్మాయిది ఆరేళ్ళ
ప్రాయం చేసేది భరత
నాట్యం, రసిక లోకమే
నర్తనశాల
హర్షిస్తుందిక లోకం!"
Bournvita
బోర్న్‌విటాతో పెరిగే ప్రాయం యిది యిక
వాళ్ళు మిమ్మల్ని మెచ్చుకునే రోజొకటి వస్తుందిక!
1 కి.గ్రా. ప్యాక్‌లో
కూడా దొరుకుతుంది.
దీని లోపల ఉంది ఉచితంగా
లభించే
మగ్.
పెరిగే వయస్సులోని పిల్లలు మరే మాల్టెడ్ ఆహార పానీయమూ కాకుండా బోర్న్‌విటాయే ఎందుకు కావాలంటారు? రెండు తరాల్లోని తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలకి యిక మరేదీ కుదరదని ఎందుకు పట్టుబడతారు?
కేవలం ఘుమ్ అనిపించే రుచి మాత్రమే కాదు. మరి కేవలం బోర్న్‌విటా పేరు చూసీ కాదు. ఉంది అందులో మరేదో. ఉంది యింకా మరెంతో. అదే మరి బోర్న్‌విటా, పెరిగేందుకు తోడ్పడే ఆహార పానీయం.
క్యాడ్‌బరీస్
బోర్న్‌విటా
పిల్లలు సరిగ్గా పెరగడం,
అందుకే మరి బోర్న్‌విటా యివ్వడం.
Bournvita
Bournvita
SAVE Rs.1.50
The Tastier Food Drink
OBM/3783 TEL




# సాయిన్సు మిస్టరీ

## కవనశర్మ

డాక్టర్ వ్యాస్ లాబ్‌లో మిస్టర్ గణపతి కిటికీకి పక్కగా తల వంచుకొని ప్రయోగం చేస్తున్నాడు. "నిన్ను పేపర్ను రాయటానికి కదా నేను పెట్టుకొన్నది. రెండేళ్ళయినా నువ్వు ఒక్కటి రాయలేదు. నువ్వు మరో మూడు నెలల్లో అర్జెంటుగా ఒక థీసిస్సో రెండు పేపర్లో రాసివ్వకపోతే పుట్టింటికి తోలేస్తాను జాగ్రత్త" అని వ్యాస్ ఆ క్రితం రోజే గణపతిని బెదిరించాడు.

వ్యాస్‌కి గత్యంతరం లేకపోయింది. ఆ యూనివర్సిటీ తరిగితే తిరిగి పెరిగే శక్తులు (రిన్యూవబుల్ ఎనర్జీస్) గురించి విజయవంతంగా పరిశోధించిన శాస్త్రజ్ఞుడిని ప్రొఫెసర్‌గా నియమించడానికి నిర్ణయించుకొని ఒక కొత్త కుర్చీ ఎత్తుగా అందంగా చేయించి వ్యాస్‌ని ఆశపెట్టింది ఆ సమయంలో తగుదునమ్మా అంటూ డాక్టర్ వాది పోటీకి వచ్చి, "ఆ కుర్చీ నాదే! నాకోసమే వేసారు" అనటం మొదలు పెట్టాడు. అయితే ఆ కుర్చీ ఎత్తుగా ఉండటంచేత ఆది ఇద్దరికీ అందలేదు. ఎన్నో మొగ్గలు వేసినా లాభం లేకపోయింది.

"రిన్యూవబుల్ ఎనర్జీస్ మీద విద్యార్థులచేత థీసిస్‌గాని పేపర్లుగాని రెండూగాని రాయించి వాటిమీద నిలబడితేగాని ఆ కుర్చీ అందదు" అన్న విషయం ఆ కుర్చీమీద వ్రాసుందని ఈ ఇద్దరికీ తెలియవచ్చింది.

వ్యాస్ మరింక లాభంలేదని గణపతిని బెదిరించాడు. గణపతి అప్పటికే ఎన్నో ప్రయోగాలు చేసి ఉన్నాడు. ఏదీ విజయవంతం కాలేదు.

"గురూ! నీ తల నా కళ్ళల్లో గ్లేర్ కొడ్తోంది. కాస్త యాంగిల్ మార్చు" అన్నాడు. ఎదురుగా పనిచేస్తున్న మరో సహ ప్రయోగకుడు, కళ్ళకి చేతులడ్డు పెట్టుకొంటూ.

గణపతి తల ఎగరేసి "హం" అన్నాడు.

"థాంక్స్!" అన్నాడు సహ ప్రయోగకుడు.

గణపతి తల మధ్యకి చెయ్యిపోనిచ్చి జుట్టు పీక్కోపోయాడు చెయ్యికి పట్టుకోడానికి ఓ పరకా దొరకక నున్నటి తలమీద, తలం మీద చెయ్యి జారిపోయింది.

"హం" అన్నాడు గణపతి తల విదుల్చుకొంటూ.

"అదే వద్దన్నాను. నీతల నిందాకటి పొజిషన్‌లో కుదురుగా ఉంచుకో!" అని కసురుకొన్నాడు సహ ప్రయోగకుడు.

గణపతి నిర్ణయించుకొన్నాడు. తన వంటికి రిసెర్చి పడదు. పెట్టే బేడా సర్దుకోవటమే ఉత్తమ మార్గం అనుకొని హాస్టల్‌కి నడిచాడు.

అతను తన గదికి వెళ్ళి సామాన్లు సర్దుకొంటుంటే ఒక నీలం కాయితం, కిటికీలోంచి ఎవరో పడవేసిన కాయితం కనిపించింది.

### శుభ వార్త!

రవికిరణ్ భగవాన్‌గారు మీ సమస్యలు తీరుస్తారు అవి ఎల్లాంటివైనా! ఆయన అమెరికా వెళ్ళినప్పుడు ఆయన చుట్టు పట్ల ఎక్కడా అయిదడుగుల దూరంలో హత్యలు జరగలేదు అని ఆ దేశపు శాస్త్రజ్ఞులు గమనించి వెల్లడించారు. ఆయన ఉన్నచోట సమస్య లుండవు. ఆయనని ధ్యానించిన వారికి సమస్త శుభాలు చేకూరుతాయి. ఆయన సూర్య భగవానుడి శక్తిని తనలో జీర్ణించుకొని అవసరమైనప్పుడు దాన్ని వెరికితీసి భక్తులకి బూడిదలాంటి మహిమాన్విక పదార్థం రూపంలో ఇస్తారు. త్వరపడండి.

ఇట్లు
అన్ని సమస్యలు తీర్చుకొన్న భక్తుడు.

గణపతి "నమ్మి చెడను కదా! ముందే చెడి ఉన్నాను. ఒక రాయి విసిరి చూస్తాను" అని బయల్దేరాడు.

భగవాన్ చేతో తల తడుముకొని, అదృష్టం కొద్దీ రాయి ఒత్తైన తన తల కట్టులో ఇరుక్కున్నదని గమనించి విసిరినవాడు ఏకలవ్యుడు, అర్జునుడు విలియమ్ టెల్ కానందుకు గణపతి అయినందుకు సంతసించి.

"అందరిలాగా నువ్వు పూజకి పూలే వాడరాదా!" అని

మందహాసించి మందలించాడు. తరువాత అతని ద్వారా అతని సమస్య తెలుసుకొని తన శిష్యుడిని వేలితో చూపించాడు.

ఆ శిష్యుడు గణపతి చేతిలో రవికిరణ్ భగవాన్ యొక్క చిత్ర పటాన్నుంచి," అయిదు రూపాయలు" అన్నాడు

"ఏమిటది?" అని అడిగాడు గణపతి.

"ఇది సాయి ఫొటో. దీన్ని ఎండ,పొడ తగిలేచోట ఉంచి పూజించు మహిమ చూపుతుంది." అని శిష్యుడు సెలవిచ్చాడు. అతగాడికి స్వామిని సాయి అనటం ఓ అలవాటు.

గణపతి ఆ పటాన్ని తన గదికి తీసుకువెళ్ళి కిటికీలో పెట్టి ఆ మర్నాడు దానికి దండంపెట్టుకొని ప్రయోగంచేసే నిమిత్తం లాబ్‌కి వెళ్ళి దీక్షతో ప్రయోగం చేసి సాయంత్రం తన గదికి వచ్చాడు.

సాయి బొమ్మ మీద తెల్లటి బూడిద ఏర్పడి ఉంది. "ఇదే ఆ కాయితంలో చెప్పిన మహిమాన్విత పదార్థం అయి ఉండాలి" అనుకొన్నాడు గణపతి.

మర్నాడు ఆ బూడిద నుదట ధరించి లాబ్‌కి వెళ్ళే-సరికి వ్యాస్ వ్యాఘ్రంలాగా ఇటూ అటూ కోపంగా తిరుగుతున్నాడు.

"ఎంతవరకు వచ్చింది?" అని గాండ్రించాడు వ్యాస్.

గణపతి కంగారు పడ్డాడు., "కిటికీ దాక కాదు సూర్యుడు.....ఉహు.... రవికిరణ్.. సౌరశక్తి.... వచ్చింది. కాదు. కాదు. రాలింది బూడిద" అని ఆ క్రితంరోజు జరిగిన విషయం టూకీగా వ్యాస్‌కి చెప్పబోయాడు.

"బూడిద రాలిందా! నువ్వు జోగివి నేను యోగిని మనిద్దరం పేపర్లు రాసుకొందామనుకొంటే బూడిద రాలిందన్నమాట" అన్నాడు వ్యాస్ కోపంగా.

గణపతి కిటికీలో తను పటం పెట్టడం అది సూర్యకిరణ స్పర్శతో బూడిద రాల్చటం అన్న విషయాన్ని వ్యాస్‌కి ఓ అరగంటకాలం తీసుకొని చెప్పేయ గలిగాడు.

"అదేం పటమన్నావ్?".

"సాయి" అన్నాడు గణపతి అతనికి భక్తుడు స్వామి అనటానికి నోరు తిరగక సాయి అన్నాడని తెలియదు అదే నిజమైన పేరనుకొన్నాడు.

"సాయితో సౌరశక్తి పదార్థంగా మారుతోం-దంటావు. అంటే మనం సాయి సహాయంతో సౌర-శక్తిని పదార్థంగా మార్చగలమని ప్రపంచానికి ఋజువుచేస్తే నోబెల్ బహుమానమో, ఎప్పారెస్సో తప్పదు."

మర్నాడు సాయి పటం ఫిజిక్స్ లాబ్‌కి మారింది. దాన్ని గాజుపెట్టె మధ్యలో ఏట వాలుగా బిగించారు. ఆ పెట్టెని సూర్యరశ్మి తగిలేచోట ఉంచారు. ఒకరోజు సాయికి పూజచేసి మరోరోజు చేయకుండా ప్రయోగం చేసారు. రెండు రోజులు బూడిదలాంటి పదార్థం ఏర్పడి, ఏటవాలుగా అమర్చి ఉన్నందు-వలన జారిపెట్టి అడుగునపడి, పేరుకొంది.

"అయితే పూజ అనే పెరామీటర్ మీద పదార్థం ఏర్పడటం ఆధార పడదని తేలింది. సూర్యశక్తిని సాయి పదార్థంగా మార్చగలగటం అలౌకికమైన మహిమ కారణం కాదు. కేవలం భౌతికమైన ప్రక్రియ సాయి కేవలం ఒక పరికరం. ఈ విషయం మనం కనుక్కొన్నాం. అంటే సౌరశక్తిని పదార్థంగా మార్చ-గలిగే పరికరాన్ని మనం కనుక్కొన్నాం. ఇది భౌతిక శాస్త్రంలో ఓ పెద్ద విప్లవాత్మకమైన విషయం. ఈ పద్ధతిని మనం సాయిన్సు అందాం: సాయిన్సు అంటే సైన్సును సాగదీయగా వచ్చేదని, సైన్సు ఫ్రాంటియర్సును పొడిగించేదని అర్థం. అది సాయి లోంచి వచ్చిన ధ్వని కూడా ఉంది" అని వ్యాస్ దీర్ఘోపన్యాసం ఇచ్చాడు.

శిష్యులందరు చప్పట్లు కొట్టారు.

"సౌరశక్తిని పదార్థంగా మర్చే విప్లవాత్మకమైన పద్ధతి – సాయిన్సు ఇది నీ థీసిస్ పేరు" అంటూ వ్యాస్ గణపతి థీసిస్‌కి నామకరణం చేసాడు.

గణపతి ఉత్సాహంగా థీసిస్ వ్రాయటం మొదలు పెట్టిన నాలుగోరోజు సాయినుంచి బూడిదలాంటి పదార్థం రాలటం మానేసింది. గణపతి కంగారు పడి రవి కిరోణ్ భగవాన్ ఆశ్రమానికి పరిగెత్తాడు. స్వామి-వారు మకాం ఎత్తేసారు. సాయి ఫొటో అమ్మిన శిష్యుడింకా ఉండి జంబు ఖానాలు ఎత్తుతున్నాడు. గణపతి తన దగ్గరున్న సాయి ఫొటో పని చెయ్యడంలేదని, దాంతో తన బుర్ర పని చెయ్యడం-లేదని, బుర్ర పని చెయ్యనివాళ్ళు తన దగ్గర పని చెయ్యనవసరం లేదని వ్యాస్ తనతో అన్నాడని వ్యాస్ తన గైడని, ఆ గైడు తనని ఇంటికి గైడు చెయ్యడం తనకి బావుండదని శిష్యుడికి చెప్పాడు.

"ఓ ఇంతే కదా! సాయి వెళ్ళిపోయినా నా దగ్గరింకా ఆరి ఫొటోలున్నాయి. ఆ డజనిచ్చేదా?" అని అడిగాడు శిష్యుడు.

"ఇవ్వండి."

"వీటన్నింటికి ఒకసారే మహిమ కలిగిస్తే ఒకసారే అవి శక్తి పోగొట్టుకొంటాయి. కనుక ఇవి ఒక దాని తరువాత ఒకటి వాడు."

"మహిమలు మాలాంటి సైంటిస్టులు ఒప్పుకోరో పట్టాన. కాని ప్రతి పరికరాని దాన్ని సిద్ధ పరిచే పద్ధతుంటుంది. సాయికి కూడా అల్లాంటి దుంటుందని నమ్ముతున్నారు. అది చెప్పండి"

"ఏదో ఒకటనుకో! సాయికి కూడా సైంటిఫిక్‌గా ఉండటం ఇష్టం సాయిని రెడీ చెయ్యటానికిమార్గం ఏ ఉంటే సాయిని పూజించి, దానికి ఈ సీసాలోని ద్రవంతో స్నానం చేయించాలి. అదెట్లా అంటే ఓ పరి శుభ్రమైన గుడ్డముక్క నందులో ముంచి దానితో సాయిని తడిపి ఎండ బెట్టాలి. ఆ తరువాత అది శక్తి చూపుతుంది చందన చర్చలాగా చెయ్యాలి అర్థమైందా?"

"శక్తిని పదార్థంగా మారుస్తుంది." అన్నాడు గణపతి ప్రొసీజర్ అర్థమైందని తెలుపుతూ.

"ఏదో ఒకటి! డజన్ సాయి పొటోలు సీసాడు ద్రవం నూర్రూపాయలు."

గణపతి డబ్బిచ్చి తీసుకువచ్చి సాయిని శిష్యు-డిచ్చిన ద్రవంతో చర్చించి ఆ పైన సెటప్‌లో బిగిం-చాడు. సాయి శక్తి చూపించటం, కాదు సౌరశక్తిని పదార్థంగా మార్చటం మొదలు పెట్టింది.

సరిగ్గా ఆ సమయంలో ఎన్‌వైర్‌మెంటు డిపార్ట్ మెంట్‌లో ఇకాలజీవింగ్‌లో ఉండే ఎలుక

బందరులో ఇటీవల మచిలీపట్నం లయన్ లేడీస్ "బేబీ షో" నిర్వహించిన సందర్భంగా తీసిన చిత్రం.



తప్పించుకువచ్చి ఆ ద్రవపు సీసాను పడతోసింది. ఆ ద్రవం నేలపాలైంది. అది జరుగుతున్నప్పుడు గణపతి అక్కడే ఉండి గమనించాడు. అతను దాంతో కోపిష్ఠుడై ఒక కర్రతో ఆ ఎలుకని ఒక దెబ్బ వేశాడు. సైన్సులో యాదృచ్ఛికత అనే ప్రిన్సిపుల్ ప్రకారం ఆ ఎలుక ఆ దెబ్బ తగిలి చచ్చి పోయింది! దాన్ని తీసుకువెళ్ళి ఇకాలజీ కుర్రాళ్ళు భోంచేసే మెస్‌లో సాంబారులో పడేసాడు. అయితే ఆ మెస్‌లో కొందరు కెమిస్టులు కూడా భోంచేస్తారు. వాళ్ళల్లో ఎవరికీ కూడా పులుసులో ఎలుక నచ్చదు. కొందరికి గుమ్మడికాయ, కొందరికి బెండకాయ నచ్చుతుంది. ఆ విషయంలో పోట్లాడుకున్నారు కూడాను ఒకసారి. అందుకని ఒక వారం గుమ్మడి మరోవారం బెండ వేయాలని వంటాయనికి ఆదేశించారు. కాని ఎలుకల విషయంలో వాళ్ళందరిది ఏకాభిప్రాయం కావటంతో అది వెయ్యమని వంటాయన మీద ఎవరు వత్తిడి తెచ్చారో తెలియక, "చెప్పమని" అతనిపై వత్తిడి తెచ్చారు.

"బాబోయ్ నేను వెయ్యలేదు. ఆ పన్నీ మెస్ గణపతిగారు దాన్ని తెచ్చి పులుసులో పడేసారు. ఆయన చేతిలో కర్ర ఉంది. అప్పటికీ "నే నాయనో! ఈ మెస్‌లో కుర్రాళ్ళు పులుసు ముక్కల్లో పచ్చి ఉంటే చంపేస్తారు. అల్లా ఆ ఎలుకని పడేయ-మాకండి. అన్నాను. 'పిచ్చిగా మాట్లాడితే ఈ కర్రతో నిన్నోటి వేసి, నిన్ను కూడా పచ్చిగా పులుసులో కలిపేస్తాను' అన్నాడండి ఆయన కోపంగా. నేనింక మాట్లాడలేదు బాబులు" అన్నాడా వంటవాడు.

"ఎవరు గణపతా!" అని అందరు ఆశ్చర్య పోయాడు.

"మన దంత వైద్యుడు అతని నోట్లో వేలు పెడితే కొరకలేదుట. అల్లా కొర్కని విద్యార్థి అతనొక్కడే అన్నాడు కదా ఆయన.

"కాచలుచుకొన్న మావగా రొకడు మన గణపతిని నవ్వు ఇంద్రుడివి చంద్రుడివి అని పొగుడ్తూ వంటికి బటర్ రాసాడుట. అందులో కొంత వెన్న అతని నోట్లో పెట్టాడుట. గణపతి దాన్ని మింగలేక కక్కాడట."

ఈ విధంగా గణపతి శాంతమూర్తి, అమా-యకుడు అన్న విషయం గుర్తుకు తెచ్చుకొని అతనికి ఈ దురంతానికి పాలుపడేలా కోపం తెప్పించిన విషయం ఏమై ఉంటుందా అని ఆలోచించి అర్థంగాక అతన్నే అడుగుదామని గణపతి రూముకి వెళ్ళారు. అప్పుడతను పెట్టే బేడా సర్దుకొంటు-న్నాడు రెండోసారి. కెమిస్ట్రీ మిత్రుల కన్ను "నీ కొచ్చిన నష్టమేమిటి?" అని అడిగారు

"మీరార్పేవారా! తీర్చేవారా!"

"ఆర్పే వారము మేమే, తీర్చేవారము మేమే" అన్నారు పార్వతీశ్వరరావు, పరమేశ్వరరావును.

గణపతి నేల మీద వలికిన ద్రవాన్ని చూపుడు వేలితో చూపించి, చిటికిన వేలుతో కన్నీరు తుడుచుకుంటూ "ఈ జన్మలో నాకు పి.హెచ్.డి.

## బాలల నిధి సేకరణ

తృతీయ ప్రపంచ దేశాలలోని బాల బాలికల సహాయ నిమిత్తం పశ్చిమ జర్మనీకి చెందిన ఏడుగురు బాలలు గత సంవత్సరం 23 మిలియన్ల మార్కుల నిధులను సేకరించారు. వీరందరూ 13-16 సంవత్సరాల లోపు వారే. ఈ సందర్భంలో పత్రికలు, ప్రజ ఈ బాలలను ప్రపంచ ఛాంపియన్లుగా అభివర్ణించాయి. ఈ నిధులలో ఆసియా, ఆఫ్రికా, లాటిన్, అమెరికా దేశాలలో 600 కొత్త ప్రాజెక్టులను ప్రారంభించారు. అంతర్జాతీయ బాలల దినం సందర్భంగా జరిగిన ఒక పత్రికా సమావేశంలో ఈ బాలలు వాళ్ళని ఈ నిధులను ఉపయోగించే సహాయ కార్యక్రమాలను వివరించారు. ఈ సంవత్సరం జనవరిలో పశ్చిమ జర్మనీలో మరో మూడు లక్షల మంది బాల బాలికలు ఇంటింటికి పాటలు పాడుతూ తిరుగుతూ 16.5 మిలియన్ల మార్కులను సేకరించారు.

(గ్లోబల్)

## సాయిన్సు మిస్టరీ

రాదు." అన్నాడు.

"ఇదేదో యాసిడ్ వాసన వేస్తోందే. అని ఇద్దరు పతనమైన ద్రవాన్ని ఓ ఖాళీ సీసాలోకి ఎత్తి తమ లాబ్‌కి తీసుకు వెళ్ళి పరీక్షించి, "ఓస్ ఇదా!" అని చెప్పి తమ లాబ్‌లో ఉన్న ఒక యాసిడ్‌ని బాటిల్‌తో తెచ్చి గణపతికిచ్చి, "ఇది మా లాబ్‌లో ఉంది తీసుకో" అని చెప్పారు.

అటు నుంచి ఇకాలజీ వింగ్‌కి వెళ్ళి "మీ ఎలుకల్ని వీధిలోకి విడిచి పెడితే వాటిని గణపతి కనక పులుసు-లోకి ముక్కలుగా కలిపితే అవి మీచేత తినిపించి-గాని వదలం. ఎలుకలు జాగ్రత్త!" అని వార్నింగ్ ఇచ్చారు.

గణపతి థీసిస్ వ్రాసాడు. దాన్ని యూనివర్సిటీ వాళ్ళు వాళ్ల రూల్సు ప్రకారం ఇద్దరు ఎగ్జా-మినర్సుకి పంపారు. అందులో ఒకాయన ఇమ్మన్నాడు డిగ్రీ, మరో ఆయన వీల్లేదు పొమ్మ-న్నాడు. డిగ్రీ రావాలంటే కనీసం రెండు మంచి రిపోర్టులు రావాలి. ఆ యూనివర్సిటీ రూల్స్ ప్రకారం మొత్తం ముగ్గురిని మించి అభిప్రాయం అడగరాదు. అందుకని మ.చ్చెం మూడోవాడు అంటూ మూడో ఎగ్జామినర్‌కి థీసిస్ పంపారు. ఆయన డిగ్రీ ఇమ్మన్నాడు. ఆ రిపోర్ట్స్, ఆ యూనివర్సిటీ ఎకడమిక్ బాడీ ముందుకు వచ్చాయి. అవి చూసి ఆ బాడీ డిగ్రీ ఇమ్మంటే డిగ్రీ ఇచ్చేస్తుంది, ఆ యూనివర్సిటీ.



మొదటి రిపోర్టు ఒక నోబెల్ బహుమతి పొందిన శాస్త్రజ్ఞుడు వ్రాసింది. అది ఈ విధంగా ఉంది.

"ఈ విధంగా సౌరశక్తిని పదార్థంగామార్చటం అసంభవం. కొండిడేటు సాయి అని చెప్పబడే పటానికి.. 'యాసిడ్ పూసానని వ్రాసాడు థీసిస్‌లో పైగా సాయి అనేది కేవలం పరికరం/కేటలిస్టు మాత్రమేనని పదార్థంగా మారినది సౌరశక్తేనని క్లెయిమ్ చేసాడు. పదార్థాన్ని శక్తిగా మార్చటానికి చాలా పెద్ద తతంగం ఉందని అందరికి తెలుసు. శక్తిని పదార్థంగా మార్చటం కేవలం ఒక కాయితపు బొమ్మ/ పటంవల్ల జరగదు. కేటలిస్టులు/ పరి-కరాలు ప్రయోగానంతరం. ప్రయోగ పూర్వ స్థితిలో మిగిలిపోవాలి. అంటే ప్రతీ వారం పదిరోజులకి పాత సాయి పటాన్ని మార్చి కొత్తదాన్ని అమర్చాల్సి-రాదు. కనుక నా అభిప్రాయంలో ఈ థీసిస్‌కి పి. హెచ్. డి. అర్హతలేదు."

రెండో పరీక్షకుడు భట్ నగర్ అవార్డు విన్నర్ అయిన ప్రొఫ్ మేధావి. అతను ఆథర్ ఆఫ్ సెవరల్ హండ్రెడ్ పేపర్ పైగా గణపతి గైడైన వ్యాస్‌కి గురువు. అతనిల్లా వ్రాసాడు.

"నేను జినీవా వెళ్ళబోతూ ఈ రిపోర్ట్ వ్రాస్తు-న్నాను. నిన్ననే నాకీ థిసిస్ అందింది. చూడగానే అద్భుతమైనదని అర్థమై పోయింది. ఏక బిగిని చదివేసాను. మంచి ఫిక్షన్ నవల చదివి నట్టుంది. ఇతడు నాశిష్యుడి శిష్యుడవటం నాకు గర్వకారణం ఈ దీసిస్‌కి పి. హెచ్ డి. ఇమ్మని సిఫారస్ చేస్తు-న్నాను.

ముచ్చెం మూడో ఎగ్జామినర్ ముచ్చటైన రిపోర్ట్ పంపాడు. "కాండిడేటు చేసిన ప్రయోగాన్ని నేను జీసస్ క్రైస్టు పటంతోనూ హిట్లర్ పటంతోనూ చేసి చూసాను. ఆ విధంగానే బూడిదలాంటి పదార్థం ఏర్పడింది. అందు చేత సాయి పటంతో కూడా బూడిదలాంటి పదార్థం ఏర్పడి ఉంటుందని నమ్ముతున్నాను. (ఆ ప్రయోగం చెయ్యటానికి నా దగ్గర మరి సాయి పటం లేదు కదా!) కాండిడేటు ఎక్కడా ఒక్క సాయి పటానికీ అది సాధ్యం అని వ్రాయలేదు. అది గమనించ తగ్గ విషయం. అతను తను కనుగొన్న దానిని యధా తథంగా వివరించాడు. స్థాయిని ఎండలో పెడితే బూడిద ఏర్పడుతుందని కనుగొన్నాడు. పైగా ప్రయోగ పూర్వం సాయి పటం బరువు ప్రయోగానంతరం సాయి పటం బరువు+-ఏర్పడిన బూడిద బరువుల కంటే తక్కువ అని వ్రాసాడో చోట. ఈ విధమైన ద్రవ్య రాసి ఎక్కడిది? అది సౌర శక్తి నుంచి ఏర్పడలేదని, వాతావరణం నుంచి వచ్చిందని ఊహించవచ్చు. అంత మాత్రాన కాండిడేటు క్లెయిము తప్పని ఋజువు చేసినట్టు కాదు. ఊహ ఋజువు కాదు. అది సౌరశక్తి నుంచి ఏర్పడలేదు. అని ఖండితంగా చెప్పలేను కనుక, కేండిడేట్ క్లెయిమ్‌కి బెనిఫిట్ ఆఫ్ డేట్ ఇస్తూ డిగ్రీ ఇమ్మని రికమెండ్ చేస్తున్నాను."



# సాయిన్సు మిస్టరీ

ఆ రిపోర్టులు క్షుణ్ణంగా చదివిన డాక్టర్ వాది లేచి. "మొదటి ఎగ్జామినర్ ఈ ప్రయోగ ఫలితం అసంభవం అన్నాడు. ఆయన నోబెల్ లారెట్. ఆయన మాటకి మనం విలువ ఇవ్వాలి కాండిడేట్ ఆ విధంగా సంభవించిందని ఊహించాడే కాని ఋజువు చెయ్యలేదు మూడో ఎగ్జామినర్ డిగ్రీ ఇమ్మన్నా బెనిఫిట్ ఆఫ్ డేట్ వల్ల ఇమ్మన్నాడు రెండో, ఎగ్జామినర్ రిపోర్ట్‌లో గర్వించ తగ్గది ఏమీలేదు, ఆశించ తగినది చాలా ఉన్నా, ఈ థీసిస్‌కి డిగ్రీ ఇస్తే మన యూనివర్సిటీ పరువు పోతుంది" అని వాదించాడు

అప్పుడు ప్రొఫెసర్ సెక్యులర్ లేచాడు ఆయన లేస్తున్నప్పుడు మెడలో క్రాస్ కదలాడింది. నుదుట విబూధి రేఖల కాంతి హాలంతా కమ్ముకుంది ఆయన మీస రహితమైన గడ్డాన్ని ఒకసారి నిమురుకొని

"ఇక్కడ మనం చర్చించాల్సిన విషయం, కాండిడేటు చేసిన ప్రకారం మనం ప్రయోగం చేస్తే పదార్థం ఏర్పడుతుందా? ఏర్పడదా? అన్నది నేను కూడా భౌతిక శాస్త్రవేత్తనే కాని తలతిక్కవేత్తను కాను మా ఇంట్లో కూడా ఇటువంటి సెటప్పే మా గురూజి ఏర్పాటు చేసారు. అది డిఫ్యూజ్డ్ లైటు మాత్రమే ఉన్న ప్రదేశంలో పెట్టారు అక్కడ ఇల్లాగే పదార్థం ఏర్పడుతోంది అందుకని సూర్య కిరణాలు పడే చోట పదార్థం ఏర్పడదని కాని, సూర్య కిరణాలు పడుతూ ఉండి పదార్థం ఏర్పడితే, దాంట్లో సౌరశక్తి ప్రమేయం ఏమీ లేదని కాని అనే అంతటి మూర్ఖుడిని కాదు పదార్థం అల్లాగూ ఏర్పడుతుంది ఇల్లాగూ ఏర్పడుతుంది మా ఇంట్లో గురూజి మానసిక శక్తివల్ల పదార్థం ఏర్పడితే, కాండిడేటు సెటప్‌లో సౌరశక్తి వల్ల ఏర్పడోతోందని మనం సరి అయిన అర్థం చెప్పుకోవాలి అంతే కాని రిపోర్టు రాసిన వాడు నోబెల్‌లారేట్ కదా అని నోరెళ్లబెట్టి దాన్ని స్వీకరించరాదని మనవి చేస్తున్నా నీ రోజు ఇక్కడి విద్యావేత్తలందరికీ" అని గంభీరంగా, ఉదాత్తంగా ఉపన్యసించి కూర్చున్నాడు

"అసంభవం అంటే అర్థం ఏమిటి?" అని వాది నిలదీసాడు

సెక్యులర్ లేచి నిలబడి, "నిన్న అసంభవం అనుకొన్నవి ఈ రోజు సంభవం కావాలని ఋజువు అయ్యాయి ఎన్నో విషయాలు పెద్ద సైంటిస్టులీ విషయాల్లో పప్పులో కాలు వెయ్యటం అనాదిగా జరుగుతోంది ఈ నోబెల్ బహుమతి గ్రహీత అంతే!" అని శాంతంగా విశదీకరించాడు

"ఇప్పుడు మీ స్కూటర్‌లో పెట్రోలు బదులు నీళ్ళు పోస్తే అది నడవదని సైన్సు చెపోతోంది ఈ రోజు అది రేపు సంభవం అని సైన్సు ఋజువు చేస్తుందని నమ్ముతారా?"

"ఎందుకు నమ్మను. నమ్ముతాను పూర్వం రోజుల్లోనే బస్సులు నీళ్లతో నడిచేవి ఇప్పటికి రైళ్ళు నడుస్తున్నాయి. అందుచేత భవిష్యత్తులో స్కూటర్లు నీళ్లతో నడపవచ్చు అని నమ్ముతాను" అని గలగలా నవ్వేసాడు సెక్యులర్.

"జోక్ బావుంది స్టీమ్ ఇంజన్ నీళ్లతో నడవదని మెడమీద తలకాయ ఉన్న వాడెవడూ అనడు. పెట్రోలింజన్లో నీళ్ళు పోసి, అంటే ఏమో డిఫికేషన్లు చెయ్యకుండా నడపటం భవిష్యత్తులో సంభవమని మీరు నమ్ముతారా అని అడుగుతున్నాను. దానికి మీరు సమాధానం చెప్పక కప్పదాట్లు వేస్తున్నారు"

ఈ ఇద్దరి ధోరణి చూస్తుంటే ప్రొఫెసర్ భక్తికి వళ్ళు మండింది ఈ ఎకడమిక్ బాడీ వీళ్ల బాబుగారి కొలువా? మాట్లాడటానికి వీళ్లిద్దరే గుత్తకి తీసుకొన్నారా? తనకి కూడా ఈ విషయంలో అభిప్రాయాలున్నాయని వాళ్లకి తెలియజెప్పాలి "నీళ్లతో నడిచిన పెట్రోలింజన్లు భూమ్మీద ఉన్నాయి. ఈనాటి సైన్సు దాన్ని ఎక్స్‌ప్లెయిన్ చెయ్యలేకపోవచ్చును. సామాన్యులు దాన్ని అద్భుతంగా అనుకోవచ్చు రేపటి సైన్సు తప్పక దాన్ని తన పరిధిలోకి ఇముడ్చుకొంటుంది. అల్లాంటి ఉదంతాలు చాలా రికార్డు చెయ్యబడి ఉన్నాయి" అన్నాడు భక్త.

"అలాంటి అద్భుతాలీ భూమ్మీద లేవు. ఉన్నాయని నాకెవరైనా ఋజువు చేస్తేగాని నమ్మను" అన్నాడు వాది.

"మీ నమ్మకాలతో అవతల వాళ్లకి ప్రమేయం లేదు మీకు ఋజువు చెయ్యాల్సిన అవసరం అంతకంటే లేదు. ప్రత్యేకమైన వ్యక్తులు, ప్రత్యేకమైన సమయాల్లో అజ్ఞానులు అద్భుతాలని అనుకొనేవి చేసి చూపగా ప్రత్యేకమైన వ్యక్తులు చూసి రికార్డు చేశారు." "నేను చూడలేదు నేను నమ్మను."

"అది శాస్త్రీయ దృక్పథం కాదు. తాము చూడనంత మాత్రాన శాస్త్రజ్ఞులు కాదనరాదు. వాళ్లకి ఏ విషయంలోనైనా ఓపెన్ మైండ్ ఉండాలి. ఎవరైనా ఏదైనా అంతే కామోసు అనుకోవాలి లేకపోతే సత్యాన్ని మిస్ అవుతారు ఉదాహరణకి ఈ గదిలో నేను కళ్ళు తెరుచుకొని అంటే ఓపెన్ మైండ్‌తో ఉన్నాననుకొందాం వాదిగారు కళ్ళు మూసుకొని అంటే క్లోజ్డ్ మైండ్‌తో ఉన్నారనుకొందాం నాకు మన ఛైర్మన్ అయిన వైస్ ఛాన్స్‌లర్‌గారు కుర్చీలో ఉన్న విషయం కనిపించి 'ఆయన అక్కడ ఉన్నారు' అంటాను వాదిగారు 'నాకు కనిపించడం లేదు. కనుక లేరు' అంటారు 'అభిప్రాయాల్ని అసింటానెట్టి కళ్ళు తెరుచుకొంటే కనిపిస్తారు' అంటాను నేను అయితే అల్లా కనిపించడానికి ఆ చూసేవాళ్ళు కూడా ఈ గదిలో ఉండాలి ఈ గది బయట ఉన్నవాళ్ళు కళ్ళు తెరుచుకొని చూసినా కనిపించరు" భక్త తనవాదం ముగించి గర్వంగా అందరివైపు చూసాడు ప్రతివాదులందరు సెబాష్ అన్నట్టు చూసారు

"నాకు శ్రీవారి భార్య వారి పక్కన కళ్ళు మూసుకొన్నందువలన కనిపించడం లేదనుకొని కళ్ళు తెరుచుకొని చూస్తున్నాను అయినా కనిపించటం లేదు. కారణం ఆవిడక్కడ లేరు కనుక ఎన్ని థీయరీలు చెప్పి వాదించినా, అక్కడ లేనిది ఉన్నట్టు కాదు. భక్తగారికి శ్రీవారి భార్య వారి పక్కన కనిపిస్తున్నారా?" వాది కౌంటర్ పాయింట్ చెప్పాడు.

చర్చ కేండిడేటు డిగ్రీనుంచి తన భార్య అస్తిత్వంలోకి దిగటంతో వైస్ ఛాన్స్‌లర్ జాగ్రత్తపడి

"ఈ చర్చ ఇక్కడితో ముగిస్తున్నాను నా పక్కన కూర్చున్న ప్రొఫ్ శంకుతీర్థులవారు ఇందులో శంకించటానికి ఏమీలేదు. అని చెప్తున్నారు. ప్రొఫ్ భక్త ప్రొఫ్ సెక్యులర్ ఇదే అభిప్రాయాలు వెలిబుచ్చారు డాక్టర్ వ్యాస్ ఆరోగ్యకరమైన విద్యా పద్ధతిలో చర్చలో పాల్గొనలేదు అది తనకి సంబంధించిన విషయం కనుక ఫాక్ట్స్ చూద్దాం ఇద్దరు ఎగ్జామినర్స్ డిగ్రీ ఇమన్నారు ముగ్గురిలో మెజారిటీ ఒపీనియన్‌ని స్వీకరించకపోతే రూల్స్ బ్రేక్ చేసినట్టవుతుంది. అల్లా బ్రేక్ చెయ్యటానికి బలమైన కారణాలు చూపాలి అంగీకరించడానికి అక్కర్లేదు అందుకని శ్రీ గణపతికి డిగ్రీ ఇవ్వాలన్న నిర్ణయం ఛెయిర్‌మన్‌గా తీసుకొన్నాను" అని భరత వాక్యం పలికాడు

ఆ విధంగా సాయిన్సు మిస్టరీ ముగిసింది

రచయిత.- ఇది ఎవర్ని ఉద్దేశించి వ్రాసింది కాదు ఇటువంటి థీసిస్‌ని ఇండియాలో ఎవరూ వ్రాయలేదు, దానికెవరు పి హెచ్ డి. ఇవ్వలేదు అనే అనుకొంటున్నాను! అయితే చర్చలు కొన్నింటిని కొంచెం అతిశయోక్తికి లాగితే పై విధంగా ఉంటాయని సెనేట్‌లో కూర్చుని ఉన్న కొన్ని సమయాల్లో, అనుకొన్నాను అదిమాత్రం నిజం. నాయుడమ్మగారు బెంగుళూరులో "సాయి ఎన్సు" చాలా వేగంగా వృద్ధి పొందుతోందని అనటం కూడా ఈ రచనకి దోహదం చేసింది. □


## వైరుధ్యం

నిజమే నీ నీడా
నీలాగే ఉంటుంది
కానీ ఉదయం, సాయంత్రం
నీకన్నా అది మిక్కిలి పొడగరి
నిన్ను గురించిన నీ అభిప్రాయాల్లాగ!
మధ్యాహ్నం మాత్రం
అతి కురుచన
నీపై జనాభిప్రాయంలాగ!

—ఎస్. కె. పార్థసారథి

**sharp**

మోనోబ్లాక్ పంపులు ఉపయోగించుట వలన మీరు పొందు పొదుపు సొమ్ముతో మీకు కావలసిన నిడుపునకు పైపు కొనండి.




షార్ప్‌తో మీరు యెంతో పొదుపు చేస్తారు. మీకు కావలసిన నిడుపు పైపును ఉచితంగానే పొందినట్లవుతుంది. ఇది నిజంగా కల గాదు సుమా!

## మీరు పొదుపు చేయుటకు షార్ప్ యెలా సహాయపడుతుంది?



మీరు తక్కువ చెల్లిస్తారు... పోటీ నమూనాల ధరలు యింత కంటే 20% నుండి 75% వరకు అదనం పలుకుతూంటే! మీరు రు 1000 + స్థానిక పన్నులు మాత్రం చెల్లించండి. అమర్చుటకు ప్రత్యేకమైన శ్రద్ధ తీసికో నవసరంలేని పంపును మీరు పొందగలరు. ఇది నడుపుటకు అయ్యే ఖర్చులలో 20% ఆదా యిస్తుంది.

అంతా పొదుపే .... షార్ప్ ఆధునిక సాంకేతిక నైపుణ్యం యొక్క ఫలితం కావడం వలననే.

## షార్ప్ యెందుకంత తక్కువ బరువు గల పంపు?



షార్ప్ బరువు 10 కేజీలు మాత్రమే. ఇది యితర నమూనాల కంటే దాదాపు మూడు రెట్లు తక్కువ, మేము కాస్టింగ్ పనులు చేయము దానికిబదులు షీట్ మెటల్ ఉపయోగిస్తాం. వైండింగ్ కాయిల్‌ను మేము సులభం చేస్తాం. దీనికి బదులు కాంపాక్ట్ సర్క్యూట్‌ను "బి" క్లాస్ ఇన్‌సులేటర్‌తో అమరుస్తాం.

## తక్కువ బరువు పని తనమునకు లోపం తెస్తుందా?



లేదు. 8 మీటర్ల సక్షన్ లిఫ్ట్ శక్తితో, 30 మీటర్ల మొత్తం యెత్తునకు నీరు తోడు శక్తిగలిగి అయిదవ అంతస్థునకుకూడా నీరు నివ్వగలదు.

## తక్కువ బరువు యెలా లాభదాయకం?



పొదుపులు.... వాడిన సామగ్రి మరియు నడుపు ఖర్చులద్వారా సౌకర్యం....మీ వంట గది నుండి కూడా మీరు షార్ప్ పని చేయునట్లు చేయగలరు కుదిమట్టం: షార్ప్‌నకు మిక్కిలి తక్కువ స్థలం చాలు. దీనిని మరొక చోటికి సులభంగా తీసికొనిపోవచ్చు. నిజంగా శబ్దం లేనిది.

Jaisons/SI/22/84 TEL

షార్ప్-తక్కువ బరువుగలిగి అధిక పొదుపు నిచ్చునది.

మీ షార్ప్‌ను మా అధికారం పొందిన డీలర్ల ద్వారానే పొందండి.

సేల్సు బ్రాంచి: 136, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్–500 003 ఫోన్: 75960

**Now ISI Approved**

**Sharp Industries**

కాళప్పట్టి,
కోయంబత్తూరు–641 061.
ఫోన్: 87296/33854
తంతి: SHARP TOOLS

# దేదీప్య

## కంచుమర్తి వెంకటేశ్వరరావు

### (గత సంచిక తరువాయి)

"చూడండీ.. నేను దేదీప్యను ప్రేమించాను. మీరంగీకరిస్తే పెళ్ళి చేసుకుంటాను" ఆ రెండు ముక్కలే అన్నాడు శివప్రసాద్

బలరాం ఆలోచనలో పడ్డాడు వినయ విధేయతలు ఉట్టిపడుతున్న శివప్రసాద్‌ను చూస్తుంటే కాదనడానికి ధైర్యం చాలడంలేదు బలరాంకు

"బాబూ . ఆ పాప"

"నా కూతురు"

శివప్రసాద్ జవాబుకు బలరాం ముఖం వివర్ణమైంది.

"అంటే మీకు ఇంతకుముందే పెళ్ళయిందా"

బలరాం ప్రశ్నకు తలవంచాడు శివప్రసాద్

దేదీప్య లోపలకు వెళ్ళిపోయింది

బలరాం గదిలోకి వెళ్ళాడు

దేదీప్య తల్లితో మాట్లాడుతుంది

"అదేమిటీ.... నీకు మతిగాని పోయిందా ఒక బిడ్డ తండ్రిని పెళ్ళి చేసుకుంటావా" గట్టిగా అడిగింది పార్వతమ్మ.

"అమ్మా అన్ని వివరాలు తర్వాత చెబుతాను అతనితో నా పెళ్ళికి అంగీకరించండి "

పార్వతమ్మ మాట్లాడలేదు

"దేదీప్యా నాకు అవంతి గుర్తుకు వస్తుందమ్మా"

బలరాం మాటకు క్షణం వణికిపోయింది దేదీప్య. తండ్రి బాధ అర్థమైంది నెమ్మదిగా తండ్రి వద్దకు వెళ్ళి అతని చేతులను పట్టుకుంది

"నాన్నా.... మీ బాధ నాకు తెలుసు కానీ నేను మీకు అన్యాయం చేయను మీ కిష్టమైతేనే పెళ్ళి చేసుకుంటాను."

తండ్రి బాధను అర్థం చేసుకున్న ఆ సమయంలో దేదీప్య అంతకంటే ఏం మాట్లాడలేదు

"దేదీప్యా. నీ జీవితం నీది ఏ రీతిలో మలచుకోవాలన్నా నీ చేతిలో ఉంది అతనిమీద నీకు పూర్తిగా నమ్మకం ఉంటే, అతనితో నీ జీవితం ఆనందంగ గడపగలననే ధైర్యం నీకుంటే నాకు అంతే చాలు నీ కిష్టమైనట్లు ఈ పెళ్ళి జరిపిస్తాను ఈ వయసులో తండ్రిగా కోరుకునేది అమ్మాయిల పెళ్ళిళ్ళేనమ్మా"!

బలరాం మాటలకు దేదీప్య సంతోషంతో అతని కాళ్ళకు నమస్కరించింది బలరాం కూతురును గుండెల కత్తుకుని లాలనగా తల నిమిరాడు కొంతసేపయిం తర్వాత బయటకు వచ్చింది దేదీప్య పేపరు చూస్తూ కూర్చున్నాడు శివప్రసాద్

"ఏవండీ . మీకో శుభవార్త" అంది దేదీప్య అతని

**జరిగిన కథ - 13 : దేదీప్య తన అక్క ఫోటో శివప్రసాద్ ఇంట్లో ఆల్బమ్‌లో చూసింది. శిరీష తన అక్క కూతురే అని తెలుసుకుంది. శివప్రసాద్ తన కుటుంబ గాధను దేదీప్యతో చెప్పడం ప్రారంభించాడు. శివప్రసాద్ అన్న ప్రమోద్ భార్య అవంతి ఒక పాపను కని చనిపోయింది. ప్రమోద్ ఫారెన్ వెళ్ళిపోయాడు. పాపకు శిరీష అనే పేరు పెట్టి తనే తల్లి, తండ్రి అయి పెంచసాగాడు శివప్రసాద్. అక్క చనిపోయిందన్న విషయం దేదీప్యను దుఃఖ సముద్రంలో ముంచింది. శిరీషతో దేదీప్య టీచరే కాదు. మమ్మీ కూడా అని చెపుతాడు శివప్రసాద్. శిరీషను చూసిన దేదీప్య తల్లి తండ్రులకు, చిన్నప్పటి అవంతి గుర్తుకు వస్తుంది.**

చేతిలోంచి పేపరును లాక్కొంటూ

"ఏమిటో "

"మా నాన్నగారు ఒప్పుకున్నారు" అంది సిగ్గుపడుతూ

శివప్రసాద్ ఆనందంతో దేదీప్య చేతులను పట్టుకున్నాడు

"ఆఁ. ఇక్కడ కాదు" అని అతన్ని తప్పించుకుని లోపలకు తుర్రుమంది

అరగంట సేపు బలరాంతో మాట్లాడి వెళతానంటూ బయటకుపచ్చాడు శివప్రసాద్ కారులో కూర్చుని శిరీష కోసం హారను నొక్కాడు దేదీప్య శిరీషను తీసుకొచ్చి కారులో కూర్చో బెట్టింది ఏదో గుర్తుకు వచ్చి శివప్రసాద్ దిగి దేదీప్య దగ్గరకు వచ్చి అటూ యిటూ చూసి వస్తాను దేదీప్యా అని దేదీప్య బుగ్గమీద ముద్దు పెట్టాడు అలాగే నిలబడిపోయింది కారు కదిలింది దేదీప్య బుగ్గలు సిగ్గుతో అరుణిమ దాల్చాయి

* * *

### 41

శివప్రసాద్, దేదీప్యల పెళ్ళి ముహూర్తం నిర్ణయమైంది వారం రోజుల్లో పెళ్ళి ఆ రోజు దేదీప్య, శివప్రసాద్ బట్టల షాపుకు బయలు దేరుతుంటే టెలిగ్రాం వచ్చింది

శివప్రసాద్ టెలిగ్రాం చదివి ఆశ్చర్యపోయాడు

"ఎక్కడనుండి" అడిగింది దేదీప్య

"అమెరికానుండి అన్నయ్య వస్తున్నాడు "

"అయితే మరీ సంతోషం . మన పెళ్ళి సమయానికి వస్తున్నారు "

శివప్రసాద్ మరి మాట్లాడలేదు బట్టల షాపు నుండి ఒక గంటలో వచ్చారు ఇంటికి దేదీప్య వరండాలో శిరీషతో కబుర్లు చెబుతూ కూర్చుంది

శివప్రసాద్ మేడమీదకు వెళ్ళి అంతకు ముందు అన్నయ్య వ్రాసిన లెటరును టేబిల్లోంచి బయటకు తీసాడు

డియర్ శివుడూ క్షేమమే కదా! నీకు ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి అవంతి జ్ఞాపకాలనుండి దూరమై ఒంటరిగా బ్రతుకుతున్న నా జీవితంలో ఈ మధ్య ఒక అందమైన మలుపు తిరిగింది ఒకరోజు నేను హాస్పిటలు నుండి బయటకు వస్తుంటే నా ఎదురుగా ఒక అందమైన అమ్మాయి ఆమెలో తెలుగుదనం స్పష్టంగా కనిపిస్తుంది తర్వాత తెలిసింది వాళ్ళది విజయవాడని వాళ్ళ నాన్నగారు కూడా డాక్టరే. పది సంవత్సరాలైందట అమెరికా వచ్చి నేను ఇండియానుండి వచ్చిన కొద్ది రోజులకు అతనితో పరిచయం చేసుకున్నాను అతను చాలా మంచివారు అప్పుడప్పుడు గెస్ట్‌గ పిలిచేవారు ఆ ఇంట్లో నేనంటే అందరికీ అభిమానమే నేను ఎప్పుడు ఇంటికి వెళ్ళినా ఆ అమ్మాయి నా గురించే అన్నట్లు నీటుగా తయారై ఏదో ఒక స్వీటు తయారుచేసి

పెట్టేది నన్ను చూసినప్పుడల్లా ఆ అమ్మాయి ముఖంలో స్పష్టమయ్యే సిగ్గు తెరలు ఆనందం . ఇంకా ఏవేవో నన్ను ఆలోచనల్లోకి పింపేయి ఆ అమ్మాయి పేరు కుసుమ నేను రెండ్రోజులు కనబడకపోయేసరికి ఫోన్ చేసేది ఫోన్‌లో ఎన్నో కబుర్లు చెప్పేది తీరా ఇంటి కెళ్ళితే ఏవీ మాట్లాడేది కాదు ఆ ముఖంలోని భావాలే జవాబుగా మార్చుకునే వాడని ఒక రోజు కుసుమ అంది ఫోన్‌లో ఐ లవ్ యూ అని అప్పుడే అవంతి జ్ఞాపకాలు మరుగు పడుతున్న సమయంలో కుసుమ ప్రేమ గాలులు నన్ను మరో లోకానికి తీసుకెళ్ళాయి అయితే అవంతిని ఎంత గాఢంగా ప్రేమించానో తలచుకుంటె ఆ ప్రేమను తిరిగి కుసుమకు ఇవ్వగలనా లేదా అనే సంశయంలో పడ్డాను. అవంతి రూపాన్ని హృదయంనుండి చెరిపెయ్యడం అంత సులభంగా జరిగే పని కాదు. నిర్మొహమాటంగా కుసుమకు అవంతి గురించి ఒక రోజు అంతా చెప్పేసాను. నా కథ విని కుసుమ నన్ను అపార్థం చేసుకుని నాకు దూరమవుతుందని ఆశించాను. అలా జరిగితే మరోసారి ప్రేమ వలయంలో చిక్కుకోనని నిర్ణయించుకున్నాను... కానీ అలా జరుగలేదు. అంతా విని కుసుమ తప్పు చేసిన వాడిలా తలవంచుకున్న నన్ను పసిపిల్లవాడిలా గుండెల కత్తుకుంది.

"పాత జ్ఞాపకాలను బయటకు రప్పించి బాధ పెట్టానా" అని బుజ్జగించింది.... లాలించింది. కుసుమ అందించిన ప్రేమతో నేను మళ్ళీ మనిషినయ్యాను. శిరీష గురించి చెప్పాను. "మీ కూతురైతే నాక కూతురుకాదా" అంది కుసుమ.

అంత చక్కని అందమైన మనసు కుసుమది. తల్లి లేని లోటును తీరుస్తానంది కుసుమ. అందుకే కుసుమను పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. పెళ్ళయిం తర్వాత ఇద్దరం నీ దగ్గరకు వస్తాం. పెళ్ళి కాని కుర్రవాడివి నువ్వు. ఇంతవరకూ శిరీష బాధ్యత నీమీద ఉంచినందుకు క్షమించు. రేపో మాపో పెళ్ళి చేసుకుని ఆనందంగా కాపురం చేయవలసిన మీ మధ్య శిరీష ఎందుకు? అందుకని ఈసారి వచ్చినప్పుడు నేను శిరీషను నాతో అమెరికా తీసుకెళతాను. వచ్చే ముందు డేట్ ఫిక్స్ చేసి టెలిగ్రాం ఇస్తాను.

ఆశీస్సులతో

అన్నయ్య ప్రమోద్.

ఉత్తరం మరోసారి చదివి ఆలోచనలో పడ్డాడు శివప్రసాద్. అన్నయ్య పెళ్ళి చేసుకున్నాడు. ఎంతో సంతోషంగా ఉంది. కానీ శిరీషను అన్నయ్య తీసుకెళతాడు.... ఆ మాటే బాధగా, భయంకరంగా ఉంది. ఇన్ని సంవత్సరాలు తన సొంత కూతురులా పెంచాడు. 'డాడీ....' అనే ముద్దు పిలుపుకే పొంగి పోతున్నాడు తను. శిరీషను అన్నయ్య తీసుకెళ్ళితే.... ఆ బాధను భరించగలడా తను. వీల్లేదు.... శిరీషను అన్నయ్యతో పంపించకూడదు.... కానీ.... శిరీష అన్నయ్య కూతురు అన్నయ్యా శిరీషను తీసుకు వెళ్ళవద్దు అని ఎల్లా చెప్పగలడు తను

*　　　*　　　*

ఎయిర్ పోర్టంతా కళ కళ లాడుతుంది అప్పుడే లేండయిన విమానం నుండి దిగుతున్న ప్రమోద్, కుసుమ కనిపించారు శివప్రసాద్‌కు

"అన్నయ్యా ."


"హాయ్ శివుడూ"

ప్రమోద్ శివప్రసాద్‌ను కౌగలించుకున్నాడు

"కుసుమా మా తమ్ముడు శివప్రసాద్"

కుసుమకు పరిచయం చేసాడు ప్రమోద్

"నమస్కారం వదినగారూ"



శివప్రసాద్ అలా అనగానే కుసుమ చిన్నగా నవ్వింది

ముగ్గురూ బయటకు వచ్చి కారులో కూర్చున్నారు దారంటా ప్రమోద్ శిరీష గురించే అడుగుతున్నాడు అన్య మనస్కంగా జవాబులు చెబుతున్నాడు శివప్రసాద్

కారు ఇంటిముందాగింది

'డాడీ '

పరుగెత్తుకుని వచ్చింది శిరీష

ప్రమోద్ ముందుకు నడిచాడు శిరీష దగ్గరకు

కానీ శిరీష శివప్రసాద్ దగ్గరకు వెళ్ళింది

ఆ పిలుపు ప్రమోద్ కోసం కాదు శివప్రసాద్ కోసం .

"డాడీ నాక చెప్పకుండా, నన్ను తీసుకు వెళ్ళకుండా వెళ్ళిపోయావు నేను నీతో మాట్లాడను ఫో " అంది గారాబంగా

"అదికాదు శిరీషా "

"డాడీ . నీవు తప్పు చేసావుకదూ"

"అవునమ్మా"

"తప్పు చేస్తే ఏం చెయ్యాలి"

"తప్పు చేస్తే సారీ చెప్పాలి."

"అయితే నువ్వు సారీ చెప్పాలి లేకపోతే నేను నీతో మాట్లాడను" అలిగినట్లు దూరంగా వెళ్ళింది

# దేదీప్య

శిరీష

"సారీ శిరీషా "

అని శిరీషను ఎత్తుకుని ముద్దు పెట్టాడు

"గుడ్ డాడీ " అని శిరీష శివప్రసాద్‌కు ముద్దు పెట్టింది

ముద్దు లొలికే ఆ తీయని శిరీష మాటలకు ప్రమోద్ అలాగే నిలబడిపోయాడు. శిరీషను దగ్గరకు తీసుకోవాలనే ఆరాటం కలిగింది

"పాపా నా దగ్గరకు రావా" అని ప్రమోద్ శివప్రసాద్ చేతుల్లోంచి తీసుకోబోయాడు. కానీ శిరీష రాలేదు అందరూ లోపలకు వెళ్ళారు ఇల్లంతా పెళ్ళి కళతో కనబడగానే ప్రమోద్ అడిగాడు అప్పుడే అక్కడకు వచ్చిన ఆయా చెప్పింది

"పెదబాబుగారూ .. చిన్న బాబుగారు పెళ్ళి కొడుకు కాబోతున్నారు."

ప్రమోద్ శివప్రసాద్‌ను కౌగలించుకున్నాడు

"కంగ్రాచ్యులేషన్స్ తమ్ముడూ. మంచి సమయానికి వచ్చాం. ఇంతకీ ఆ అదృష్టవంతురాలు ఎవరు?"

"దేదీప్య" నెమ్మదిగా అన్నాడు శివప్రసాద్

ఉలిక్కిపడ్డాడు ప్రమోద్ ఈ పేరు తనెక్కడో విన్నాడు ఎక్కడ? అప్పుడు గుర్తుకు వచ్చింది

అవంతి అప్పుడప్పుడు తన చెల్లెలు గురించి చెప్పేది అవంతి చెల్లెలు దేదీప్య .. అదే అడిగాడు ప్రమోద్ అవునన్నట్లు తలూపాడు శివప్రసాద్ మరింకేమీ మాట్లాడలేదు ప్రమోద్.

* * *

**42**

ప్రమోద్, కుసుమ కారులో స్నేహితులింటికి వెళ్ళడంతో శివప్రసాద్ ఆఫీసునుండి ఆటోలో స్కూలు దగ్గరకు వెళ్ళాడు

దేదీప్య బయటకు వచ్చింది

"దేదీప్యా శిరీష ఏది"

"కారులో ఎవరో వచ్చి తీసుకెళ్ళారు అది మీ కారే."

దేదీప్య అలా అనగానే ఆలోచనలో పడ్డాడు

అన్నయ్య ధోరణి అర్థం కావడంలేదు వచ్చిన రెండ్రోజుల నుండి శిరీషను దగ్గరకు తీసుకోవాలని, శిరిషచేత డాడీ అని పిలిపించుకోవాలని అన్నయ్య పడుతున్న అవస్థనంతా గమనిస్తూనే ఉన్నాడు ఒక్కొక్కసారి అన్నయ్య చిరాకు పడుతున్నాడు . ఈ పరిస్థితి ఏ సంఘటనకు దారి తీస్తుందోనని భయంగా ఉంది శివప్రసాద్‌కు

'ఎవరతను '

దేదీప్య ప్రశ్నకు జవాబివ్వకుండా ముందు ఆటో ఎక్కమన్నాడు దేదీప్య కూర్చోగానే బీచ్‌కు పోనిమ్మన్నాడు డ్రైవరును

శివప్రసాద్ ఆలోచనలకు అందడం లేదు శిరీషను తమతో తీసుకెళ్ళడానికి, తమ దగ్గర అలవాటు చేసుకోడానికి అన్నయ్య చేస్తున్న తొలి ప్రయత్నమా ఇది

ఆటో బీచ్ దగ్గర ఆగింది

ఎవరూ లేని చోట కూర్చున్నారిద్దరూ

శివప్రసాద్ మౌనంగా ఉండడం గమనించి దేదీప్య అతని చేతులను తన చేతుల్లోకి తీసుకుని కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అడిగింది.

"ఏమిటి ఆలోచిస్తున్నారు"

"దేదీప్యా . అతను ఎవరో కాదు మా అన్నయ్య ప్రమోద్"

దేదీప్య ఆశ్చర్యంతో కళ్ళప్పగించింది

అతను తన అక్క భర్త

మరి అతని ప్రక్కన ఉన్న ఆమె ఎవరు?

అదే అడిగింది

అప్పుడు శివప్రసాద్ ప్రమోద్, కుసుమల గురించి చెప్పాడు అయితే శిరీషను తీసుకెళ్ళిపోతారనే విషయం చెప్పలేదు ఎలా చెప్పగలడు?

శిరీష కోసమే తనకు చేరువయింది

శిరీషలో దూరమైన అక్కను చూసుకుంటుంది

పెద్ద కూతురు దూరమైందని బాధ పడుతున్న బలరాం, పార్వతమ్మలు శిరీషలో అవంతిని చూసి మురిసిపోతూ గతాన్ని మరచిపోవడానికి ప్రయత్నిస్తున్నారు ఈ సమయంలో ఈ చిన్న సంతోషం కూడా మిగల్చకుండా అన్యాయం చేయడం మంచిదా

దేదీప్యకు ఈవిషయం చెప్పితే ఒప్పుకుంటుందా

ప్రస్తుతం చెప్పకూడదనుకున్నాడు

చీకటి పడింది

జనం పలచబడ్డారు

"మరివెళదామా"

అని దేదీప్య లేచింది

శివప్రసాద్ దేదీప్య చేతులు పట్టుకుని లాగాడు ఆ ఊపుకు దేదీప్య వచ్చి అతని ఒడిలో పడింది శివప్రసాద్ దేదీప్య చుట్టూ చేతులు వేశాడు

"దేదీప్యా . ఒక్క క్షణం ఇలాగే ఉండిపో . ఇంటికి వెళ్ళాలంటే భయంగా ఉంది "

ఆరోజు శివప్రసాద్ ధోరణి వింతగా ఉంది

అతనెప్పుడూ అంత బేలగా వాపోవడం చూడని దేదీప్య కంగారు పడింది అతన్ని మామూలు మనిషిని చెయ్యడానికి టాపిక్ మార్చింది.

"పెళ్ళి కొడుకు కాబోతున్నందుకు సంతోషించడం పోయి ఇలా దిగులుగా తయారవుతున్నారేమిటి మన భావి జీవితం గురించి కలలు కంటున్నానని, ఆ కలలో నువ్వే కనిపిస్తున్నావని అంటారేమోననుకుంటున్నాను ఆ ప్రసక్తే తీసుకు రావడం లేదు . అంటే నేను ఇష్టం లేదా" అంది దేదీప్య అలక నటిస్తూ అతని కౌగిలి నుండి వీడడానికి ప్రయత్నిస్తూ

ఈసారి శివప్రసాద్ నవ్వుతూ అలకలో అందంగా మారిన దేదీప్య ముఖాన్ని చేతుల్లోకి తీసుకుని తమకంతో ఆమె పెదవులను తన పెదవులతో గట్టిగ ఒత్తాడు

సిగ్గుల మొగ్గగా దేదీప్య అతని గుండెలపై తలాన్చింది

"దేదీప్యా .. ఎదురుగా ఉంటె కల లెందుకు " అన్నాడు కౌగిలిని మరింతగా బిగిస్తూ

కొంతసేపయింతర్వాత దేదీప్య అతని కౌగిలినుండి వీడి 'అమ్మో చాలా టైమయిందని లేచింది

ఇద్దర్ూ బీచ్ నుండి బయటకు వచ్చారు


ప్రక్క ప్రక్కన నడుస్తున్నారు

"ఎంత దూరం ఇలా నడుస్తాం. ఆటోని పిలువండి"

"వద్దు ఇలాగే నడుద్దాం "

"ఎంత దూరం?"

"మన గమ్యం చేరేవరకు "





కవితాగానం చేసే కళ్లకు...
ఐటెక్స్
అపురూప సౌందర్యంతో పొంగిపోయే
యవ్వనంతో మురిపించే వనితల వదనాలను
ఆకర్షించే అతివల కళ్లను, ఆనందంగా
కొనచూపులతో నటనమాడించేది ఐటెక్స్
శాస్త్రీయ విధానంలో తయారుచేయబడు
ఐటెక్స్ కాటుక అందాలు చిందేటి
యువతుల కళ్లను దోషమేమీ చేరనీయక
చల్లగా కాపాడుతుంది...
చూపులనే మాటలుగా మార్చే ఐటెక్స్
ఐటెక్స్ 42 సంవత్సరములుగ మీ నమ్మకానికి
పాత్రమైన ఉన్నతమైన చిహ్నం
EYETEX REGD.
Eyetex REGD
అరవింద్ లాబరేటరీస్ మద్రాసు 600 033
Imageads-AL 1293 Tel

# దేదీప్య

'అమ్మో . నా కాళ్ళు నొప్పెడుతాయి'

"నేను ఎత్తుకుంటాను"

"అమ్మా. ఆశ" అంది చిలిపిగా అందంగా నవ్వుతూ దేదీప్య.

* * *

దేదీప్యను ఇంటి దగ్గర డ్రాప్ చేసి ఇంటి కొచ్చేసరికి రాత్రి పదయింది వరండాలో అడుగు పెట్టిన శివప్రసాద్‌కు ఎదురుగా కనబడిన దృశ్యం.

శిరీష ఏడుస్తోంది

ప్రమోద్ కోపంగా ఉన్నాడు అతని చేతి నుండి తప్పించుకుని పారిపోవడానికి ప్రయత్నిస్తోంది

"చెప్పమ్మా. నేను మీ డాడీనని"

"కాదు డాడీ కాదు"

"నీకే చెప్పేది. నన్ను డాడీ అను"

అని గద్దించాడు కోపంగా

"నేననను డాడీ కాదు మీరు"

వెక్కిళ్ళ మధ్య అంటుంది శిరీష

"అనవూ"

"ఊహు"

ప్రమోద్ శిరీష లేత చెంపలమీద చిన్న దెబ్బ వేసాడు

ఆ చిన్న దెబ్బ ఆ చిన్నారి పాపకు పెద్ద దెబ్బ

'అమ్మా'

శిరీష అరుపుకు మరిక ఆగలేకపోయాడు శివప్రసాద్ గబగబ వెళ్ళి శిరీషను ఎత్తుకున్నాడు..

"డాడీ డాడీ"

శివప్రసాద్ మెడ చుట్టూ చేతులువేసి మరింతగా ఏడ్చింది శివప్రసాద్‌కు దుఃఖం ఆగలేదు ఇంతవరకూ శిరీషను అల్లారు ముద్దుగా పెంచాడేగాని ఏనాడూ చిన్న దెబ్బ వెయ్యలేదు అటువంటిదీ రోజు శిరిషను అన్నయ్య కొట్టడం ఆ దెబ్బ తనకే తగిలినట్లుగా బాధపడ్డాడు.

"అన్నయ్యా. బలవంతంగా చెప్పితే పిల్లలు మన మాట వింటారా." అంతకన్నా ఇంకేం అనలేకపోయాడు శివప్రసాద్

"శివుడూ.. శిరీషను నీ పెళ్ళయిన వెంటనే నేను తీసుకెళ్ళతాను శిరీషను నేనే డాడీనని నచ్చ చెప్పి నాతో పంపించే బాధ్యత నీదే" అనేసి లోపలి గదిలోకి వెళ్ళిపోయాడు.

శివప్రసాద్ కొయ్యబారి పోయాడు

అప్పుడే లోపలినుండి బయటకు వచ్చిన కుసుమ కూడా ఆశ్చర్యపోయింది శివప్రసాద్ దగ్గరకు వచ్చింది

"శివప్రసాద్‌గారూ . పాపచేత డాడీ అని పిలిపించుకోవాలనే తపనతో, ఆవేశంతో మీ అన్నయ్యగారు అలా ప్రవర్తించారు అతని తరపున నేను క్షమాపణలు కోరుతున్నాను . ఏమీ అనుకోవద్దు" అంది

శివప్రసాద్ మరి మాట్లాడలేదు

చాలాసేపటివరకు శిరీష క్రిందకు దిగలేదు

కుసుమ అరగంటసేపు బ్రతిమాలి నవ్వుతూ కబుర్లు చెప్పితేగాని శిరీష పాలు తీసుకోలేదు

శివప్రసాద్ శిరీషను తన దగ్గరే పడుకోబెట్టుకుని జోకొడుతూ ఆలోచనలో పడ్డాడు.

అన్నయ్య ప్రవర్తన ముందు ముందు ఎటువంటి పరిస్థితులకు దారితీస్తుందోనని భయంగానే ఉంది

* * *

43

పెళ్ళిరోజున మధుబాబు, సుస్మిత, రాఘవ, సరళ వచ్చారు.

సుస్మిత ప్రమోద్ పెళ్ళి చేసుకుని వచ్చినందుకు సంతోషించింది కలివిడిగా తిరుగుతున్న కుసుమను చూసి సంబరపడింది.

అక్కడ బలరాం, పార్వతమ్మ కూతురు పెళ్ళికూతురు అవుతున్నందుకు మురిసిపోతున్నారు సరళ, రాఘవ వాళ్ళకు చేదోడుగా ఉండి పనులన్నీ చేస్తున్నారు

పెళ్ళి శివప్రసాద్ ఇంట్లోనే వైభవంగా చెయ్యాలని ప్రమోద్, సుస్మిత అడిగినప్పుడు ముందు బలరాం అంగీకరించకపోయినా వాళ్ళ ఇష్టాన్ని, ముద్దు ముచ్చటలకు కాదనలేక పోయాడు

ముహూర్తం టైము దగ్గర పడింది

దేదీప్య కళ్ళల్లో వేయి వెన్నెల కాంతులు

అసలే తెలుపు రంగుతో అందంగా ఉండే దేదీప్య పెళ్ళికూతురి ముస్తాబులో మరింత అందంగా మెరిసిపోతుంది చూసే వాళ్ళు ఒక్క క్షణం చూపు మరల్చలేక పోతున్నారు

శివప్రసాద్ దేదీప్య మెడలో మూడు ముళ్ళు వేస్తుంటే బలరాం, పార్వతమ్మలకు కన్నీరాగలేదు. ఆ సమయంలో కళ్ళముందు అవంతి కనిపించింది కళ్ళు చెమ్మగిల్లాయి

అందరి మధ్య అల్లరిగా తిరుగుతున్న శిరీషను దగ్గరకు తీసుకున్నారు బలరాం, పార్వతమ్మ

బంధువులు, స్నేహితుల్లా సమక్షంలో శివప్రసాద్, దేదీప్యల పెళ్ళి వైభవంగా జరిగింది

కోటి కోరికలను గుండె నిండా నింపుకుని, సిగ్గుల మొగ్గలను బుగ్గలనిండా దాచుకుని రతీదేవిలా తన దగ్గరకు చేరిన దేదీప్యను హృదయానికి హత్తుకున్నాడు శివప్రసాద్.

దేదీప్య నవ్వింది

మల్లెలు చిన్నబోయాయి.

దేదీప్య పరవశించి మురిసి పోయింది

వెన్నెల వెల వెల బోయింది

* * *

వారం రోజుల తర్వాత ప్రమోద్, కుసుమ వెళ్ళుతామని చెప్పారు అప్పుడు తెలిసింది దేదీప్యకు శిరీషను తీసుకెళతారని అదే అడిగింది శివప్రసాద్‌ను అతను తలవంచాడు

అలా జరగడానికి వీల్లేదు

శిరీష వెళ్ళకూడదు

శిరీష దూరమైతే తను సహించ గలదా

శిరీషను పంపించ వద్దని బ్రతిమాలింది దేదీప్య.

దేదీప్యను ఓదార్చడమే తప్ప ఇంకేం మాట్లాడలేక పోయాడు శివప్రసాద్

ఒక నిర్ణయానికి వచ్చిన దేదీప్య ఆ సాయంత్రం కుసుమ గదిలోకి వెళ్ళింది ఆ సమయంలో కుసుమ పెట్టె సర్దుతోంది

"కుసుమగారూ"

కుసుమ నవ్వుతూ, "ఇంకా ఆగారు ఏంటమ్మా నాకంటె చిన్నదానివి నా మరిది భార్యవు.. అక్కా అని పిలు." అంది.

దేదీప్య ఆ మాటలకు చలించింది

కరీంనగర్‌లో ఇటీవల జరిగిన బాలల చలన చిత్రోత్సవ ప్రారంభ సమావేశంలో ప్రసంగిస్తున్న పోలీస్ డి ఐ జి శ్రీ ఎస్. ఆర్ సుకుమార్ జిల్లా కలెక్టర్ శ్రీ ఆర్ చంద్రశేఖర్‌గార్లని కూడా చిత్రంలో చూడవచ్చు.



"అక్కా..." అంది ఆనందంగా దేదీప్య.

"ఏమిటి దేదీప్యా."

దేదీప్య కుసుమ చేతుల్లో ముఖాన్ని దాచి ఏడ్చేసింది.

"అరె.. దేదీప్యా... ఏమిటో చెప్పకుండానే ఎందుకంత బాధ పడతావు." అంది కుసుమ భుజాలను నిమురుతూ.

"అక్కా... నే నొక కోరిక కోరుతాను... కాదనగలవా."

"లేదు... నీ కోసం ఏమైనా ఇస్తాను."

"అక్కా... పెద్ద కూతురు దూరమైనప్పటి నుంచి ఇంత వరకూ ఆ బాధను అనుభవిస్తున్నారు మా అమ్మా, నాన్న. అంతలో శిరీష మా జీవితంలోకి వచ్చింది. అంత బాధలోనూ అమ్మా, నాన్న పెదవులపై చిరునవ్వులను వెలిగించింది. శిరీషలో మా అక్కను చూసుకుని మురిసి పోతున్నారు. శిరీషలో నేను అక్కను చూసుకుంటున్నాను.

శిరీష నన్ను మమ్మీ అని పిలుస్తుంది. కొండంత ఆనందంతో గుండెలకు హత్తుకుంటున్నాను. శిరీషను నా గుండెల నుండి వేరు చేయకండి.

అక్క దూరమైందనే బాధను శిరీషను చూసి మరచిపోతున్న మా అమ్మ నాన్నలను మళ్ళీ గతంలోకి నెట్టవద్దు.. శిరీష దూరమైనా, అక్క చనిపోయిందని నిజం తెలిసినా అమ్మా నాన్న నాకు దక్కరు.

[illegible]ను దూరం చేసి మాకు అన్యాయం చేయకండి.

మా హృదయాలు ఎంత తల్లడిల్లుతున్నాయో ప్రమోద్ గారికి చెప్పండి. శిరీషను మాకు దూరం చేయవద్దని చెప్పండి...."

కన్నీటితో దేదీప్య కుసుమ పాదాలపై పడింది.

కుసుమకు కన్నీ రాగలేదు.

దేదీప్యను లేవనెత్తి గుండెలకత్తుకుని ఓదార్చింది.

ఆ సమయంలో అటు వైపుగా వచ్చిన ప్రమోద్‌కు దేదీప్య మాటలు వినబడ్డాయి. గిరుక్కున వెనక్కు తిరిగాడు.

* * *

## 44

విమానంలో కూర్చున్నారు ప్రమోద్, కుసుమ.

దేదీప్య శిరీషను ఎత్తుకుంది

శివప్రసాద్ దేదీప్య ప్రక్కన నిలబడ్డాడు

అందరి కళ్ళు కన్నీటితో నిండి ఉన్నాయి

విమానం కనుమరుగయ్యేంత వరకు చేతులూపుతూనే ఉన్నారు

కొంత సేపటికి బయటకు వచ్చి కారులో కూర్చున్నారు.

నెమ్మదిగా డ్రైవ్ చేస్తున్నాడు శివప్రసాద్.

అతని భుజాలమీద తలాన్చింది దేదీప్య.

'దేదీప్యా

"ఊ "

"నీకేమనిపిస్తుంది."

"జీవితంలో ఇటువంటి శుభ ఘడియలు వస్తాయని ఊహించలేదు ఇన్నాళ్లకు అక్క గురించి తెలుసుకున్నాను అక్క దూరమైనా శిరీష నా కూతురుగా నా దగ్గరకు వచ్చింది మీలాంటి మంచి మనిషికి భార్యనయ్యాను నేను ,అదృష్టవంతురాలిని" అంది దేదీప్య తదాత్మ్యకంగా

శివప్రసాద్ నవ్వుతూ ఒక చేత్తో దేదీప్యను దగ్గరకు తీసుకున్నాడు

దేదీప్య జడలోని మల్లెలు వెన్నెలలను కురిపించాయి

హృదయ వీణ అనురాగ రాగం పలికింది.

ఆ ఇద్దరి ఒడిలో ముద్దుల శిరీష కిలకిలమని నవ్వింది.


(అయిపోయింది)

### అంకితం

నవల రాయడానికి నన్ను ఉత్తేజాడిని చేసింది ఎ. పి రేయాన్స్ అందమైన వాతావరణం.. అందుకే నా ఈ ప్రథమ నవలను మా జనరల్ మేనేజరు శ్రీ పి కేశవన్ గారికి గౌరవ పూర్వకంగా అంకితం –

—రచయిత

# కోక్లియార్ పరికరము




★ పుట్టు చెముడుతో బాధపడుతున్న వాళ్ళకోసం అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఉత్తరంగా ఉన్న మిన్నెసోటా రాష్ట్రంలో ఉన్న – చెవికి సంబంధించిన సంస్థవారు– కోక్లియార్ పరికరాన్ని రూపొందించారు. కోక్లియా అనేది లోపలి చెవిలో ఉండే పలుచని పొరలాంటి గొట్టము. ధ్వని తరంగాలను గ్రహించి నాడీ కణాలకు అందించడంలో ఈ గొట్టం ప్రముఖమైన పాత్ర వహిస్తుంది.

వెలుపలి చెవికి మధ్యగా మైక్రోఫోన్ పెడతారు. ఇది గ్రహించే శబ్దాలు లోపలి చెవికి కర్ణభేరి ప్రకంపనల ద్వారా చేరుతుంది. ఇక్కడికి చేరిన శబ్ద తరంగాలను కోక్లియాలో అమర్చిన ఎలక్ట్రోడ్ సత్వరంగా సంగ్రహించి నాడీకణాలకు చేరవేస్తుంది. ఈ శబ్దాలకు సంబంధించిన జ్ఞానాన్ని నాడీ కణజాలం వెంటనే మెదడుకు చేరవేస్తుంది.

ఇది స్థూలంగా కోక్లియార్ పరికరం పని చేసే విధానం! దీనిని నిరాక్షేపంగా వాడవచ్చునని నిపుణులు అభిప్రాయపడినారు. పెదవుల కదలికలవల్ల ఏమి చదువుతున్నది తెలుసుకొనేందుకు వీలుగా ఈ మైక్రోఫోనుకు ఒక అనుసంధాన పరికరాన్ని కూడ అమర్చడం గొప్ప విషయంగానే భావించాలి.

చెవిటి వారికి ఇదెంతగానో తోడ్పడుతుంది. □

# లిఫ్ట్

కాకాని కమల



రాత్రి సమయం పది గంటలు దాటుతోంది.

ఆకాశం నల్లగా మబ్బుపట్టి చల్లగా గాలులు వీస్తున్నాయ్. ఇప్పుడో ఇంకో ఘడియకో పెద్ద వాన కురవచ్చు. వుండి వుండి "ఛమక్...."మని మెరుపులు మెరిసి మాయం అవుతున్నాయ్.

"అబిడ్స్" సెంటర్‌లోంచి వేగంగా స్కూటరుమీద వస్తున్నాడు మూర్తి. వర్షం రాకుండా తొందరగా ఇంటికి వెళ్ళాలన్నదే అతని తాపత్రయం.

మూర్తి ఒక పెద్ద ప్రయివేటుఫర్మ్‌లో పని చేస్తున్నాడు. ఆరోజు రాత్రి ఎనిమిది గంటలకి కంపెనీ తరపున ఒక పోష్‌హోటల్‌లో వి.ఐ.పి.స్‌కి కాన్ఫరెన్సు జరిగింది ఆ తరువాత డిన్నర్ కూడా వాళ్ళే అరెంజ్ చేశారు. ఆ ఫార్మాలిటీస్ అన్ని ముగించి బయట పడేసరికి ఆ సమయం అయ్యింది.

సినిమాలన్ని ఒదిలేసినట్లున్నారు.

అబిడ్స్‌లో షాపులన్ని కూడా చాలావరకూ మూసేశారు.

ఒకటి అరాగా మిగిలిఉన్న షాపులు కూడా షటర్సు దించి మూసే ప్రయత్నాల్లో వున్నారు.

రోడ్డుమీద జన సంచారం కూడా అంతగా లేదు

మూర్తి అబిడ్ సర్కిల్ దాటి "ఫరీన్" సినిమా హాలు మీదుగా సందు మలుపు తిరుగుతూ వుండగా హఠాత్తుగా అతని చేతులు హేండిల్‌బార్ మీదుగా కదిలి 'బ్రేకులు మీదకి వచ్చి గట్టిగా బిగుసుకున్నాయ్.

అంతే!

"కీచు....."మని శబ్దం చేస్తూ స్కూటర్ షడన్ బ్రేకుతో పుట్‌ఫాత్ వారగా ఆగిపోయింది.

కారణం-లేత వయసులో వున్న ఒక యువతి దాదాపు స్కూటరుకి అడ్డం పడుతున్నట్లుగ బస్సు స్టాపులోంచి రోడ్డు మీదకి వచ్చి కుడి చేతిని వేగంగా అటు-ఇటు కదుపుతూ స్కూటర్ని ఆపమన్నట్లు సైగలు చేసింది.

అంతే. అప్రయత్నంగానే మూర్తి రోడ్డు వారగా స్కూటర్ని ఆపు చేశాడు.

మూర్తి ఆ యువతికి దగ్గరగా వచ్చి స్కూటర్ని ఆపి కించిత్ ఆశ్చర్యంగా ఆమె మొఖంలోకి చూశాడు.

రెండు జడలతో తెల్లటి శరీర ఛాయతో లేత గులాబి రంగు చీరెలో.... లేత వయసులో అందంగా నాజూకుగా వుంది.

ఆమె భోజనానికి నల్లని హ్యాండ్‌బ్యాగ్ వ్రేలాడుతోంది. అసలే అందంగా వున్న ఆమె ఆ మెర్క్యురీ దీపాల కాంతిలో మరింత అందంగా వుంది.

మూర్తి కళ్ళు విప్పార్చి ఆశ్చర్యంగా ఆమె మొఖంలోకి చూడటం గమనించి ఆమె కొంచెం తడబడినట్లయి చిన్నగా సిగ్గుపడి ఆ తరువాత చక్కని ఇంగ్లీషులో చెప్పింది.

"తాను ఫరీన్ థియేటర్‌లో మొదటి ఆట సినిమా చూడటానికి ఫ్రెండ్సుతో కల్సి వచ్చానని. అయితే వాళ్ళ నెంబరు బస్సులు రావటంతో ఫ్రెండ్సు వెళ్ళిపొయ్యారని. కాని తను ఎక్కవలసిన నెంబరు బస్సు మాత్రం గంట నుంచి వేచి వున్న రాలేదని. రాత్రిళ్ళు ఆటోలో ఒంటరిగా వెళ్ళటం తనకి భయమని చెప్పి, అభ్యంతరం లేకపోతే కోటీ సెంటర్ దాకా తనకి లిఫ్ట్ "కావాలని" ఎంతో మర్యాదగా మూర్తిని "రిక్వెస్ట్" చేసింది.

తాను వెళ్ళేది కూడా ఆ రూటు మీదుగానే కావటంతో మరో ఆలోచన లేకుండా వెంటనే సంతోషంగా "విత్ ప్లెజర్! నో అబ్జక్షన్స్ ఎటాల్...." అంటూ తన అంగీకారాన్ని తెలియ చేశాడు.

ఆమె "థాంక్యూ వెరీమచ్ సర్" అంటూ చిరునవ్వుతో వచ్చి అతని వెనకాల పిలియన్ సీటు మీద సుతారంగా కూర్చుంది. ఫుట్ రెస్ట్‌మీద పాదాలు పెట్టుకుంది.

"బంతీ-చామంతీ ముద్దాడు కున్నాయిలే...."

సంతోషంగా మనసులోంచి ఈలపాట వస్తుంటే బలవంతాన అణచుకున్నాడు మూర్తి.

ఆమె కూర్చుని "ఓ. కె.!" సర్" అనగానే మరు నిమిషం స్కూటర్ వేగాన్ని అందుకుంది.

సరిగ్గా అదేక్షణంలో వాన తుంపర మొదలయ్యింది. దాంతో స్కూటర్ మరింత స్పీడు పెంచాడు. మధ్యలో సందుల్లో రెండు సార్లు స్పీడు బ్రేకర్సు వస్తే, వేగాన్ని ఏమాత్రం ఆపకుండా-- వాటిపై నుంచి "జంప్" చేసినట్లు చిన్న "జర్క్" ఇచ్చింది స్కూటరు.

ఆ కుదుపుకి-దానికి తోడు పైన పడుతున్న వర్షానికి ఆమె కొంచెం ఒణికినట్లయి చప్పున తన తామరతూడు లాంటి- అందమైన చేతిని అతని నడుం చుట్టూ బిగించి అతని వీపు మీదకి ఒరిగినట్లు జరిగి కూర్చుంది. అతని వేగానికి భయపడి పడిపోతానేమో! అన్న బెదురుతో అతని నడుంమీద బిగించిన చేతిని తియ్యలేదు.

"సారీసర్" అని మాత్రం చిన్నగా అంది.

"నెవ్వరు మైండ్" అన్నాడు ఆనందంలో తబ్బిబ్బు అవుతూ.

మెత్తగా ఆమె శరీరం వీపుని తాకుతుంటే గిలిగింతలు పెడుతున్నట్లు అతనిలో ఏవేవో అనుభూతులు.... చిలిపి కోర్కెలు......

మళ్ళీ-"బంతీ చామంతీ" అని పాడబోయి నాలిక్కరుచుకున్నాడు. వర్షం సన్నగా కురుస్తునే వుంది! స్కూటర్ దానిమానన అది వేగంగా పోతూనే వుంది!అతనికి ఈ అనుభూతి చాలా కొత్తగా, గిలిగింతగా వుంది.

చాలా సంవత్సరాలుగ సిటీలో స్కూటర్ నడుపుతున్నా ఇంతవరకూ ఏ అమ్మాయికి ఇలా లిఫ్టు ఇవ్వటం జరగలేదు. (అతనికి ఆ సరదా కోర్కె బలంగా వున్న అంత అదృష్టం కలగలేదు)కాని ఈ రోజు ఆ అవకాశం అయాచితంగా లభించినందుకు మనసులోనే ఆనంద పడ్డాడు.మళ్ళీ అంతలోనే హఠాత్తుగా అతనికి "కొలీగ్" రాజేష్ చెప్పిన ఒక చిన్న ఇన్సిడెంటు మెరుపులా జ్ఞాపకం వచ్చింది.

రాత్రి పూట ఒకసారి ఇలాగే రాజేష్ హోటల్లో భోజనం ముగించుకుని స్కూటర్‌మీద రూమ్‌కి వెడుతుంటే ఒక అమ్మాయి స్కూటర్ ఆపి "లిఫ్ట్" అడిగిందట!

కాని తీరా సగం దూరానికి వచ్చాక ఆమె–"ఒక యాభై రూపాయలు ఇస్తే ఆ రాత్రికి అతనితో గడపుతానని, తాను కాల్ గరల్‌ని"– అని చెప్పిందిట!

అప్పటికి రాజేష్ ఇంకా బ్రహ్మచారి కావటంవల్ల, అడపా దడపా ఇలాంటి జల్సాలు చేస్తూ వుండే- వాడు కావటంచేత, మరో మాట లేకుండా ఆ అమ్మాయికి యాభై రూపాయలు ఇచ్చి ఆ రాత్రి తన గదికి తీసుకెళ్ళి తెల్లవారు ఝామునే పంపించేశాడుట!

ఆ అమ్మాయి కూడా చాలా తెల్లగా అందంగా హుషారుగా వుందని రాజేష్ చెప్పినపుడు మూర్తి మనసు నిశ్శబ్దంగా మూలిగింది.

ఇప్పుడు హఠాత్తుగా మూర్తికి ఆ విషయం జ్ఞాపకం వచ్చింది.

"కొంపదీసి ఈమె కూడా అలాంటి బాపతు కాదు కదా?" అనుకున్నాడు.

కాని వెంటనే ఇంటి దగ్గర తన కోసం ఎదురుచూసే భార్య, ఇద్దరు పిల్లలు జ్ఞాపకం రాగానే వుసూరు- మంటూ చిన్నగా నిట్టూర్చాడు. అయినా–

ఒకవేళ ఆమె అలాంటిదే అయితే తనని "ఆ విషయం" గురించి ఏమని అడుగుతుంది? ఎలా అడుగుతుంది? బహుశా రాజేష్‌కి తటస్థపడిన అమ్మాయి లాగే ఈమె "అలాంటి బాపతే" అయి- వుంటుంది.....

లేకపోతే వయసులో వున్న ఒంటరి ఆడది, ఇంత రాత్రిపూట ధైర్యంగా స్కూటర్ లిఫ్టు అడిగిందంటే.... పైగా తన నడుం చుట్టూ చెయ్యి తిప్పి అంటుకొని కూర్చుందంటే తప్పకుండా అలాంటిదే అయి వుంటుంది. లలలా..... లలలా.....

ఆ ఆనందంతో ఈసారి పైకి సన్నగా ఈల పాట పాడుతూ స్కూటర్ని మరింత వేగం పెంచాడు.

కాని అతని ఆనందం ఎంతో సేపు నిలవలేదు.

ఆమె చిన్నగా అతని భుజం మీద తట్టినట్టు చేతితో కొట్టి ఆపమని రిక్వెస్ట్ చెయ్యటంతో మూర్తి చప్పున ఆలోచన్లనుంచి తేరుకుని చుట్టూ కలియ చూశాడు.

అతను వూహల్లో పడి సరిగా గమనించనే లేదు. కాని కోటీ సెంటరు వచ్చేసింది.

వానజల్లు కూడా తగ్గింది.

మూర్తి స్పీడు తగ్గించి పుట్‌పాత్ వారగా నెమ్మదిగా స్కూటర్ని ఆపాడు.

ఆమె చప్పున స్కూటర్ దిగి "థ్యాంక్యూ సర్! మీరు లిఫ్ట్ ఇయ్యకపోతే ఈ చీకట్లో ఈ వర్షంలో ఎంత ఇబ్బంది పడేదాన్ని. మీ మేలు జన్మలో మరిచిపోలేను సర్!" అంటూ చక్కని ఇంగ్లీషులో అతనికి కృతజ్ఞతలు చెప్పి మా ఇల్లు ఈ పక్క గల్లీలోనే సర్! ప్లీజ్ గివ్ మి లీవ్. గుడ్ నైట్" అంటూ చెప్పి సన్నని చిరునవ్వుతో మరో మాటకి అవకాశం లేకుండా పుట్‌పాత్ ఎక్కి ఎదురుగా వున్న గల్లీలోకి వెళ్ళిపోయింది.

ఆమె గురించి ఏమేమో వూహించుకున్న మూర్తికి ఆమె అలా వెళ్ళిపోవటంతో గొప్ప ఆశాభంగం కలిగినట్లు అయ్యింది.

కొద్ది క్షణాలు స్థంభించినట్లు ఏమీ తోచని వాడిలా అలాగే వుండి పొయ్యాడు.

ఆమె సందులో కన్ను మరుగు అయ్యేదాకాఅలా రెప్ప వెయ్యకుండా చూసి చిన్న నిట్టూర్పుతో తిరిగి స్కూటర్ స్టార్ట్ చేశాడు.

టాంకులో పెట్రోలు తక్కువగా వుంది.

ఆరోజు ఉదయం ఆఫీసుకి వచ్చే ముందే పొయిద్దామనుకుని హడావుడిలో మర్చిపొయ్యాడు.

మళ్ళీ రేపు ఉదయం ఆఫీసుకి వచ్చే ముందు బండి మొండికేస్తే ఇబ్బంది అవుతుంది కదా?

పొయించేస్తే సరిపోతుంది" అనుకుంటూ అల- వాటుగా ప్రక్కనే వున్న ఎప్పుడూ వచ్చే పెట్రోల్ బంక్ వైపు స్కూటర్ పోనిచ్చాడు.

ఆ అమ్మాయి తన నుంచి సహాయం పొంది ముష్పూ ముచ్చట లేకుండా అలా వెళ్ళిపోవటంతో అతనికి గొప్ప ఆశాభంగం అయ్యింది. మనసంత ఒక విధమైన అశాంతిగా తయారయ్యింది.

"అయినా తప్పేదేముంది?" అనుకుంటూ విసుగ్గా పెట్రోల్ బంక్ ముందు స్కూటర్ దిగాడు. పాత కస్టమర్ మూర్తిని చూస్తూనే ఓనర్ రాఘవులు కుర్చీలోంచి లేచి "గుడ్ నైట్ సార్" అంటూ ఎదురు వచ్చి "ఒరేయ్ యాద్గిరీ" అంటూ బోయ్‌ని కేకేశాడు.

అప్పుడే వచ్చిన స్టాక్‌ని లోపల సర్దుతున్న యాదగిరి ఆ పని వదిలి వచ్చి స్కూటర్‌లో నాలుగు లీటర్ల పెట్రోల్ నింపాడు.

"ఏంటి సార్ ఇంత లేటయ్యింది?" అన్నాడు రాఘవులు చిన్నగా ఆవులించి చిటికె వేస్తూ.

"కంపెనీ మీటింగ్ అయిందయ్యా" అంటూ బిల్లు పే చెయ్యటానికి పాంటు బ్యాక్ జేబులోకి చెయ్యి పోనిచ్చిన మూర్తి మరుక్షణం తేలు కుట్టినట్టు "కెవ్వు"మంటూ చేతిని చురుగ్గా వెనక్కి లాక్కున్నాడు.

కారణం–


జేబులో పర్సు లేదు!?

"అమ్మా! ఆడది!" అనుకున్నాడు అప్రయత్నంగా గుండెలమీద చెయ్యి ఆన్చుకుంటూ. □

## సింబాలిజమ్

ఏ దేశంలో నైనా
బిచ్చగాళ్ళు
ధనిక స్వాములే
రాజ్యమేలుతున్నారని
చెప్పడానికి
నిదర్శనాలు!!

—"సింహం"



# హైదరాబాద్ నోట్‌బుక్

తిరుమల రామచంద్ర

## వెర్రి తలలు వేస్తున్న సెక్యులరిజం :-

మన దేశంలో మనం పరాయి వారయి పోతున్నాము. మన మతం ప్రచారం చేసుకోలేము. మన దేవతలను వీధులలో ఊరేగించలేము. మేళ తాళాలతో పెళ్ళిళ్ళు జరుపుకోలేము! మన మత ప్రసక్తి రహితత్వం ఫలితా లివి – అన్నారు మిత్రులు డాక్టర్ రామరాజు ఒక సమావేశంలో కొన్ని సంవత్సరాల క్రితం. ఆయన మాటలు అప్పుడు కొంచెం విడ్డూరమనిపించాయి. కాని, తర్వాత దేశంలో జరుగుతున్న సంఘటనలు చూస్తే ఆ మాటలలో నిజం లేకపోలేదనిపించింది. మనం మన మత ప్రచారం చేసుకోరాదు. మంత్రులు కొబ్బరికాయ కొట్టి ఏ సమావేశానికయినా ప్రారంభోత్సవం జరిపినా గోల. ఇతర మతాల వారు ప్రతి సాయంకాలం వీధి మొగల్లో డప్పులు కొడుతూ తమ మత ప్రచారం చేసుకోవచ్చు. మనం చేస్తే మత పిచ్చి. మత ప్రసక్తి రహితత్వానికి మాయని మచ్చ. మన దేవాలయాల ముందు ఎవరైనా, బూతు నినాదాలు చేస్తూ వెళ్లవచ్చు. మనం మసీదుల ముందు వాద్యాలు వాయించరాదు. ఆమధ్య షేక్ అబ్దుల్లాగారు యూనిటీ అవార్డు ఇవ్వడానికి హైదరాబాదుకు వచ్చినప్పుడు ఈ మాటే అన్నారు. మసీదుల ముందు వాద్యాలు వాయించడంవల్ల కలిగే అపవిత్రత ఏమి లేదన్నారు. ఇక రాజకీయ పక్షాలు వోట్లకోసం మైనారిటీల వెంట పడడం పరిపాటి అయింది. ప్రపంచంలో ఎక్కడా మైనారిటీలకు లేని సౌకర్యాలు మన దేశంలో వున్నాయి. పశ్చిమాసియా దేశాలలో మైనారిటీలను తలఎత్త మనండి తల వేయి ప్రక్కలై కింద పడుతుంది. ఇటీవల నా మిత్రు డొకడు పశ్చిమాసియా దేశాల నుంచి వచ్చాడు. అతడు చెప్పిన సంగతులు విని ఆశ్చర్యపడలేదు గాని, కలవర పడ్డాను. బహిరంగంగా భారతీయులు పూజలు, పురస్కారాలు చేసుకోరాదు. బొట్టు పెట్టుకోరాదు. ఇక్కడ మన దేశంలో నేమో ఇతర మతాల వారికి పూర్తిగా స్వేచ్ఛ వుంది. వారు ఏమి చేసుకొన్నా అడిగేవాడే లేడు. మైనారిటీలకు మన దేశంలోని రక్షణ, సౌకర్యం చూసి ఇతర దేశాల మైనారిటీలు కూడా మన దేశానికి వస్తాయి. సుఖంగా వుంటాయి; తమ సంఖ్య పెంచుకొంటాయి. అప్పుడు మన దేశం మైనారిటీ స్థాన్ అయిపోయి. మెజారిటీ వర్గం స్వదేశంలోను, పరదేశంలోను, నిలువ నీడలేక పోవలసి వస్తుందేమో! ఈ దృష్టితో ఆలోచించినప్పుడు డిసెంబర్ 2 వ తేదీన నిజాం కళాశాల మైదానంలో జరిగిన బహిరంగ సభలో ఆర్. ఎస్. ఎస్. అధినేత శ్రీ బాలా సాహెబ్ దేవరస్ చేసిన విమర్శను పరిశీలించి చూడడం ఉచితం. రాజకీయవాదులు మైనారిటీలను బుజ్జగించడం జాతీయ సమైక్యాన్ని, దేశ సమగ్రతను సంరక్షించడానికి తోడ్పడదని ఆయన నొక్కి చెప్పారు. కుల మత ప్రాంత వివక్షలేక దేశ ప్రజలందరూ పరస్పర ప్రేమ స్నేహాలను పెంపొందించుకుంటే తప్ప, మహా త్యాగాలు చేయడానికి సంసిద్ధంగా వుంటే తప్ప సంపూర్ణ దేశ సమైక్యం సిద్ధించదని ఆయన అన్నారు. భారతదేశ విశిష్టత నానాత్వంలో ఏకత్వమని, దేశవాసులందరూ జాతి వారసత్వం తమదేననే భావన పెంపొందించుకొంటే తప్ప దేశ సమైక్య సమగ్రతలు భద్రంగా వుండవని ఆయన అన్నారు. "హిందుత్వ" అన్నపదం భారతీయు లందరికీ వర్తిస్తుందని, మైనారిటీ కమిషన్లకంటే, మానవ హక్కుల కమిషన్ను నియమించడం శ్రేయస్కరమని ఆయన సూచించారు. పౌరులలో క్రమశిక్షణ, నిజాయతీల విలువలను పునః ప్రతిష్ఠించేందుకే ఆర్. ఎస్. ఎస్. కృషి చేస్తున్నదని ఆయన అన్నారు. ఆర్. ఎస్. ఎస్. శీతాకాల శిబిరం రెండు రోజులపాటు జరిగిన పిదప ఈ బహిరంగ సమావేశం జరిగింది. సమావేశానికి ముందు 3000 మంది ఆర్. ఎస్. ఎస్. స్వయం సేవకలు నగర వీధుల్లో పరిక్రమించి మైదానంలో ఆ సంస్థ సంప్రదాయం ప్రకారం కవాతు చేశారు. ఈ కవాతులోను, పరిక్రమంలోను వరంగల్లు, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలవారు పాల్గొన్నారు. సమావేశానికి ప్రముఖ పారిశ్రామిక వేత్త శ్రీ ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించారు. ప్రముఖ మానసిక శాస్త్ర వైద్యులు డాక్టర్ పి. టి. చంద్రమౌళి, డాక్టర్ చిలుకూరి సుబ్రహ్మణ్యశాస్త్రి ప్రసంగించారు. ప్రారంభంలో హైదరాబాద్ సంఘ చాలక్ శ్రీ పర్వత రావు పరిచయం చేశారు.


### ఉపశ్రుతి:

ఎవరో భాషా పండితులు వచ్చారట. రాజకీయ పరిస్థితిని గురించి మాట్లాడుతారట. వస్తారా? అని ఒక మిత్రుణ్ని అడిగాను. భాషా పండితుడేమిటి? రాజకీయాలేమిటి ? – అని ఎదురు ప్రశ్న వేశాడు ఆ మిత్రుడు. ఏమిటి అలా అంటున్నారు? భాషా పండితులు నేడు అన్ని రంగాలలో పైనే ఉన్నారు; వైస్ చాన్సలర్లు అవుతున్నారు; రిజిస్ట్రార్లు అవుతున్నారు. డిప్యూటీ పోస్ట్‌మాస్టర్ జనరల్స్ అవుతున్నారు. గవర్నర్లు, ముఖ్య మంత్రులు రాయబారులూ అవుతున్నారు – అన్నారు మా సంభాషణ వింటున్న ఒకపెద్ద మనిషి. □

ఆంధ్రప్రదేశ్‌లో ఇంద్రజాల కళ వ్యాప్తికై కృషి చేస్తున్న భారత్ మేజిక్ సర్కిల్ పదమూడవ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాదులో జరిగిన సభలో సావనీర్‌ను ఆవిష్కరించిన శ్రీ టి. సుబ్బరామిరెడ్డి, డాక్టర్ దాశరథి, శ్రీ ఎమ్. వి. నారాయణరావు, సర్కిల్ సెక్రటరీ ప్రొఫెసర్ బి. వి. పట్టాభిరామ్‌లను చిత్రంలో చూడవచ్చు.



# అవీ... ఇవీ... అన్నీ...



**డా. సూర్యనారాయణమూర్తికి డి. లిట్.**

శ్రీ రావుల సూర్యనారాయణమూర్తికి వరల్డ్ యూనివర్శిటీ (యు. ఎస్. ఏ) వారు డాక్టర్ ఆఫ్ లిటరేచర్ పట్టాను ఇస్తున్నట్టు ప్రకటించారు. డాక్టర్ మూర్తిగారు సమర్పించిన "స్వతంత్ర భారతంలో గ్రామీణ చైతన్యం" అనే సిద్ధాంత గ్రంధానికి ఈ అవార్డు లభించింది.

వీరు ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానం పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరగా ఉన్నారు. గతంలో ఆంధ్రశ్రీ, జనశక్తి వంటి పత్రికలకు సంపాదకునిగా ఉండేవారు. ఆంధ్రప్రదేశ్ సమాచార విభాగంలో 1964 లో చేరి ఎన్నో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. "ఆంధ్రప్రదేశ్" పత్రికకు కొంతకాలంపాటు సంపాదకునిగా పనిచేశారు.

గాంధీ సాహిత్యాన్ని, భగవద్గీతను తెనిగించారు. వీరి పుస్తకాలు కొన్ని డిగ్రీ స్థాయి వారికి పాఠ్యాంశాలు కూడ! వీరు రాసిన "ఇంట్రడక్షన్ టు జర్నలిజమ్" అనే పుస్తకం గణించదగినదని ప్రముఖ పత్రికా రచయిత స్వర్గీయ ఎం. చలపతిరావు అన్నారు.

## స్వర్గీయ పద్మశ్రీ ఘంటసాల జయంతి ఉత్సవం

పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు అభిమాన బృందం, నిజామాబాదువారి నిర్వహణలో డిసెంబర్ 4న స్వర్గీయ ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి ఉత్సవం జరిగింది. శ్రీ ఎస్. ఎస్. కుమారశర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యువకళాకారులు కుమారి రుక్మిణి ప్రార్థనా గీతంతో ప్రారంభమై గాయకులు శ్రీయుతులు రవికుమార్, యు. వెంకటేశ్వరరావు, లక్ష్మీ నరసయ్య ఘంటసాల గానం చేసిన గీతాలను మధురంగా పాడి వినిపించారు. ఈ కార్యక్రమానికి వాద్య సహకారం శ్రీ టి. పవన్‌కుమార్, శ్రీ బి. భుజంగరావు, శ్రీ సురేష్ అందించారు. శ్రీ రవికుమార్ వందన సమర్పణ చేశారు. □

# పిల్లలు కుతూహలం

( 41 వ పేజీ తరువాయి)

అలా వుండేం...? ఇలా ఎందుకు లేదు...? ఎక్కడ నుంచి వచ్చింది...? ఎలా వచ్చింది..?" అనే అనేక ప్రశ్నలతో తల్లి దండ్రులను వేధిస్తారు.. "పాలు ఎందుకు తెల్లగా వున్నాయి" అనే ప్రశ్ననుంచి "విమానం పైకెలా ఎగురుతుంది...?" అని కుతూహలంతో అడుగుతుంటారు... ఈ కుతూహలం మూలంగానే ఫెరడే విద్యుశ్చక్తి గురించి న్యూటన్ గ్రావిటేషన్ గురించి యింకా ఎంతోమంది విద్యావంతులు శాస్త్రజ్ఞులు ఎన్నో వింతలను కనిపెట్టగలిగారు. వీరందరూ కూడా ఒకప్పుడు చిన్నపిల్లలే. కుతూహలంతో ప్రశ్నలడిగినవారేను... ప్రశ్నలడిగిన పిల్లలను విసుగుకొని "ఛీ భడవా.. నీకన్నీ విడ్డూరమే..." అంటూనో "వెధవ ప్రశ్నలు అధిక ప్రసంగాలున్నూ..." అంటూనో "నోరుముయ్యి పెద్ద ఆరిందలాగా... అన్నీ నీకు కావాలి. అన్నీ తెలుసుకోవాలా ఏం.." అని గదమాయించి సహజమైన కుతూహలాన్ని అణచివేస్తారు... దానితో "ఏమడుగుతే ఏమి వస్తుందోనని" భయంతో తమలో కలిగిన కుతూహలాన్ని అణచిపెట్టుకుంటారు పిల్లలు... దీనితో ఏమీ అడగకుండా వుండిపోయి, తెలుసుకోలేకుండా అలానే పరిజ్ఞానాన్ని పొందక మెదడు మొద్దువారిపోతుంది.. కుతూహలం చచ్చిపోతుంది. ఇది చిన్నపిల్లల వికాసానికి గొడ్డలిపెట్టు.. పిల్లలు కుతూహలంతో తెలుసుకోవాలనే ఆసక్తితో అడుగుతున్నారని చాలామంది తల్లిదండ్రులే కాక ఉపాధ్యాయులు కూడా ఎరుగరు.. వారి ప్రశ్నలు "పెంకితనంగా" పరిగణించి శిక్షిస్తారు కూడా.. ఎదుగుతున్న మనస్సు ఎన్నెన్నో తెలుసుకోవాలని వురకలేస్తుంది... దానిని ఓపికతో తెలియ జెప్పడం మన విధిగా భావించాలి. □










*Printed and Published for Nageswara Rao Estates Private Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, Gandhinagar. Vijayawada-3, Editor : S. Radhakrishna, Phones : P. B. X. : 61247, 61248 & 75667.*



"పులి"లో చిరంజీవి, రాధ

# యౌవన రాగపు వెల్లువలు
# నవ్వుల పాటకు పల్లవులు



## ఆప్కో చేనేతలు

మిసిమి వయసు తోటకు మనసులోని మాటకు
వాస్తవరూపాలు ఆప్కో కాటన్ చీరలు.
ఊహించే మధుర క్షణాలనే జలతారు
అంచులతో ఊరిస్తాయి ఆప్కో కాటన్ చీరలు.
పరువాలకు పరిమళాలు అందిస్తాయి.
మనసులో ప్రియభావనలు చిందిస్తాయి
ఆప్కో చేనేతలు.




దీ ఆంధ్రప్రదేశ్
స్టేట్ హేండ్లూం వీవర్సు
కోఆపరేటివ్ సొసైటి లిమిటెడ్
హైదరాబాద్-500029

kiron/apco/84 g9